ప్రభాతనవ

SINGIDI | తెలుగు దినపత్రిక

# సింగిడి

ప్రతి రంగూ ఓ నిజం

singidinews.com

ఆదివారం 20 సెప్టెంబర్ 2026 | సంపుటి: 1 | సంచిక: 94 | పేజీలు 12 | వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో యువతకు

## కొత్త అవకాశాలు

రోజ్‌గార్ మేళాలో ప్రధాని మోదీ

2

**20వ రోజ్‌గార్ మేళాలో 51 వేలకు పైగా నియామక పత్రాల పంపిణీ**

**దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో నిర్వహించిన ఉద్యోగ మేళా**





విద్యార్థులకు నెలాఖరులోగా

## రెండో జత యూనిఫాం

2

**యూనిఫాం ఇతర సామగ్రి పంపిణీపై ముఖ్యమంత్రి సమీక్ష**

# ఫిరాయింపు లొల్లి


## బిఆర్ఎస్, బిజెపిలకు కొత్త బలం

**కేసీఆర్ హయాంలో 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల విలీనం.... ప్రధాన ప్రతిపక్ష హోదా కోల్పోయిన కాంగ్రెస్**

**రేవంత్ ప్రభుత్వంలో బీఆర్ఎస్ సభ్యుల చేరికలు.... దానం నాగేందర్‌కు హైకోర్టు షాక్.. ఇక ఉప ఎన్నికేలే(నా)**

రాజకీయాల్లో ఎప్పుడూ ఓ నానుడి ఉంటుంది. అవసరమైతే కొట్టాలి.. లేదా కొట్టించుకోవాలి. సరిగ్గా ఇప్పుడు ఫిరాయింపు ఎమ్మెల్యేలపై హైకోర్టు ఇచ్చిన తీర్పు... ప్రస్తుత రేవంత్ ప్రభుత్వానికి చెంప పెట్టే...పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు చావు దెబ్బే. అయితే గతంలో ఎవరూ చేయని పని రేవంత్ చేశారా... ఎవరూ చేయని ఫిరాయింపులు ఈ ఎమ్మెల్యేలే చేశారా...ఈ అంశమే అందరూ ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది.

(హైదరాబాద్ బ్యూరో - సింగిడి)



తెలంగాణలో ఎమ్మెల్యేల మార్పిడి అంశం మరోసారి తెరపైకి వచ్చింది. అధికారంలో ఉన్నప్పుడు ఇతర పార్టీల నుంచి వచ్చిన వారిని రాజకీయ పునరేకీకరణగా సమర్థించుకోవడం.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అదే చర్యను ఫిరాయింపుగా విమర్శించడం రెండు ప్రధాన పార్టీల వైఖరిలో కనిపిస్తోంది. గతంలో కేసీఆర్ పాలనలో జరిగిన పరిణామాలు.. ప్రస్తుతం రేవంత్ ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న ఘటనలు ఇప్పుడు పోలికలకు దారితీస్తున్నాయి.

**కేసీఆర్ హయాంలో 12 మంది**

2018 ఎన్నికల్లో టీఆర్ఎస్ 88 స్థానాలు గెలుచుకుంది. కాంగ్రెస్‌కు 18 మంది సభ్యులు ఉండగా.. 2019లో వారిలో 12 మంది టీఆర్ఎస్ఎల్పీలో విలీనానికి లేఖ ఇచ్చారు. ఆ సంఖ్య మూడింట రెండొంతులు కావడంతో.. పదో షెడ్యూల్ నిబంధనల ప్రకారం స్పీకర్ విలీనాన్ని గుర్తించారు. దీంతో కాంగ్రెస్ బలం ఆరుకు తగ్గి.. ప్రధాన ప్రతిపక్ష హోదాను కోల్పోయింది. అప్పట్లో టీఆర్ఎస్ దీనిని రాజకీయ పునరేకీకరణగా అభివర్ణించగా.. కాంగ్రెస్ ప్రజల తీర్పును దెబ్బతీసే చర్యగా విమర్శించింది. ఒకే పరిణామానికి అధికార, ప్రతిపక్ష స్థానాలను బట్టి వేర్వేరు నిర్వచనాలు వచ్చాయి.

**ఇప్పుడు రేవంత్ హయాంలో**

2023 ఎన్నికల్లో కాంగ్రెస్ 64 సీట్లతో అధికారంలోకి వచ్చింది. బీఆర్ఎస్ 39 స్థానాలతో ప్రతిపక్షంగా నిలిచింది. అనంతరం ఆ పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు. వారిలో పది మందిపై అనర్హత పిటిషన్లు దాఖలయ్యాయి. స్పీకర్ వద్ద అవి తిరస్కరణకు గురికావడంతో.. బీఆర్ఎస్ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది.

**దానం కేసుతో మలుపు**

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ బీఆర్ఎస్ నుంచి గెలిచి.. అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడం కూడా ఈ కేసులో కీలక అంశంగా మారింది. తాజాగా తెలంగాణ హైకోర్టు.. స్పీకర్ నిర్ణయాన్ని పక్కన పెట్టి దానం నాగేందర్‌ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించింది. దీంతో ఖైరతాబాద్ స్థానం ఖాళీగా మారి.. ఉప ఎన్నికకు అవకాశం ఏర్పడింది.

**అప్పుడోలెక్క.. ఇప్పుడోలెక్క**

కేసీఆర్ పాలనలో 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు టీఆర్ఎస్‌లో విలీనం కావడంతో ప్రధాన ప్రతిపక్ష హోదా పోయింది. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉండగా.. బీఆర్ఎస్ నుంచి వెళ్లిన సభ్యులపై అనర్హత కోరుతోంది. దీంతో సహజంగానే రాజకీయ చర్చ మొదలైంది. అధికారంలో ఉన్నప్పుడు చేరికలకు ఒక పేరు.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అదే చర్యకు మరో ముద్ర వేయడం రెండు పార్టీలకు వర్తించే రాజకీయ ప్రమాణాలపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

**ఉప ఎన్నికకు వెళ్లేనా**

దానం నాగేందర్ సభ్యత్వం రద్దు కావడంతో ఖైరతాబాద్ స్థానం ఖాళీ అయింది. తదుపరి ప్రక్రియను ఎన్నికల సంఘం చేపట్టాల్సి ఉంటుంది. హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టును ఆశ్రయించే ఆలోచన లేదని, ఎన్నికలు వస్తే మళ్లీ పోటీ చేస్తానని నాగేందర్ ఇప్పటికే వెల్లడించారు. ఇప్పుడు ప్రభుత్వం ఉప ఎన్నికను ఎదుర్కొంటుందా.. లేక తదుపరి న్యాయపరమైన మార్గాన్ని ఎంచుకుంటుందా అన్నది ఆసక్తికరంగా మారింది.

**చివరికి ప్రశ్న ఇదే**

*ఎన్నికల్లో ఒక గుర్తుపై గెలిచిన ప్రజాప్రతినిధి అనంతరం మరో శిబిరంలోకి వెళ్తే.. దానిపై నిర్ణయం చట్టపరమైన ప్రక్రియలోనే తేలాల్సి ఉంటుంది. అయితే ఈ పరిణామాలు ఒక పెద్ద ప్రశ్నను మాత్రం ముందుకు తెస్తున్నాయి.. అధికారంలో ఉన్నప్పుడు ఒక ప్రమాణం.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరో ప్రమాణం కాకుండా.. ఫిరాయింపులపై అన్ని పార్టీలకు ఒకే విధానం ఎప్పుడు ఉంటుంది?*

వరంగల్ కొత్త ఎయిర్‌పోర్టుకు

## పేరు సూచించండి

సీఎం రేవంత్ రెడ్డి

వరంగల్ మామునూరు విమానాశ్రయం ఏర్పాటుకు చేపడుతున్న చర్యలు కీలక దశకు చేరుకున్నాయి. అనుమతుల దగ్గర నుంచి భూసేకరణ, సాంకేతిక పరమైన పరిశీలన దశలను దాటుకొని నిర్మాణ పనులను 3 ప్యాకేజీలుగా చేపట్టేందుకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్ణయించింది. ఇప్పటికే 2 ప్యాకేజీల పనులకు వేర్వేరుగా టెండర్లు పిలిచి ప్రక్రియను పూర్తి చేసిన విషయం తెలిసిందే.

**హైదరాబాద్, సెప్టెంబర్ 19 (సింగిడి)**

2






విశాఖలో 28,445 కుటుంబాలకు

## ఇళ్ల పట్టాల పంపిణీ

మీ ఇంటిపై సర్వ హక్కులు మీవేనని సీఎం చంద్రబాబు భరోసా

2

**నా జీవితం ధన్యమైంది.. ప్రాణం ఉన్నంతవరకు ఈ క్షణాన్ని గుర్తుపెట్టుకుంటాను.. విశాఖలో చంద్రబాబు ఎమోషనల్**

**విశాఖను విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని భారీ ప్రకటన**

**గోదావరి జలాలతో నగర నీటి కష్టాలు శాశ్వతంగా తీరుస్తామని హామీ**

**గత ప్రభుత్వ పాలనలో భూ కబ్జాలు, కూల్చివేతలపై తీవ్ర విమర్శలు**

విశాఖ నగరంలోని వేలాది పేద కుటుంబాల దశాబ్దాల కల నెరవేరింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమం ద్వారా 28,445 కుటుంబాలకు వారు నివసిస్తున్న ఇళ్లపై సర్వ హక్కులు కల్పిస్తూ పట్టాలు పంపిణీ చేశారు.

**విశాఖపట్నం, సెప్టెంబర్ 19 (సింగిడి):**

## ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ తెచ్చిన కరవు

శ్రీశైలం నుంచి 84 టీఎంసీలు వాడామన్నది పచ్చి అబద్ధం

**గత మూడేళ్లలో ఏపీ 718, తెలంగాణ కేవలం 216 టీఎంసీలే వాడిందన్న హరీశ్ రావు**

**రాష్ట్ర చరిత్రలోనే ఈ ఏడాది అత్యల్పంగా కృష్ణా జలాల వినియోగం**

**నీళ్లు, మోటార్లు ఉన్నా ప్రభుత్వం వాడుకోలేకపోయిందని విమర్శ**



**మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ప్రకృతి వైపరీత్యం వల్ల వచ్చినవి కావని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ అసమర్థత వల్ల ఏర్పడిన కాంగ్రెస్ మార్క్ కరవు అని ఆయన ఆరోపించారు.**

**హైదరాబాద్, సెప్టెంబర్ 19 (సింగిడి)**

కృష్ణా జలాలు వినియోగంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆయన ధ్వజమెత్తారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ, ఈ ఏడాది శ్రీశైలం నుంచి 84 టీఎంసీల నీటిని వినియోగించుకున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అసెంబ్లీలో పేర్కొనడం పచ్చి అబద్ధమని కొట్టిపారేశారు. వాస్తవానికి కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా ఇప్పటివరకు కేవలం 8 టీఎంసీల నీటిని మాత్రమే మళ్లించారని ఆయన స్పష్టం చేశారు. కల్వకుర్తి పథకంలోని ఐదు మోటార్లలో కేవలం రెండే పని చేస్తుండటం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. గత మూడేళ్లలో కృష్ణా నదీ

...మిగతా 2లో

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు

## పక్కదారి


2

పలు విద్యాసంస్థలపై విజిలెన్స్ తనిఖీలు

**రాజధాని నగరంలోని పలు ప్రైవేటు విద్యాసంస్థలపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. బోగస్ అడ్మిషన్లతో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు పక్కదారి పట్టిస్తున్నారని వివిధ కళాశాలలపై ఆరోపణ నేపథ్యంలో విజిలెన్స్ అధికారుల సోదాలు నిర్వహిస్తున్నారు.**

హైదరాబాద్ నగరంలో పలు ప్రైవేటు విద్యాసంస్థల్లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. బోగస్ అడ్మిషన్లతో ప్రభుత్వ నిధులు పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలతో అధికారులు సోదాలు చేస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు పక్కదారి పట్టిస్తున్నారని వివిధ కళాశాలలపై ఆరోపణలున్నాయి. దీంతో బయోమెట్రిక్, సిబ్బంది వివరాలను అధికారులు పరిశీలిస్తున్నారు.

**హైదరాబాద్, సెప్టెంబర్ 19 (సింగిడి)**



2

అనర్హత వేటుపై

## సుప్రీంకు దానం

దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తనపై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు అనుమతిస్తుందా లేదా అనేది వేచిచూడాల్సి ఉంది. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఎప్పుడు విచారణకు స్వీకరిస్తుందనే విషయంపైనా స్పష్టత రావాల్సి ఉంది.

**హైదరాబాద్, సెప్టెంబర్ 19 (సింగిడి)**

**పార్టీ ఫిరాయింపులను విపరీతంగా ప్రోత్సహించిన**

## వైఎస్ఆర్, కేసీఆర్

**కోర్టు తీర్పు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెంపపెట్టు: కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

**గతంలో సబిత, తలసాని రాజీనామా చేయకుండానే కేసీఆర్ వారికి మంత్రి పదవులు కట్టబెట్టారని మండిపాటు**

2

**భూదందాలు, అవినీతిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటీపడుతున్నాయని విమర్శ**

ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలకు చెంపపెట్టు అని కేంద్ర మంత్రికిషన్ రెడ్డి అన్నారు. ఈరోజు హైదరాబాదులో మీడియాతో మాట్లాడిన ఆయన... ఉమ్మడి ఏపీలో వైఎస్ రాజశేఖరరెడ్డి, తెలంగాణలో కేసీఆర్ ప్రజాస్వామ్య సూత్రాలను పక్కనబెట్టి ఫిరాయింపులను విపరీతంగా ప్రోత్సహించారని ఆరోపించారు. గతంలో సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లకు ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేయకుండానే మంత్రి పదవులు కట్టబెట్టారని మండిపడ్డారు.

**హైదరాబాద్, సెప్టెంబర్ 19 (సింగిడి)**



దానంపై కోర్టు తీర్పు...

## కేసీఆర్‌కు చెంపపెట్టు

టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

**తెలంగాణలో పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించింది కేసీఆరేనని విమర్శ**

**ప్రభుత్వాలను కూల్చివేయడం బీజేపీకి అలవాటుగా మారిందని ఆగ్రహం**

**దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను బీజేపీ నాశనం చేస్తోందని మండిపాటు**

**ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం కాంగ్రెస్‌దేనని ధీమా**

2

దానం నాగేందర్‌పై అనర్హత పిటిషన్ కేసులో కోర్టు ఇచ్చిన తీర్పు బీఆర్ఎస్, కేసీఆర్‌కు చెంపపెట్టు లాంటిదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణలో పార్టీ ఫిరాయింపుల దుష్ట సంస్కృతిని ప్రవేశపెట్టిందే కేసీఆర్ అని తీవ్రంగా విమర్శించారు. కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని, ఎన్నిక జరిగితే ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం కాంగ్రెస్‌దేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**హైదరాబాద్, సెప్టెంబర్ 19 (సింగిడి)**





## జన్వాడ భూములు పరిశీలించిన కాంగ్రెస్ బృందం

2

**అక్రమాలు జరిగాయని హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు**

రంగారెడ్డి జిల్లాలోని జన్వాడ ఫామ్‌హౌస్ భూములను కాంగ్రెస్ బృందం పరిశీలించింది. సీనియర్ నేత కోదండ రెడ్డి నేతృత్వంలోని బృందం ఈ భూముల పరిశీలన కోసం వెళ్లింది. అయితే కేటీఆర్ ఫామ్‌హౌస్ వద్దకు బీఆర్ఎస్ శ్రేణులు రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు వారిని పక్కకు తప్పించడంతో కాంగ్రెస్ బృందం భూములు పరిశీలించింది.

**హైదరాబాద్, సెప్టెంబర్ 19 (సింగిడి)**

# స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో యువతకు కొత్త అవకాశాలు

**రోజ్‌గార్ మేళాలో ప్రధాని మోదీ**

**20వ రోజ్‌గార్ మేళాలో 51 వేలకు పైగా నియామక పత్రాల పంపిణీ**

**దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో నిర్వహించిన ఉద్యోగ మేళా**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19 (సింగిడి)**

2047నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలనే లక్ష్యం దిశగా భారత్ అడుగులు వేస్తోందని, ఇందులో యువత పాత్ర చాలా కీలకమని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. భారత్ వివిధ దేశాలతో కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏలు) దేశ యువతకు కొత్త కెరీర్ అవకాశాలకు మార్గం సుగమం చేస్తున్నాయని అన్నారు. కొత్త మార్కెట్లకు భారత వ్యాపారులు చేరుకోవడంతో పాటు, యువతకు ఉద్యోగాలు, నైపుణ్యాల ఆధారంగా కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన 20వ రోజ్‌గార్ మేళాలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా యువతను ఉద్దేశించి ప్రధాని ఈ మేరకు మాట్లాడారు. ఈ సందర్భంగా 51వేల మందికి నియామకపత్రాలు అందజేశారు.

భారత్ ఇప్పటివరకు వివిధ దేశాలతో 40 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకుందని ప్రధాని మోదీ తెలిపారు. వీటి ద్వారా భారత వ్యాపారులకు కొత్త భాగస్వామ్యాలు, కొత్త మార్కెట్లు అందుబాటులోకి వస్తున్నాయని చెప్పారు. అదే సమయంలో యువతకు కెరీర్‌లో కొత్త మార్గాలు తెరుచుకుంటున్నాయని పేర్కొన్నారు. భారత యువత నైపుణ్యాలు, ప్రతిభపై ప్రపంచ దేశాల్లో విశ్వాసం పెరుగుతోందని మోదీ అన్నారు. ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలు, యువత నుంచి ప్రపంచానికి భారీ అంచనాలు ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వ సేవల్లో చేరుతున్న యువత ప్రతి నిర్ణయంలోనూ దేశాన్ని అభివృద్ధి, స్వావలంబన దిశగా తీసుకెళ్లే ఆలోచనను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. యువతకు ఇతర యువత పట్ల ప్రత్యేక బాధ్యత ఉందని చెప్పారు.

### బ్రిక్స్‌లోనూ యువత భాగస్వామ్యం

ఇటీవల ముగిసిన బ్రిక్స్ సదస్సును ప్రధాని మోదీ ప్రస్తావించారు. బ్రిక్స్ సహకారం కేవలం ప్రభుత్వాలకే పరిమితం కాకూడదని అన్నారు. భారత పారిశ్రామికవేత్తలు, రైతులు, మహిళలు, యువత కూడా ఈ భాగస్వామ్యంలో చురుకైన భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. అంతర్జాతీయ వేదికలపై భారత్ పాత్ర పెరుగుతున్న నేపథ్యంలో దేశ యువత తమ నైపుణ్యాలను మరింతగా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.

### 'నాగరిక్ దేవో భవ' స్ఫూర్తితో సేవ

ప్రతి రంగంలోనూ శరవేగంగా మార్పులు జరుగుతున్నాయని ప్రధాని మోదీ అన్నారు. 'నిరంతరం నేర్చుకుంటూనే మీరు ఈ స్థాయికి చేరుకున్నారు. ఇక్కడి నుంచి మళ్లీ కొత్త విషయాలు నేర్చుకునే సరికొత్త ప్రయాణం ప్రారంభమవుతుంది. మీరు ఎల్లప్పుడూ మీ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి. కొత్త సాంకేతికతను, కొత్త వ్యవస్థలను అర్థం చేసుకోవాలి. 'మిషన్ కర్మయోగి'ఈ లక్ష్యాన్ని చేరుకోవటంలో మీకు సాయపడుతుంది. ప్రభుత్వం అసలైన బలం పౌరులకు దానిపై ఉన్న నమ్మకమే. ఆ నమ్మకం ఎలా వస్తుందంటే.. పౌరులకు ప్రభుత్వంతో ఎలాంటి అనుభవం ఎదురైందనే దాన్ని వల్ల వస్తుంది. ప్రభుత్వ సేవలో మన తారకమంత్రం ఒక్కటే కావాలి. 'నాగరిక్ దేవో భవ'. పౌరులకు సేవ చేయడమంటే దేశానికి సేవ చేయడమే. మీ పనితీరు వల్ల ఏ పౌరుడి జీవితమైనా సులభతరమైతే, అప్పుడే మీ విజయం మరింత ఉన్నతస్థాయికి చేరుకుంటుంది' అని ప్రధాన మోదీ పేర్కొన్నారు.

### 51 వేల మందికి పైగా నియామక పత్రాలు

20వ రోజ్‌గార్ మేళాలో భాగంగా 51 వేల మందికి పైగా కొత్తగా నియమితులైన యువతకు నియామక పత్రాలు అందించారు. దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తగా ఎంపికైన అభ్యర్థులు రెవెన్యూ విభాగం, రైల్వేలు, హోం వ్యవహారాలు, ఆరోగ్యం–కుటుంబ సంక్షేమం, ఆర్థిక సేవలు, రక్షణ తదితర కేంద్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో విధుల్లో చేరనున్నారు. ఈ 20వ రోజ్‌గార్ మేళాతో కలిపి ఇప్పటి వరకు వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో సుమారు 12.75 లక్షల మంది యువతకు నియామక పత్రాలు అందినట్లు ప్రధాని కార్యాలయం వెల్లడించింది.

# అనర్హత వేటుపై సుప్రీంకు దానం



దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తనపై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు అనుమతిస్తుందా లేదా అనేది వేచిచూడాల్సి ఉంది. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఎప్పుడు విచారణకు స్వీకరిస్తుందనే విషయంపైనా స్పష్టత రావాల్సి ఉంది. ఒకవేళ దానం నాగేందర్ దాఖలు చేసిన ఎస్ఎల్‌పీని దేశ సర్వోన్నత న్యాయస్థానం విచారణకు స్వీకరించి అప్పీలు దాఖలుకు అనుమతిస్తే, హైకోర్టు తీర్పుపై దానం నాగేందర్ అప్పీలు చేసే అవకాశం ఉంటుంది. దానం నాగేందర్‌పై హైకోర్టు నిన్న (శుక్రవారం) అనర్హత వేటు వేసింది. బీఆర్ఎస్‌లో గెలిచిన దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీలో చేరడంతోపాటు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేశారంటూ బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ శాసన సభ్యుడు పాడి కౌశిక్ రెడ్డి వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ నిర్వహించిన సీజే ధర్మాసనం, దానంపై అనర్హత వేటు వేస్తూ తీర్పు వెలువరించింది. స్పీకర్, ఎన్నికల కమిషన్‌కు ఈ తీర్పు కాపీలు అందించాలంటూ రిజిస్ట్రీని ఆదేశించింది. అయితే పాడి కౌశిక్ రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్ దాఖలు చేశారు. దానం నాగేందర్ వ్యాజ్యం దాఖలు చేస్తే తన వాదనలు కూడా వినాలని కౌశిక్ రెడ్డి పిటిషన్‌లో పేర్కొన్నారు.

### హైకోర్టు తీర్పుపై స్పందించిన దానం నాగేందర్

హైకోర్టు తీర్పుపై దానం నాగేందర్ స్పందించారు. హైకోర్టు తీర్పును గౌరవిస్తున్నానని తెలిపారు. సుప్రీంకోర్టుకు వెళ్లే ఆలోచన లేదని ఆయన వివరించారు. ప్రజాక్షేత్రంలోనే, ఎన్నికల్లోనే పోరాడతామన్నారు. ఎన్నికల్లో పోరాడటం తనకు కొత్త కాదని దానం వివరించారు.
పోరాటాలు చేసి ఈ స్థాయికి వచ్చినవాడినని తెలిపారు.

### అక్టోబర్‌లో విచారణ

దానంపై అనర్హత వేటు వేయాలంటూ 2024 ఏప్రిల్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో బీఆర్ఎస్ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. 3 నెలల్లో నిర్ణయాన్ని వెలువరించాలంటూ సర్వోన్నత న్యాయస్థానం 2025 జులై 31న స్పీకర్‌కు గడువు విధించడంతో ఈ మార్చి 11న స్పీకర్ తీర్పు వెలువరించారు. స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ పిటిషన్లు దాఖలయ్యాయి. పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న మిగిలిన ఎమ్మెల్యేల పిటిషన్లపై విచారణ అక్టోబర్‌లో జరగనుంది.

# జన్వాడ భూములు పరిశీలించిన కాంగ్రెస్ బృందం



జన్వాడ వద్ద బుల్కాపూర్ నాలా ఆక్రమణలకు గురైందని, ఈ నాలా వాటర్ హుస్సేన్ సాగర్‌లో కలవాల్సి ఉందని, సామాజిక కార్యకర్త డాక్టర్ లుబ్నా శర్వత్ తెలిపారు. బుల్కాపూర్ నాలాపై ఆక్రమణలు జరిగి ఫామ్ హౌస్ నిర్మాణాలు చేపట్టారని వాటిని తొలగించాలని పోరాడుతున్నట్లు ఆమె తెలిపారు. ఎంపీ అనిల్ యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మల్లు రవి, ఆది శ్రీనివాస్ పలువురు భూములను పరిశీలించారు.
"అక్రమాల గురించి ప్రజలుకు తెలియజేయాలనే ఇక్కడికి వచ్చాం. ఫామ్‌హౌస్‌ను నాలాపై కట్టారు. ఫామ్‌హౌస్ నిర్మాణానికి అనుమతులు లేవు. ఫామ్‌హౌస్ ఎవరి పేరుపై ఉందో స్పష్టత లేదు. ఫామ్‌హౌస్ భూ లెక్కలు తేలుస్తాం" – మల్లు రవి, ఎంపీ

### జన్వాడ ఫామ్‌హౌస్ భవన నిర్మాణానికి అనుమతి లేదు

జన్వాడ భూములపై ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసిన ఎంపీ జన్వాడలో అక్రమ ఫాంహౌస్‌లు ఉన్నాయని ఫిర్యాదు చేశారు. ఇక్కడ భవన నిర్మాణానికి అనుమతి లేదని మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్‌లో చెప్పారు. గతంలో అడిగితే సర్పంచ్ అనుమతితో నిర్మించుకున్నట్లు యజమాని చెప్పారని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ప్రదీప్‌రెడ్డి కేటీఆర్‌కు బినామీ అని ఎంపీ చామల పేర్కొన్నారు.
ఫామ్‌హౌస్ వద్దకు వస్తే ప్రదీప్‌రెడ్డి కేసులు పెడతామన్నారని, ఇన్ని ఎకరాల్లో ఫామ్‌హౌస్ ఎలా కట్టుకున్నారని చామల కిరణ్ కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. సర్వే నంబర్ 311, 301, 313లో అక్రమాలు జరిగితే నిగ్గు తేలుస్తామని సవాల్ చేశారు. ఈ భూములన్ని సత్యం రామలింగరాజువని, డీ అండ్ యూ కంపెనీ పేరు మీద భూములు ట్రాన్స్‌ఫర్ చేశారని చామల తెలిపారు. వేరే కంపెనీ నుంచి ఈ భూములను ప్రదీప్‌రెడ్డి పేరుపై ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారని, 111 జీవోతో సత్యం రామలింగరాజు ఆస్తులు స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు.
సత్యం రామలింగరాజు కంపెనీ నుంచి ఈ భూములు రాజేష్‌కు బదిలీ అయ్యాయని, ఆ తరువాత ప్రదీప్ రెడ్డికి బదిలీ అయ్యాయని తెలిపారు. కొల్లగొట్టారని ఆరోపించారు.

# విశాఖలో 28,445 కుటుంబాలకు ఇళ్ల పట్టాల పంపిణీ

శనివారం విశాఖలో జరిగిన సభలో ఆయన లబ్ధిదారులకు కన్వీనియన్స్ డీడ్స్ అందజేశారు. ఈ నిర్ణయంతో వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపామని అన్నారు. వేలాది కుటుంబాల దశాబ్దాల కల సాకారమైన వేళ వారి ముఖాల్లో వెల్లివిరిసిన ఆనందాన్ని చూసి, "మీ ముఖాల్లో ఈ ఆనందం చూస్తే నా జీవితం ధన్యమైంది. నా ప్రాణం ఉన్నంతవరకు ఈ క్షణాన్ని గుర్తుపెట్టుకుంటాను" అంటూ చంద్రబాబు భావోద్వేగంతో ప్రసంగించారు. ఇది కేవలం పట్టాల పంపిణీ కాదని, పేద ప్రజల ఆత్మగౌరవానికి, వారి పిల్లల భవిష్యత్తుకు చేస్తున్న పట్టాభిషేకం అని ఆయన అభివర్ణించారు.

### దశాబ్దాల నిరీక్షణకు తెర.. సర్వ హక్కులు మీవే!

"కూడు, గూడు, గుడ్డ అనేది మా విధానం. 40 ఏళ్ల క్రితమే ఎన్టీఆర్ పేదలకు పక్కా ఇళ్లు ఇవ్వాలని సంకల్పిస్తే, అదే స్ఫూర్తితో మేము పనిచేస్తున్నాం" అని చంద్రబాబు గుర్తుచేశారు. దశాబ్దాలుగా సొంత కష్టార్జితంతో నిర్మించుకున్న ఇళ్లలో నివసిస్తున్నా, వాటిపై పూర్తి హక్కు లేదనే వేదనతో జీవిస్తున్న లక్షలాది మందికి ఈ పట్టాభిషేకం ద్వారా విముక్తి కల్పించామన్నారు.
"నిన్నటి వరకు మీ ఇంటిపై మీకు హక్కు లేదు. కానీ ఈరోజు నుంచి మీ ఇంటి మీద సర్వ హక్కులు మీవే. ఇకపై అనుమానం లేదు, వివాదం లేదు, భయం లేదు. తిరుగులేని హక్కు మాత్రమే ఉంటుంది" అని ఆయన భరోసా ఇచ్చారు. విశాఖ నగర పరిధిలోని గాజువాక, పెందుర్తి, భీమిలి, గోపాలపట్నం సహా 111 మండలాల్లోని 399 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 19.33 లక్షల చదరపు గజాల భూమిని క్రమబద్ధీకరించి, రూ. 8,874 కోట్ల రిజిస్ట్రేషన్ విలువైన ఆస్తిని ప్రజలకు అప్పగించామని తెలిపారు. "నిన్నటి వరకు అప్పు కావాలంటే గ్యారెంటీ లేని మీరు, ఈరోజు ఈ ప్రభుత్వం ఇచ్చిన పట్టాతో ఏ బ్యాంకులోనైనా స్వేచ్ఛగా రుణం పొందవచ్చు" అని ఆయన స్పష్టం చేశారు.

### మిగిలిన వారికీ త్వరలోనే పట్టాలు.. అధికారులకు ఆదేశాలు

ఈ కార్యక్రమంతోనే ఆగమని, వివిధ కారణాలతో ఆగిపోయిన మరో 35 కాలనీల్లోని 10,000 కుటుంబాలకు, వివాదాల్లో ఉన్న పంచగ్రామాల పరిధిలోని 12,149 మందికి కూడా త్వరలోనే పట్టాలు అందించి శాశ్వత హక్కులు కల్పిస్తామని చంద్రబాబు సభాముఖంగా హామీ ఇచ్చారు. "దేవాలయ భూముల వివాదాలను కోర్టుల ద్వారా పరిష్కరించి, వీలైనంత తొందరగా మీ అందరికీ న్యాయం చేసే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుంది" అని ఆయన కలెక్టర్‌కు వేదిక నుంచే ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న ప్రతి పేదవాడికీ హక్కు పత్రాలు అందించి, వారి ఆత్మగౌరవాన్ని కాపాడటమే తమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

### దాన్ని నిర్వహించాలంటే ఏనుగును మేపినట్టే!

గత ఐదేళ్ల పాలనపై చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "గత ఐదేళ్లు ఒక పీడకల. రూ.10 లక్షల కోట్ల అప్పులు, ఎక్కడ చూసినా కుంభకోణాలు, భూకబ్జాలు, కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారు. ప్రశాంతమైన ఉత్తరాంధ్రలో అలజడి సృష్టించారు. శుక్రవారం వచ్చిందంటే ఏ ఇంటిని కూలుస్తారో తెలియని భయానక వాతావరణం ఉండేది" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.
"విశాఖను రాజధాని చేస్తామంటూనే, రుషికొండపై ఋషులు తపస్సు చేసిన చోట ప్యాలెస్‌లు కట్టుకున్నారు. ఆ ప్యాలెస్‌ను ఏం చేయాలో కూడా అర్థం కాని దుస్థితిలో మేమున్నాం. దాన్ని నిర్వహించాలంటే ఏనుగును మేపినంత ఖర్చు అవుతుంది" అని ఎద్దేవా చేశారు. "నాడు కబ్జాలు, కూల్చివేతలు ఉంటే.. నేడు హక్కులు, భరోసా ఇస్తున్నాం. విధ్వంసం నుంచి వికాసం వైపు, భయం నుంచి భరోసా వైపు, నిరాశ నుంచి కొత్త ఆశల వైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్నాం" అని ఆయన ఉద్ఘాటించారు.

### విశాఖ ఇక విశ్వనగరం.. నీటి సమస్యకు ఎన్డీయే గ్యారెంటీ!

విశాఖపట్నం భవిష్యత్తుపై చంద్రబాబు స్పష్టమైన దార్శనికతను ఆవిష్కరించారు. "రాబోయే రోజుల్లో విశాఖ ఒక విశ్వనగరంగా మారబోతోంది. ఇది ఇక అన్‌స్టాపబుల్. గూగుల్, రిలయన్స్ డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులతో పాటు అనేక ఐటీ పరిశ్రమలు వస్తున్నాయి. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఒక గేమ్ ఛేంజర్‌గా మారనుంది" అని ఆయన ప్రకటించారు.
విశాఖ నీటి సమస్యపై కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ, "ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తగ్గినా, ముందుచూపుతో మేము పూర్తి చేసిన పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి నీళ్లు తెచ్చాం. ఇప్పుడు అదే కాలువను విశాఖ వరకు పొడిగించి, గోదావరి జలాలతో నగర దాహార్తిని శాశ్వతంగా తీర్చే బాధ్యత మా ఎన్డీయే ప్రభుత్వానిది. భవిష్యత్తులో విశాఖకు నీటి కొరత ఉండదు, ఇది మా గ్యారెంటీ" అని చంద్రబాబు గట్టిగా హామీ ఇచ్చారు.
అభివృద్ధికి అండగా నిలవండి.. 2047 లక్ష్యం మనదే!
పరిశ్రమలు తెచ్చి అవకాశాలు కల్పించడం తమ బాధ్యత అని, వాటిని అందిపుచ్చుకుని యువత ఎదగాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.




## వరంగల్ కొత్త ఎయిర్‌పోర్టుకు పేరు సూచించండి

మామునూరులో రానున్న కొత్త ఎయిర్‌పోర్టుకు ఏం పేరు పెట్టాలో సూచించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. వరంగల్‌లో ప్రపంచ స్థాయి విమానాశ్రయం కల సాకారం కాబోతోందని ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. మామునూరు విమానాశ్రయం ఏర్పాటు కోసం చురుగ్గా జరుగుతున్న ప్రక్రియలపై పత్రికల్లో వచ్చిన కథనాలను ఎక్స్‌లో సీఎం పోస్ట్ చేశారు. బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉన్నప్పటికీ వరంగల్ విమానాశ్రయం కలను నిజం చేయలేకపోయిందన్న రేవంత్ రెడ్డి ఆ పార్టీ నాయకులు కేవలం తమ కుటుంబ ప్రయోజనాలు, విలాసవంతమైన ఫామ్‌హౌస్‌లపైనే దృష్టి పెట్టారని వ్యాఖ్యానించారు. ఎట్టకేలకు కాంగ్రెస్ ప్రజాపాలనలో ఇప్పుడు వరంగల్ ఎయిర్‌పోర్ట్ కల సాకారం అవుతోందని స్పష్టం చేశారు. మామునూరు విమానాశ్రయం భూసేకరణ కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.295 కోట్లు కేటాయించడంతో పాటు అవసరమైన భూమిని సేకరించి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు అప్పగించడంతో క్షేత్రస్థాయిలో కల రూపుదిద్దుకుంటోందని పేర్కొన్నారు. ఇది కేవలం విమానాశ్రయం మాత్రమే కాదని, పరిశ్రమలు, పర్యాటకం, విద్య, ఉద్యోగాలు పెట్టుబడులకు కొత్త గేట్‌వే అని రేవంత్ రెడ్డి అభివర్ణించారు. అభివృద్ధి చెందుతున్న, అనుసంధానించబడిన తెలంగాణ రాష్ట్రానికి కొత్త చిహ్నంగా నిలవనున్న వరంగల్ మామునూరు విమానాశ్రయం నుంచి ప్రయాణించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు పక్కదారి

ఇబ్రహీంపట్నంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలతో పాటు పలు ప్రైవేటు విద్యాసంస్థల్లో విజిలెన్స్ అధికారుల సోదాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని పలు విద్యాసంస్థల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల సోదాలు నిర్వహిస్తున్నారు. ఇబ్రహీంపట్నంలోని గురునానక్ యూనివర్సిటీలో ఈ రోజు ఉదయం నుంచి అధికారులు తనిఖీలు జరుపుతున్నారు. ఈ తనిఖీల్లో విద్యార్థుల వాస్తవ సంఖ్య, కళాశాల రికార్డులు, ప్రవేశాల వివరాలు, స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన డేటా తదితర అంశాలను అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే సోదాలకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారులు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

## విద్యార్థులకు నెలాఖరులోగా రెండో జత యూనిఫాం

**వచ్చే ఏడాది పాఠశాలలు తెరచిన రోజే నోట్ బుక్స్ యూనిఫామ్ అందజేయాలి**

**యూనిఫాం ఇతర సామగ్రి పంపిణీపై ముఖ్యమంత్రి సమీక్ష**

**హైదరాబాద్ సెప్టెంబర్ 19**




విద్యార్థులకు అందించే యూనిఫాం మరింత ఆకర్షణీయమైన రంగుల్లో ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. డిజైన్లలో వైవిధ్యానికి ప్రయత్నించాలని చెప్పారు. విద్యార్థులకు అందించే యూనిఫాం, ఇతర సామగ్రి పంపిణీపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్స్ స్కూల్స్ పిల్లలకు ఒక జత యూనిఫాం పంపిణీ పూర్తయిందని, రెండో జత యూనిఫాంను నెలాఖరులోగా అందజేస్తామని సమావేశంలో అధికారులు తెలియజేశారు. కేజీబీవీ, మోడల్ స్కూల్ విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులందరికీ నోటు పుస్తకాలు పంపిణీ పూర్తయిందన్నారు. ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్స్ స్కూల్స్, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలోని విద్యార్థులందరికీ ప్లేట్లు, గ్లాసులు, కటోరాలు, స్పూన్లు, కప్పులు, కార్పెట్లు, బెడ్‌షీట్లు, టవళ్లు పంపిణీ పూర్తయిందని అధికారులు వివరించారు. వచ్చే ఏడాది పాఠశాలలు తెరిచిన రోజే యూనిఫాం, ఇతర సామగ్రి విద్యార్థులకు అందేలా ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న విద్యార్థులకు అదనంగా 10 శాతం విద్యార్థులు పాఠశాలల్లో చేరే అవకాశం ఉన్నందున, అందుకు తగినట్లు ప్రణాళిక రూపొందించు కోవాలని చెప్పారు. ఈ ఏడాది అందించిన యూనిఫాం, ఇతర సామగ్రి నాణ్యతపై తల్లిదండ్రుల నుంచి సంతృప్తి వ్యక్తమైందని అన్నారు. సమీక్షలో ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డితో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## పార్టీ ఫిరాయింపులను విపరీతంగా ప్రోత్సహించిన వైఎస్ఆర్, కేసీఆర్

బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూనే దానం నాగేందర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారని, బీజేపీ శ్రేణులు జరిపిన నిరంతర న్యాయపోరాటం వల్లే ఆయనపై అనర్హత వేటు ముప్పు వచ్చిందని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు రెండూ భూదందాలు, అవినీతిలోనే పోటీపడుతున్నాయని... 'దోచుకోవడం–దాచుకోవడం' తప్ప ప్రజాక్షేమం పట్టడం లేదని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ పాలనపై అనేక అవినీతి ఆరోపణలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పటివరకు వారిపై ఏలాంటి కఠిన చర్యలు తీసుకోకుండా 'మ్యాచ్ ఫిక్సింగ్' రాజకీయాలు నడుపుతున్నారని విమర్శించారు. ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలు నెరవేర్చలేక ప్రజల దృష్టిని మళ్లించడానికే ఇరు పార్టీలు పరస్పరం నాటకాలు ఆడుతున్నాయని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు కాంగ్రెస్ ఎంపీ టికెట్ ఏ ప్రాతిపదికన ఇచ్చారో రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాబోయే ఏ ఎన్నికలకైనా బీజేపీ సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందని వెల్లడించారు.



## అమిత్ షాకు స్వస్థత

**హుబ్బళ్లి పర్యటనలో అస్వస్థతకు గురైన అమిత్ షా**

**మెడికల్ కళాశాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి గైర్హాజరు**

**వైద్యుల సూచన మేరకు హోటల్‌లోనే విశ్రాంతి**

**ఆయన స్థానంలో పాల్గొన్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి**

**హుబ్బళ్లి సెప్టెంబర్ 19 (సింగిడి)**

కర్ణాటక పర్యటనలో ఉన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా శనివారం అస్వస్థతకు గురయ్యారు. దీంతో హుబ్బళ్లిలో ముందుగా నిర్ణయించిన కార్యక్రమానికి ఆయన హాజరు కాలేకపోయారు. వైద్యులు విశ్రాంతి తీసుకోవాలని సూచించడంతో ఆయన హోటల్‌కే పరిమితమయ్యారు.
హుబ్బళ్లిలోని కేఎల్‌ఈ జగద్గురు గంగాధర్ మహాస్వామిగళు మూరుసవిర్మఠ్ మెడికల్ కాలేజీ నూతన భవనాన్ని, 1,200 పడకల కేఎల్‌ఈ హాస్పిటల్ అండ్ మెడికల్ రీసెర్చ్ సెంటర్‌ను అమిత్ షా ప్రారంభించాల్సి ఉంది. రూ.700 కోట్ల వ్యయంతో ఈ మెడికల్ కాలేజీ భవనాన్ని నిర్మించారు. ఈ కార్యక్రమం నిమిత్తం షెడ్యూల్ ప్రకారమే శుక్రవారం రాత్రి ఆయన హుబ్బళ్లి చేరుకుని ఒక హోటల్‌లో బస చేశారు.
అయితే, శనివారం ఉదయం ఆయన అనారోగ్యానికి గురికావడంతో ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. అమిత్ షా గైర్హాజరీలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, కర్ణాటక వైద్య విద్యా శాఖ మంత్రి శరణ్ ప్రకాశ్ పాటిల్, మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. అనారోగ్య కారణాల వల్లే అమిత్ షా ఈ కార్యక్రమానికి హాజరు కాలేకపోయారని కేఎల్‌ఈ సొసైటీ ఛైర్మన్ ప్రభాకర్ కోరే స్పష్టం చేశారు.

## ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ తెచ్చిన కరవు

యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) గణాంకాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ 718 టీఎంసీల నీటిని వినియోగించుకోగా, తెలంగాణ కేవలం 216 టీఎంసీలకే పరిమితమైందని ఆయన వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2024–25 ఆర్థిక సంవత్సరంలోనే అత్యంత తక్కువ స్థాయిలో కృష్ణా జలాలను వినియోగించుకోవడం అత్యంత విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు.
"నీళ్లు అందుబాటులో ఉన్నాయి, ఎత్తిపోసేందుకు మోటార్లు సిద్ధంగా ఉన్నాయి. అయినప్పటికీ నీటిని మళ్లించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉంది. అందుకే ఇది కాలం తెచ్చిన కరవు కాదు, కాంగ్రెస్ తెచ్చిన కరవు" అని ఆయన ఎద్దేవా చేశారు. ఏపీ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు, వెలిగొండ ప్రాజెక్టుల ద్వారా అక్రమంగా నీటిని తరలించుకుపోతున్నా, తెలంగాణ ప్రభుత్వం మౌనంగా ఉండటం దారుణమని దుయ్యబట్టారు.

## దానంపై కోర్టు తీర్పు... కేసీఆర్‌కు చెంపపెట్టు

"గతంలో టీడీపీ టికెట్‌పై గెలిచిన తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను, కాంగ్రెస్ టికెట్‌పై గెలిచిన సబిత ఇంద్రారెడ్డిని బీఆర్ఎస్‌లో చేర్చుకుని మంత్రి పదవులు ఇచ్చింది కేసీఆర్ కాదా?" అని ప్రశ్నించారు. కేసీఆర్ చర్యల వల్లే రాష్ట్రంలో ఫిరాయింపుల సంస్కృతి పెరిగిపోయిందని ఆరోపించారు. అదే సమయంలో బీజేపీపైనా ఆయన విమర్శలు గుప్పించారు. ప్రభుత్వాలను కూల్చివేయడం, పార్టీలను చీల్చడం బీజేపీకి అలవాటని అన్నారు. దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య వ్యవస్థను బీజేపీ నాశనం చేస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్, బీజేపీ ఇద్దరూ ఒకే తరహా రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.

ప్రభాతనవ సింగిడి తెలుగు దినపత్రిక
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
ఆదివారం
20-9-2026

# ఎస్ఐఆర్ ధ్రువపత్రాల అప్లోడింగ్‌లో తప్పులు లేకుండా చర్యలు తీసుకోండి




- రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశం

**మేడ్చల్ కలెక్టరేట్, సెప్టెంబర్ 19 (సింగిడి):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) నోటీసుల హియరింగ్, ధృవపత్రాల అప్ లోడింగ్‌లో ఎలాంటి తప్పులు జరుగకుండా పటిష్టంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) నోటీసుల హియరింగ్, ధృవపత్రాల అప్ లోడింగ్ ప్రక్రియలో భాగంగా శుక్రవారం ఉప్పల్, హబ్సిగూడ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ హియరింగ్ ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి, జిల్లా ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉప్పల్ జోనల్ కమీషనర్ రాధిక గుప్తా, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డిలు సిఈఓకు పుష్పగుచ్ఛం అందించారు. ఓటును నిర్ధారించే ప్రక్రియ, ఎన్నికల సంఘం నిర్ధారించిన ధృవీకరణ పత్రాల సమర్పణ, క్షేత్రస్థాయి సహాయం, రికార్డుల పరిశీలన మరియు ధృవీకరణ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) హియరింగ్ ప్రక్రియను నిబంధనల మేరకు పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలను, సూపర్వైజర్లను, బిఎల్ఓలను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశించారు. జిల్లాలో మ్యాప్పింగ్ జరగకుండా ఉన్న ఓటర్లు మరియు ఓటర్ కార్డ్ లో ఉన్న వ్యత్యాసాల కేటగిరీలకు సంబంధించిన రికార్డులు, దరఖాస్తుల ధృవీకరణ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని, నోటీస్ అందిన ఓటర్లు హియరింగ్‌కు హాజరయ్యే అభ్యర్థుల వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి, అవసరమైన ఆధారాలను ధృవీకరించిన అనంతరం మాత్రమే తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. అర్హత కలిగిన ఓటర్ల వివరాలు క్రమపద్ధతిలో నమోదు అయ్యేలా, సంబంధిత పత్రాల పరిశీలనలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తి చేసేందుకు తగినంత సిబ్బందిని నియమించి, రోజువారీ లక్ష్యాలు, ప్రామాణిక విధానాలు, సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో పనులను కొనసాగించాలని సూచించారు. హియరింగ్ నిర్వహణ, దరఖాస్తుల పరిశీలన, అభ్యంతరాల పరిష్కారం తదితర అంశాలను సమీక్షించి, ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బిఎల్ఓలు నిర్వహిస్తున్నరిజిష్టర్లను, కంప్యూటర్లో ధవృపత్రాల అప్ లోడింగ్ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ తహసీల్దార్ ఫూల్‌సింగ్, డిప్యూటి కమీషనర్, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, సూపర్ వైజర్లు, బిఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

## శిష్యుడి విజయమే గురువుకు అతిపెద్ద గౌరవం




- బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 19 (సింగిడి):** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని "ట్రస్మా గ్రేటర్ కుత్బుల్లాపూర్" ఆధ్వర్యంలో 125 - గాజులరామారం డివిజన్ పద్మావతి కన్వెన్షన్ లో నిర్వహించిన "గురు సన్మాన్ పురస్కార్ 2026" కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరైనారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని 75 ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 150 మంది ఉపాధ్యాయులను శాలువాతో సత్కరించి మెమోంటోలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుతూ, క్రమశిక్షణతో కూడిన బంగారు భవిష్యత్తును రూపొందించడంలో ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని, శిష్యుడి విజయమే గురువుకు అతి పెద్ద గౌరవమని, ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన ఉపాధ్యాయులపై విద్యార్థులను సన్మార్గంలో తీర్చిదిద్దే బాధ్యత నేటి నుండి రెట్టింపు అయిందన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ఎంఏ రాష్ట్ర అధ్యక్షులు కె. రామేశ్వర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బిర్రు ఆంజనేయులు గౌడ్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోశాధికారి గిరిబాబు, అనిల్, కోల వెంకటేష్, టీఆర్ఎస్ఎంఏ జిల్లా ఉపాధ్యక్షులు కైతి శ్రీనివాసరెడ్డి, గడ్డమీది బాలరాజ్, భూపతి రెడ్డి, సిహెచ్. నరసింహులు గౌడ్, ఆంజనేయులు, మహేందర్ రెడ్డి, వివిధ పాఠశాలలకు చెందిన కరస్పాండెంట్, పాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్రాజ్, అడ్వకేట్ కమలాకర్, తెలంగాణ సాయి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


## ఎల్ఓసి మంజూరు చేసిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



**వికారాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 19 (సింగిడి):** అనారోగ్యంతో బాధపడుతున్న ఎన్కేపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి ప్రజాపాలనలో ఎల్ ఓ సి కొరకు దరఖాస్తు చేసుకున్న రెండు రోజుల్లోనే మంజూరు చేసిన తెలంగాణ రాష్ట్ర శాసనసభాధిపతి గడ్డం ప్రసాద్ కుమార్ కు మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షులు ఎన్కేపల్లి గ్రామ సర్పంచ్ కోస్గి, సురేందర్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్కేపల్లి గ్రామానికి చెందిన మంగలి రాములు అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి సిఎంఆర్ఎఫ్ పథకంలో భాగంగా ప్రజా పాలన లో ఎల్ ఓ సి కొరకు దరఖాస్తు చేసుకున్న రెండు రోజుల్లోనే ఎల్ఓసిని మంజూరు చేసిన తెలంగాణ రాష్ట్ర శాసనసభాధిపతి గడ్డం ప్రసాద్ కుమార్ కు వారి కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. మారుమూల గ్రామాల ప్రజలు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తక్షణమే సీఎంఆర్ఎఫ్ పథకం, ఎల్ఓసిని మంజూరు చేయడం హర్షనీయమని అన్నారు.

## ఘనంగా గణనాథుని అన్నదాన కార్యక్రమం

**పాల్గొన్న రామచంద్రపురం డివిజన్ బీజేపీ అధ్యక్షుడు నర్సింగ్ గౌడ్**



**రామచంద్రాపురం, సెప్టెంబర్ 19 (సింగిడి):** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ కాలనీలో గణసేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గత 35 సంవత్సరాలుగా ఇక్కడ భక్తిశ్రద్ధలతో గణనాథుని పూజలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో బీజేపీ రామచంద్రాపురం డివిజన్ అధ్యక్షుడు ఎన్. నర్సింగ్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్. నర్సింగ్ గౌడ్ మాట్లాడుతూ శ్రీనివాస్ నగర్ కాలనీలో గత మూడున్నర దశాబ్దాలుగా గణసేన యూత్ అసోసియేషన్ సభ్యులు సమష్టిగా, ఎంతో నిబద్ధతతో గణపతి ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయం. ఇలాంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు అన్నదానం చేయడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. ఆ విఘ్నేశ్వరుని కృపాకటాక్షాలతో డివిజన్ ప్రజలందరి జీవితాల్లోని విఘ్నాలు తొలగిపోయి, అందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను. యువత భక్తిభావంతో పాటు సమాజ సేవలో నిరంతరం ముందుండాలి" అని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అంజయ్య, గణసేన యూత్ అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక నాయకులు, కాలనీ పెద్దలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆటో కార్మికుల సమస్యలపై మున్సిపల్ కార్యాలయ ముట్టడి

**జేఏసీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసిన పోలీసులు**



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 19 (సింగిడి):** తెలంగాణ స్టేట్ స్వచ్ఛ ఆటో టిప్పర్ జేఏసీ చైర్మన్ ఎత్తరి గోపి, హెచ్ఎంఎస్ ప్రెసిడెంట్ ఎడపాక వీరేష్, చెవిటి వెంకన్న, రాజు, రామంజి తదితరులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రోజురోజుకూ పెరుగుతున్న స్వచ్ఛ ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్యాలయం ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో ఈ ముందస్తు అరెస్టులు జరిగినట్లు జేఏసీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఉన్న జేఏసీ నాయకులను పరామర్శించేందుకు ఎంఆర్పిఎస్ నాయకులు డప్పు రామస్వామి, తొండ వెంకటన్న, ప్రవీణ్ మర్యాదపూర్వకంగా కలిసి తమ సంఘీభావం తెలిపారు. స్వచ్ఛ ఆటో కార్మికుల జీవనోపాధికి సంబంధించిన సమస్యలను ప్రభుత్వం, అధికారులు వెంటనే పరిష్కరించాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు.

## సేవా భావంతోనే నిజమైన సంతృప్తి

**శ్రీ గంగా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ బిర్రు బాల మల్లయ్య**



**మల్కాజిగిరి, సెప్టెంబర్ 19 (సింగిడి):** మనకు ఉన్న దాంట్లోనే పేదవారికి తోచిన సేవా భావం తో సహాయం చేసినప్పుడే నిజమైన సంతృప్తి ఉంటుందని శ్రీ గంగా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బాల మల్లయ్య అన్నారు. నేరేడ్ మెట్ చౌరస్తాలోని బస్టాండ్ వద్ద శ్రీ గంగా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ బిర్రు బాల మల్లయ్య ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్టు ద్వార నిరు పేదలకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో ట్రాస్టు అడ్వైజర్ సెర్ల అనిల్, సభ్యులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ విద్యాలయం టాయిలెట్ల శుభ్రతను ఉద్యమంగా మార్చిన ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి



**వికారాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 19 (సింగిడి):** స్వచ్ఛ విద్యాలయం పరిశుభ్రతకు కొత్త అధ్యాయయానికి శ్రీకారం చుట్టిన చేవెళ్ళ ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి కృషికి ప్రజల ప్రశంసలు అందుకుంటున్నారు. స్వచ్ఛతే సేవగా ఎంపీ వినూత్న అడుగు వేశారు. దేశంలోనే ఒక వినూత్న కార్యక్రమంగా నిలిచిన వైనం. ప్రభుత్వ స్కూల్స్ ల లో టాయిలెట్ల పరిశుభ్రతలో ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి ప్రత్యేక చొరవ. పరిశుభ్రమైన పాఠశాలల కోసం ఎంపీ ముందడుగు విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యంగా ఎంపీ వినూత్న కార్యక్రమం ప్రభుత్వ పాఠశాలలకు పరిశుభ్రత బాట చూపిన ఎంపీ. టాయిలెట్ల శుభ్రతకు ఎంపీ ప్రత్యేక మిషన్. గత 7 సంవత్సరాల నుండి స్వచ్ఛతకు శ్రీకారం చుట్టిన కొండ విశ్వేశ్వర్ రెడ్డి. పాఠశాల పరిశుభ్రతపై ఎంపీ ఫోకస్. విద్యార్థుల కోసం స్వచ్ఛత ఉద్యమం. దేశంలో ఎక్కడా లేని కార్యక్రమం ఎంపి చేపట్టిన వినూత్న ఆదర్శ కార్యక్రమం. స్వచ్ఛ విద్యాలయంతో ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రత. చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ఆటో ద్వారా పాఠశాలల టాయిలెట్ల శుభ్రత కార్యక్రమం. ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రతను మెరుగుపరచాలనే లక్ష్యంతో చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి స్వచ్ఛ విద్యాలయం పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఆటో ద్వారా పాఠశాలల టాయిలెట్లను శుభ్రం చేసే చర్యలు కొనసాగుతున్నాయి. విద్యార్థులకు పరిశుభ్రమైన మరుగుదొడ్లు అందుబాటులో ఉండటం ఆరోగ్య పరిరక్షణతో పాటు పాఠశాల వాతావరణాన్ని మెరుగుపరచడంలో కీలకమనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం కొనసాగుతోంది. పాఠశాలల వారీగా టాయిలెట్లను శుభ్రం చేస్తూ పరిశుభ్రతపై అవగాహన కూడా కల్పిస్తున్నారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో కొంత మంది యువకులకు ఉపాధి కూడా లభిస్తుంది. చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి చేపట్టిన స్వచ్ఛ విద్యాలయం కార్యక్రమానికి ప్రజలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ప్రభుత్వ పాఠశాల ల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ ప్రత్యేక వాహనం ద్వారా టాయిలెట్ల శుభ్రత చేపట్టడం వినూత్న చర్యగా పలువురు అభిప్రాయపడు తున్నారు. పరిశుభ్రమైన పాఠశాల వాతావరణం విద్యార్థుల ఆరోగ్యానికి, చదువుకు అనుకూలంగా ఉంటుందని పేర్కొంటూ ఈ తరహా కార్యక్రమాలు మరిన్ని పాఠశాలలకు విస్తరించాలని స్థానికులు కోరుతున్నారు. ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి పాఠశాలల క్లీన్ పై ప్రత్యేక దృష్టి పెట్టి నందుకు పలువురు అభినం దిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఎక్కడా లేని విధంగా వికారాబాద్ చేవెళ్ల నియోజకవర్గాలలో ఈ కార్యక్రమం కొనసాగుతుంది. అయితే, జేకేఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని స్థానికంగా వినూత్న ప్రయత్నంగా భావిస్తున్నారు. పాఠశాలల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ చేపట్టిన ఈ కార్యక్రమం ప్రత్యేక గుర్తింపు పొందుతోంది. ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి చేపట్టిన ఈ కార్యక్రమానికి దేశంలో ఉన్న పలురు ఎంపీలు కూడా అభినందిస్తున్నారు. ఎంపీ చేపట్టిన ఈ కార్యక్రమానికి ఇతర రాష్ట్రాలలో కూడా కొందరు ఎంపీలు ఆదర్శంగా తీసుకుం టున్నారు.

## గణనాథుని సేవలో మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి



**రామచంద్రపురం, సెప్టెంబర్ 19 (సింగిడి):** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని రామచంద్రపురం పరిధిలోని భారతీనగర్ డివిజన్ పరిధిలోని పలు గణేష్ మండపాల్లో మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా డివిజన్‌లోని పలు కాలనీలను సందర్శించి విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఓల్డ్ ఎంఐజీ కాలనీలోని లంబోదర యూత్, మన గణేష్ యూత్ అసోసియేషన్, నవభారత్, ఎఫ్ పార్క్, నేతాజీ కమ్యూనిటీ హాల్, వివేకానంద పార్క్ మండపాలతో పాటు బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్ గణేష్ మండపాన్ని ఆమె దర్శించుకున్నారు. అనంతరం బాంబే కాలనీలోని వీఆర్ యువసేన గణేష్ మండపం, రామచంద్రాపురంలోని మల్లికార్జున్ నగర్ మండపాల్లో స్వామివారికి అర్చనలు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక యువతతో కలిసి అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు భోజనాలు వడ్డించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కాలనీల్లో గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుతంగా నిర్వహిస్తున్న యువతను, కమిటీ సభ్యులను అభినందించారు. స్వామివారి కృపతో డివిజన్ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు భాస్కర్ ముదిరాజ్, రాకేష్, మహేష్, ఉత్సవ కమిటీల ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## భారతీయ సంస్కృతి, దేశభక్తిని పెంపొందించడంలో విద్యార్థులు ముందుండాలి

- ఎంపీ రఘునందన్ రావు
- జ్యోతి విద్యాలయ పాఠశాలలో ఘనంగా భారత్ వికాస్ పరిషత్ జాతీయ సమూహగాన పోటీలు
- ముఖ్య అతిథిగా హాజరైన మెదక్ ఎంపీ




**రామచంద్రపురం, సెప్టెంబర్ 19 (సింగిడి):** నేటి ఆధునిక కాలంలో విద్యార్థులు కేవలం పుస్తక విజ్ఞానానికే పరిమితం కాకుండా భారతీయ సనాతన సంస్కృతి, సంప్రదాయాలు, దేశభక్తి భావాలను అలవర్చుకోవాలని మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు పిలుపునిచ్చారు. పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని రామచంద్రపురం పరిధిలోని బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని జ్యోతి విద్యాలయ పాఠశాలలో 'భారత్ వికాస్ పరిషత్' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ బృంద గాన (సమూహ గానం) పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ.. సంస్కృతి పరిరక్షణలో యువత పాత్ర: యువత, విద్యార్థులే దేశానికి వెన్నెముక అని, చిన్నతనం నుంచే వారిలో దేశభక్తి, జాతీయ సమైక్యతా భావాన్ని పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. భారత్ వికాస్ పరిషత్ కృషి అభినందనీయం: సమాజంలో సేవా భావాన్ని, హైందవ ధర్మ విశిష్టతను భావితరాలకు అందిస్తూ భారత్ వికాస్ పరిషత్ చేస్తున్న కార్యక్రమాలు ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఇలాంటి జాతీయ స్థాయి సాంస్కృతిక పోటీలు విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయడానికి ఎంతో దోహదపడతాయన్నారు. విలువలతో కూడిన విద్యే నిజమైన ప్రగతి: విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూనే, నైతిక విలువలను కాపాడుకోవాలని, మాతృభూమి రుణం తీర్చుకునేలా ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. దేశ ప్రగతిలో భాగస్వాములవుతూ అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ ఖ్యాతిని చాటాలని ఆకాంక్షించారు.

అనంతరం వివిధ పాఠశాలల నుంచి హాజరైన విద్యార్థులు ఆలపించిన దేశభక్తి గీతాలు, జాతీయ సమైక్యతా గీతాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు, పాఠశాల యాజమాన్యం, భారత్ వికాస్ పరిషత్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సహస్ర మోదక లక్ష్మీ గణపతి హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్




**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 19 (సింగిడి):** వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా కొంపల్లి లోని ఎస్సీఎల్ నార్త్ నోబెల్ ఎంక్లేవ్ లో ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద అమ్మవారి ఉపాసకులు రాచర్ల రవిచంద్ర శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన "సహస్ర మోదక లక్ష్మీ గణపతి హోమం" కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ హాజరై స్వామి వారి విశేషమైన పూర్ణాహుతిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గణనాథుడికి విశిష్ట పూజలు నిర్వహించి గణనాథుడి కృపతో లోకమంత సుభిక్షంగా, ప్రజలంతా సుఖశాంతులతో అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆ గణనాథుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణతో పాటు వెదురు ఆధారిత వృత్తులను ప్రోత్సహించాలి




- ప్రపంచ వెదురు దినోత్సవ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించిన అదనపు కలెక్టర్లు సంగీత, పాండు

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 19 (సింగిడి):** వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ వెదురు దినోత్సవ కార్యక్రమాన్ని సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్లు సంగీత, పాండు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెదురుతో తయారు చేసిన వివిధ రకాల వస్తువుల ప్రదర్శనను అదనపు కలెక్టర్లు తిలకించారు. వెదురు ఉత్పత్తుల తయారీ, వాటి వినియోగం, సంప్రదాయ వృత్తుల పరిరక్షణకు సంబంధించిన వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో వెదురు మొక్కలు, వెదురు ఉత్పత్తులకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు వెదురు ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా ఆర్థిక అభివృద్ధికి తోడ్పడవచ్చని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, ఉపాధి కల్పన, సంప్రదాయ వృత్తుల పరిరక్షణకు వెదురు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. మేదర సామాజిక వర్గానికి చెందిన అనేక మంది వెదురు ఆధారిత వృత్తిని జీవనాధారంగా కొనసాగిస్తున్నారని తెలిపారు. తరతరాలుగా వస్తున్న సంప్రదాయ వృత్తిని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానం చేసుకోవాలని సూచించారు. వెదురు ఉత్పత్తుల తయారీకి అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. సామాజిక, ఆర్థిక అభివృద్ధికి విద్య ఎంతో కీలకమని అదనపు కలెక్టర్లు అన్నారు. విద్యతోనే సమాజంలో అభివృద్ధి సాధ్యమవుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ప్రైవేటు విద్యా సంస్థలకు దీటుగా రాష్ట్ర ప్రభుత్వం మౌలిక వసతులు కల్పిస్తోందని తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని కాలానుగుణంగా అభివృద్ధి చెందాలని అన్నారు. ప్రభుత్వ విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, అందుబాటులో ఉన్న విద్యా సౌకర్యాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఏ. జగదీష్, అదనపు డిఆర్‌డిఓ బాల్ రాజ్, మాజీ మున్సిపల్ చైర్మన్ బొంగుల విజయలక్ష్మి రవి, మేదరి మహేంద్ర సంఘం జిల్లా అధ్యక్షులు అంబదాస్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ మహేంద్ర, జిల్లా కోశాధికారి పులి రాజేష్ కుమార్, నాయకులు ఆంజనేయులు, రమేష్, నరేందర్, ప్రమోద్ కుమార్, సాయి మల్లేష్, శ్రీలత, జగదాంబ, సంతోషి, రజిని, మమత, బిక్షపతి, సిబ్బంది, మేదర సామాజిక వర్గ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## గణనాథుని నిమజ్జనంలో పాల్గొన్న నాయకులు



**నాచారం, సెప్టెంబర్ 19 (సింగిడి):** నాచారం సర్కిల్ నాచారం డివిజన్ దుర్గా నగర్ లో మాజీ వార్డ్ సభ్యురాలు పొన్నాల లలిత మొగులయ్య, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పొన్నాల మహేందర్ ఆధ్వర్యంలో మహా గణనాథుని నిమజ్జనం యాత్ర కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా మంద కార్తిక్ కేశపాక రామచందర్ ఎం ఎస్ పి జాతీయ నాయకులు, మేడ్చల్ ఇన్చార్జి కొరపాక అంజి మాదిగ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు, ఇటుక కిషన్ హైదరాబాద్ ఇంచార్జ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లికార్జున్ గౌడ్, టేకులపల్లి రామచందర్, శివ అద్వైత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభాతవర సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
Singidi
ఆదివారం
20-9-2026

# ఎడిటోరియల్

Editorial

# చెదరని ధర్మపురి.. తరగని వైభవం

## శిథిలాల నుంచి శిఖరాల దాకా.. ధర్మపురి పునరుజ్జీవన గాథ
## ధర్మపురి క్షేత్రరాజంలో దాడులు.. విధ్వంసాలు.. పునర్నిర్మాణాల పరంపర

పుణ్యవాహిని గోదావరి నదీమతల్లి దక్షిణ వాహినియై పరమపావనంగా విలసిల్లే కరీంనగర్ సీమలోని ధర్మపురి క్షేత్రం తెలంగాణ ఆధ్యాత్మిక, సాహిత్య, సాంస్కృతిక ముఖచిత్రంలో ఒక సమున్నత శిఖరం. శైవ, వైష్ణవ సంప్రదాయాల సమన్వయ క్షేత్రంగా, వేదనాదాలు, మంత్రోచ్చారణలు నిత్యం ప్రతిధ్వనించే విద్యాకేంద్రంగా, శిల్పకళా శోభితమైన ప్రసిద్ధ పుణ్యధామంగా ఈ క్షేత్రం శతాబ్దాలుగా భాసిల్లుతోంది. తన సుమధుర భక్తిరసభరిత శతకంలో "ధర్మపురి శేషప్ప ఝుఎఅవఅఅఆ ... భూషణ వికాస శ్రీ ధర్మపురి నివాస అంటూ కీర్తించిన పవిత్ర ధామమిది. అయితే ధర్మపురి కేవలం శాంతియుత భక్తి ప్రవాహానికే కాదు, దక్కన్ పీఠభూమి రక్తసిక్తమైన సంక్షుభిత రాజకీయ యుద్ధ ఘర్షణలకు, విదేశీ దురాక్రమణదారుల కర్కశ దండయాత్రలకు, హృదయవిదారక ఆలయ విధ్వంసాలకు కూడా ప్రత్యక్ష సాక్ష్యంగా నిలిచింది. ధర్మపురి చరిత్రను నిశితంగా పరిశీలిస్తే అది కేవలం ఆలయాలు కూలిపోయిన విషాద గాథ మాత్రమే కాదు; మట్టిలో కలిసిన ప్రతిసారీ భస్మసింహాసనంపై నుంచి తిరిగి లేచే ఫీనిక్స్ పక్షిలా, స్థానిక ప్రజల అచంచల విశ్వాసంతో, సామూహిక చైతన్యంతో పదే పదే పునర్నిర్మితమైన అపూర్వ సాంస్కృతిక జీవన పరంపర.



దక్షిణాపథంపై ఢిల్లీ సుల్తానుల కన్నుపడిన తరుణంలో కాకతీయ సామ్రాజ్యం తీవ్రమైన విపత్తును ఎదుర్కొంది. అల్లావుద్దీన్ ఖిల్జీ ఆజ్ఞలతో ఆయన సర్వసైన్యాధ్యక్షుడు మాలిక్ కాఫూర్ దక్కన్‌పై దండెత్తి, ఓరుగల్లు దుర్గాన్ని ముట్టడించేందుకు కదిలిన క్రమంలో క్రీస్తుశకం 1303 ప్రాంతంలో సేనల రాకపోకల వల్ల గోదావరి తీరప్రాంతం భీతావహ వాతావరణంలో కూరుకు పోయింది. ఆ తిరుగు ప్రయాణంలో ధర్మపురిలోని అత్యంత ప్రాచీనమైన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి, శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయాలు తీవ్ర ధ్వంసకాండకు గురైనట్లు స్థానిక చారిత్రక సంప్రదాయాలు పేర్కొంటున్నాయి. కాకతీయుల శిల్పకళా సంపద, సజీవ శిలా సౌందర్యం మొదటిసారి పరాయి దండయాత్రల ధాటికి తీవ్రంగా గాయపడ్డాయి. ఆ తర్వాత కాకతీయ సామ్రాజ్య పతనం అనంతరం దక్కన్‌లో బహమనీ సుల్తానుల ప్రాబల్యం విస్తరించింది. బహమనీ సుల్తాన్ మహమ్మద్ షా కాలంలో హిజ్రీ 764 (సుమారు క్రీస్తుశకం 1362-63) లో ఓరుగల్లు దిశగా సాగిన సైనిక యాత్రల సమయంలో తెలంగాణ ప్రాంతంలోని ఎన్నో ఆలయాలతో పాటు ధర్మపురి క్షేత్రం కూడా దాడుల బారిన పడింది. అనంతరం బహమనీ సుల్తాన్ అహ్మద్ షా పాలనలో, రాచకొండ, దేవరకొండ కేంద్రాలుగా వెలుగొందుతున్న రేచర్ల పద్మనాయక వెలమ పాలకులపైకి అజీమ్ ఖాన్ నాయకత్వంలో సైన్యాలను పంపిన కాలంలోనూ ధర్మపురి కల్లోలితమైంది. స్థానిక కథనాలలో పేర్కొనే హిజ్రీ 838 కాలం ప్రామాణికంగా క్రీస్తుశకం



1434--1435 నాటి పరిణామాలతో సరిపోలుతోంది. ఈ దాడులలో స్వామివారి ప్రధాన విగ్రహాలను, ప్రాకారాలను భక్తులు ప్రాణాలకు తెగించి దాచిపెట్టడం లేదా గోదావరి గర్భంలో భద్రపరచడం వంటి ఉదంతాలు ఇక్కడి ప్రజల భక్తితత్పరతకు సాక్ష్యాలుగా నిలిచాయి.

ధర్మపురి ఆలయ చరిత్రలో అత్యంత విషాదకరమైన, చారిత్రకంగా సుస్పష్టమైన మరొక నల్లని అధ్యాయం మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు కాలంలో చోటుచేసుకుంది. క్రీస్తుశకం 1687లో గోల్కొండ కుతుబ్‌షాహీ రాజ్యం మొఘలుల వశమయ్యాక, దక్కన్ ప్రాంతం ఔరంగజేబు దక్కన్ సుబేదార్ల కఠిన పాలనలోకి వచ్చింది. ఆ సమయంలో హైదరాబాద్ సుబేదార్‌గా వ్యవహరించిన రుస్తుం దిల్ ఖాన్ ఆదేశాల మేరకు ధర్మపురిలోని ప్రసిద్ధ, అత్యద్భుత శిల్పకళా నిలయమైన ప్రాచీన అరవై స్తంభాల శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం సమూలంగా ధ్వంసం చేయబడింది. అంతటితో ఆగక, క్రీస్తుశకం 1693 ప్రాంతంలో ఆ ప్రాచీన దేవాలయ స్థానాన్ని, అవశేషాలను మసీదుగా మార్చి, అబుల్ హసన్ ఫరాజును మౌజన్‌గా నియమించి, దాని నిత్య నిర్వహణకై వంద బీగాల వ్యవసాయ భూమిని సమకూర్చినట్లు నాటి రెవెన్యూ దస్తావేజులు, పర్షియన్ ఫర్మానాలు, స్థానిక పురావస్తు ఆధారాలు స్పష్టం చేస్తున్నాయి. ఇంతటి పెను విధ్వంసం జరిగి, శతాబ్దాల నాటి మూలవిరాట్టు నిలయం పరాయి కట్టడంగా మారినప్పటికీ ధర్మపురి ఆత్మ విశ్వాసాన్ని కోల్పోలేదు. రామభద్రాశ్రమానికి చెందిన తపోధనుడు, ఆధ్యాత్మికవేత్త నారాయణ దీక్షితులు ధర్మపురికి దక్షిణ దిశగా 'నారాయణపురం' పేరిట ధార్మిక ఆవాసాన్ని నెలకొల్పి, వేదపాఠశాలలను, ఆగమ సంప్రదాయాలను, నిత్యాగ్నిహోత్రాలను ఆశ్రమ ప్రాంగణంలో నిరంతరాయంగా కొనసాగించారు. భౌతిక కట్టడాలు నేలమట్టమైనా, ఆధ్యాత్మిక జ్ఞానజ్యోతి ఆరిపోకుండా కాపాడటంలో ఈ ఆశ్రమాలు, పండిత శ్రేష్ఠులు వహించిన పాత్ర అమోఘమైనది.

తదనంతరం 1724లో మీర్ కమరుద్దీన్ నిజాముల్ ముల్క్ చేత అసఫ్‌జాహీ రాజవంశం హైదరాబాద్ రాజ్యంలో స్థిరపడిన తర్వాత, సుమారు 1724 నుండి 1750 మధ్యకాలంలో ధర్మపురి క్షేత్రంలో మహా పునర్నిర్మాణ శకం ఆరంభమైంది. ధర్మపురి భక్తులు, స్థానిక జమీందారులు, పండితులు నడుం బిగించి, నూతన ప్రాకారాలతో, ఆగమ శాస్త్రోక్తంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి పాత ఆలయాన్ని పునరుద్ధరించారు. ఆలయ పునర్నిర్మాణమంటే కేవలం రాళ్లు, సున్నంతో గోడలు లేపడం మాత్రమే కాదు; లుప్తమైపోయిన నిత్య ధూపదీప నైవేద్యాలను, బ్రహ్మోత్సవాలను, రథోత్సవాలను, వేదపారాయణాలను, రసవత్తరమైన సంస్కృతీ పరంపరను పూర్వవైభవంతో పునఃప్రతిష్ఠించడం. ప్రజల సామూహిక విశ్వాసానికి ఈ ఆలయం తిరిగి ప్రాణం పోసుకుంది. అయితే క్రీస్తుశకం 1858లో, నిజాం అఫ్జల్ ఉద్దౌలా పరిపాలనా కాలంలో మరొక తీవ్ర సంక్షోభం వచ్చిపడింది. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా చెలరేగిన తిరుగుబాట్ల కల్లోల నేపథ్యంలో, నిజాం సరిహద్దుల్లో సంచరిస్తున్న రోహిల్లా సాయుధ ముఠాలు ధర్మపురిపై ఆకస్మికంగా విరుచుకుపడ్డాయి. వారు ఊరిలోని గృహాలను, వ్యాపారులను దోచుకోవడమే కాకుండా, పవిత్ర దేవాలయాలను కొల్లగొట్టి, విగ్రహాలను అపవిత్రం చేసి, భీతావహాన్ని సృష్టించారు. దాడి ముగిసిన వెంటనే ఏమాత్రం అధైర్యపడక ధర్మపురి ప్రజలు ఏకతాటిపై నిలిచి, పుష్య బహుళ ఏకాదశి పర్వదినాన ఆలయాలలో సంప్రోక్షణ, మహాశాంతి హోమాలు, మహాసంకల్ప శుద్ధి కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించి దైవశక్తిని పునరుద్ధరించుకున్నారు. దోపిడీకి గురైన సంపదను తిరిగి సమకూర్చుకుంటూ నరసింహుని సన్నిధిని మళ్లీ వెలిగించారు.

ధర్మపురి క్షేత్ర చరిత్రను సింహావలోకనం చేసుకుంటే కనిపించేది దాడుల వికృత రూపాలు కావు; వాటన్నింటినీ అధిగమించిన భారతీయ సమాజపు అజేయమైన పునర్నిర్మాణ సంకల్పం. విదేశీ తుపాకులు, కరవాలాలు శిల్పాలను ఖండించగలిగాయేమో కానీ, ప్రజల గుండెల్లో కొలువై ఉన్న నరసింహుని భక్తిని తుడిచిపెట్టలేక పోయాయి. ఒక తరం శిథిలాలను చూసి రోదిస్తే, తర్వాతి తరం అదే శిథిలాల నుంచి నూతన గోపురాలను నిర్మించి నిలబెట్టింది. గోదావరి అలలు ఎన్ని శతాబ్దాల కన్నీటిని తనలో కలుపుకున్నాయో, అన్ని పునరుజ్జీవన ఘట్టాలను చూసి పులకించాయి. నేడు ధర్మపురిలో చేపట్టే ప్రతి సంరక్షణ చర్య, పునర్నిర్మాణ ప్రాజెక్టు ఈ మహోన్నత చారిత్రక పోరాటాన్ని, పూర్వీకుల త్యాగాలను స్మరిస్తూ సాగాలి. శతాబ్దాల దాడులను తట్టుకుని నిలిచిన కాకతీయ, కళ్యాణి చాళుక్యుల శిల్పకళా ఖండాలను, ప్రాచీన శిలాశాసనాలను, అన్ని దేవాలయాల అవశేషాలను భద్రపరుస్తూ, వైదిక-ఆగమ రీతులకు లోబడి ఈ క్షేత్ర వైభవాన్ని కాపాడుకున్నప్పుడే ధర్మపురి అమర చరిత్ర భావితరాల జాతి చైతన్యానికి నిరంతర దీపస్తంభమై దిశానిర్దేశం చేస్తుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్
కాలమిస్ట్...9440595494

# సేవకు ప్రతీక అనిబిసెంట్ జీవితం

### అనిబిసెంట్ వర్ధంతి సందర్భంగా..

విద్యాసేవ, ఆరోగ్యసేవ వంటి రంగాలలో కొంతమంది వ్యక్తులు తమ జీవితాన్ని అర్పించి మానవాళికి ప్రేరణగా నిలుస్తారు. అలాంటి మహనీయులలో అనిబిసెంట్ ఒకరు. ఆమె తన జీవితమంతా బలహీన వర్గాల వారికి, ముఖ్యంగా మహిళలు మరియు పిల్లలకు సేవ చేయడంలో గడిపింది. ఈ కారణంగానే ఆమెను ఒక గొప్ప సామాజిక సేవకురాలిగా గుర్తించుకుంటారు. బ్రహ్మ జ్ఞానవాది, మహిళాహక్కుల ఉద్యమవాది, రచయిత, వాక్పటిమ కలిగిన స్త్రీ అనిబిసెంట్ ఐరిష్ జాతి మహిళ. లండను లోని క్లఫామ్ లో 1847 అక్టోబరు 1 న జన్మించింది. 1933 సెప్టెంబరు 20 న తమిళనాడు లోని అడయారులో మరణించింది. ఈమె ఐర్లాండ్, భారతదేశాల స్వాతంత్ర్యం, స్వయంపాలన కొరకు పోరాడి స్వయం పాలన ఉద్యమం స్థాపించిన మహోన్నత త్యాగశీలి. 1867 డిసెంబరులో తన 19 వ ఏట, తల్లి కోరికమేరకు ఫాదర్ ఫ్రాంక్ బిసెంట్ ని అనిబిసెంట్ పెళ్ళి చేసుకుంది. అంతవరకూ అనీగా పిలవబడిన ఆమె వివాహంతో అనీ బిసెంట్ గా మారింది. ఈమె 1874 లో ఇంగ్లాడులోని నేషనల్ సెక్యులర్ సొసైటీ అనే సంస్థలో చేరింది. లా అండ్ రిపబ్లిక్ లీగ్ ని స్థాపించి పోలీసు అత్యాచారాలకు బలైన కుటుంబాలకు సేవచేసింది. వారికోసం పోరాడింది. అనిబిసెంట్ థియోసాఫికల్ సొసైటీ ఆఫ్ ఇండియాకు నాయకురాలు. ఆమె భారత జాతీయ కాంగ్రెస్ మొదటి మహిళ అధ్యక్షురాలిగా పనిచేశారు. 1906లో ఇండియన్ హోమ్ రూల్ లీగ్ ను ఆమె స్థాపించారు. ఆ సమయంలోనే భారత స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. సమాజంలో జరుగుతున్న అన్యాయం, అసమానతలపై చిన్న వయసులోనే ప్రశ్నించడం ప్రారంభించారు. ఆమె ఆలోచనలు సమాజంలో మహిళలకు, బలహీన వర్గాలకు సమాన హక్కులు రావాలని దారితీశాయి. అనిబిసెంట్ ఇంగ్లాండ్‌లో ఉండగానే భారతీయ సంస్కృతి, తత్వశాస్త్రం పట్ల ఆసక్తి కనబరిచారు. 1893లో ఆమె భారతదేశానికి వచ్చి ఇక్కడి జీవన విధానం, మతం, తత్వశాస్త్రం గురించి లోతుగా అధ్యయనం చేశారు. ఆ తరువాత ఆమె ఇక్కడే ఉండి సమాజసేవ, విద్యాసేవ, రాజకీయ సేవలను కొనసాగించారు. అనిబిసెంట్ విద్యను మానవ వికాసానికి అత్యంత ముఖ్యమని భావించారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు తీసుకురావచ్చని ఆమె నమ్మకం. 1898లో వారణాసిలో సెంట్రల్ హిందూ కాలేజీని స్థాపించారు. ఈ కాలేజీ తరువాతి కాలంలో బెనారస్ హిందూ యూనివర్శిటీ గా అభివృద్ధి చెందింది. ఈ విధంగా భారత విద్యారంగంలో ఆమె చేసిన కృషి ఎంతో విశిష్టమైనది. భారత స్వాతంత్ర్య సమరంలో అనిబిసెంట్ ప్రత్యేక పాత్ర పోషించారు. భారత జాతీయ కాంగ్రెస్ లో సభ్యురాలిగా చేరి స్వాతంత్ర్యం కోసం గళమెత్తారు. 1917లో ఆమె భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎన్నుకోబడ్డారు. ఈ స్థానాన్ని అలంకరించిన మొదటి యూరోపియన్ ఆమె. స్వాతంత్ర్యానికి సంబంధించిన హోమ్ రూల్ ఉద్యమంను ప్రారంభించి ప్రజల్లో జాతీయతా చైతన్యాన్ని పెంచారు. అనిబిసెంట్ మహిళల హక్కుల కోసం కూడా విశేషంగా పోరాడారు. మహిళా విద్య, ఆర్థిక స్వావలంబన, రాజకీయ భాగస్వామ్యం కోసం ఆమె చేసిన కృషి చరిత్రలో చిరస్మరణీయం. అదేవిధంగా కులమత భేదాలను తొలగించి సమాజంలో సమానత్వాన్ని నెలకొల్పాలని నిరంతరం శ్రమించారు. అనిబిసెంట్ జీవితం సేవకు ప్రతీక. విద్యా రంగం, రాజకీయ రంగం, సామాజిక రంగం---ఈ మూడు రంగాల్లో ఆమె చేసిన కృషి అపారమైనది. భారతదేశాన్ని తన రెండవ స్వదేశంగా భావించి జీవితమంతా ఇక్కడే గడిపారు. ఆమె చేసిన సేవలు భవిష్యత్ తరాలకు ప్రేరణగా నిలుస్తాయి. అందువల్ల అనిబిసెంట్ పేరు భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది.



పిన్నింటి బాలాజీ రావు
హనుమకొండ
9866776286

# 1857 తిరుగుబాటు

## ఢిల్లీ పతనంతో మొఘల్ అంత్యగీతం, స్వాతంత్ర్య స్వరం



**1857 తిరుగుబాటు భారత స్వాతంత్ర్య చరిత్రలో ఒక విప్లవాత్మక ఘట్టం. బ్రిటిష్ తూర్పు ఇండియా కంపెనీ పాలనలోని అన్యాయాలు, దోపిడీలు, మతపరమైన జోక్యాలు, రాజకీయ మోసాలు, ఆర్థిక దోపిడీలు కలసి ఈ తిరుగుబాటుకు బీజమయ్యాయి. సిపాయిలకు అందించిన కొత్త తుపాకీ గుళ్లలో పశువుల కొవ్వు వాడుతున్నారన్న వార్తలు మత విశ్వాసాలను దెబ్బ తీయడంతో ఆగ్రహ జ్వాలలు అంటుకున్నాయి.**

లార్డ్ డల్హౌసీ అమలు చేసిన 'డాక్ట్రిన్ ఆఫ్ ల్యాప్స్' విధానం వల్ల ఝాన్సీ, అవధ్, నాగ్‌పూర్ వంటి అనేక రాజ్యాలు గద్దెచ్యుతమవ్వగా స్థానిక పాలకులు అవమానితులయ్యారు. రైతులపై పెరిగిన పన్నులు, వాణిజ్య దోపిడీలు ప్రజలను ఆర్థికంగా దెబ్బతీశాయి. సైన్యంలో వివక్ష, స్థానిక సైనికుల అవమానకర పరిస్థితులు అసహనాన్ని పెంచాయి. ఈ నేపథ్యమే 1857 మే 10న మీరట్‌లో తిరుగుబాటుకు దారితీసింది. సిపాయిలు తిరుగుబాటు జెండా ఎగురవేసి ఢిల్లీ వైపు కదిలి, అక్కడికి చేరి మొఘల్ చక్రవర్తి బహదూర్ షా జఫర్‌ను తమ నాయకునిగా ప్రకటించారు. ఢిల్లీ తిరుగుబాటు కేంద్రంగా మారి దేశమంతా పోరాట జ్వాలలు వ్యాపించాయి. ఝాన్సీ రాణి లక్ష్మీబాయి, నానా సాహెబ్, తాంతీయా తోపే, బేగం హజ్రత్ మహల్, కూన్వర్ సింగ్ వంటి నేతలు వివిధ ప్రాంతాల్లో పోరాటానికి నాయకత్వం వహించారు.

ఢిల్లీ ముట్టడి మూడు నెలలపాటు సాగింది. జూన్ నుండి సెప్టెంబర్ వరకు కంపెనీ సైన్యం నగరాన్ని చుట్టుముట్టి దాడులు కొనసాగించింది. పంజాబ్ నుండి తీసుకు వచ్చిన యూరోపియన్ దళాలు, నిబద్ధతగల సైనికులు, ఆధునిక తుపాకుల సహాయంతో ముట్టడి తీవ్రతరమైంది. నగరంలో ఆహారం, నీరు, ఆయుధాల కొరత తిరుగుబాటు దారులను కుంగదీసింది. అయినప్పటికీ వారు వీధి యుద్ధాలు సాగించి, కంపెనీ దళాలకు గట్టి ప్రతిఘటన ఇచ్చారు. గణాంకాల ప్రకారం ఈ ముట్టడిలో ఇరువైపులా లక్షలాది ప్రాణాలు కోల్పోయాయి. ఢిల్లీలో సుమారు నలభై వేలమంది సైనికులు, పౌరులు ప్రాణాలు విడిచారని చరిత్రకారులు అంచనా వేస్తారు.

సెప్టెంబర్ 14న కంపెనీ సైన్యం కాశ్మీరి గేట్ వద్ద గోడలను బీటలు చేసి నగరంలోకి చొరబడింది. తర్వాతి ఆరు రోజులు వీధి యుద్ధాలు సాగాయి. ప్రతి ఇంటి వద్ద తిరుగుబాటు దారులు ఎదురు దాడులు జరిపినా, చివరికి వారిని మట్టి కరిపించారు. సెప్టెంబర్ 20న ఢిల్లీ పూర్తిగా కంపెనీ ఆధీనం లోకి వచ్చింది. బహదూర్ షా జఫర్‌ను పట్టుకొని, అతని కుమారులను హతమార్చారు. అతన్ని చెరసాలలో బంధించి, తరువాత రంగూన్ తరలించారు. మొఘల్ సామ్రాజ్యపు అంతిమ అధ్యాయం అలా ముగిసింది.



ఢిల్లీ పతనం తిరుగుబాటు వైఫల్యానికి సంకేతంగా నిలిచింది. అయినప్పటికీ ఈ పోరాటం దేశవ్యాప్తంగా చైతన్యాన్ని రగిలించింది. తిరుగుబాటు విఫలమైన కారణాలు అనేకం. తిరుగుబాటు దారులలో ఐక్యత లేకపోవడం, సమన్వయ లోపాలు, ఆధునిక ఆయుధాల కొరత, సైనిక శిక్షణలో లోపాలు, కొంతమంది స్థానిక రాజులు కంపెనీకి మద్దతు ఇవ్వడం వంటి అంశాలు తిరుగుబాటును దెబ్బతీశాయి. కానీ విఫలమైనా ఈ పోరాటం భారత జాతి చరిత్రలో ఒక మలుపు.

1857 తిరుగుబాటు తరువాత 1858లో తూర్పు ఇండియా కంపెనీ పాలనను రద్దు చేసి, భారతదేశం నేరుగా బ్రిటిష్ కిరీటం ఆధీనంలోకి వెళ్లింది. పాలనా విధానాలలో మార్పులు చేశారు. భారతీయులలో జాతీయ చైతన్యం పెరిగింది. తిరుగుబాటు వీరుల త్యాగాలు తర్వాతి శతాబ్దం పాటు సాగిన స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రేరణగా నిలిచాయి. ఝాన్సీ రాణి వీరత్వం, సిపాయిల ధైర్యం, బహదూర్ షా జఫర్ ఆవేదన, నానా సాహెబ్ పోరాటం అన్నీ భారతీయుల మదిలో శాశ్వతంగా ముద్రించాయి.

సెప్టెంబర్ 20, 1857 ఢిల్లీ పతనం ఒక తిరుగుబాటు ముగింపు మాత్రమే కాదు, భారత స్వాతంత్ర్య ఉద్యమానికి బలమైన పునాదిగా నిలిచిన చారిత్రక ఘట్టం. దాస్యపు సంకెళ్ళను తెంచుకునే ప్రయత్నం మొదలైన రోజు అదే. ప్రాణత్యాగాలు, రక్తసిక్త వీధులు, విఫలమైన ఆశయాలు అన్నీ కలసి తరువాతి తరాలకు స్వేచ్ఛా వాంఛను నింపాయి. ఈ పోరాటం భారతీయులలో జాతీయం అనే భావనను మేల్కొలిపి, "స్వాతంత్ర్యం" అనే మహత్తర లక్ష్యానికి మార్గదర్శకంగా నిలిచింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

ప్రభాతవ సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
ఆదివారం 20-9-2026

# వాడి వేడిగా మున్సిపల్ సర్వసభ్య సమావేశం

- మూడు అంశాలపై ఏకగ్రీవ తీర్మానం

**జమ్మికుంట, సెప్టెంబర్ 19 (సింగిడి):** జమ్మికుంట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం మున్సిపల్ చైర్పర్సన్ మొలుగు ప్రశాంత్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి సమావేశ అజెండాలోని అంశాలను చదివి వినిపించాలని సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌ను ఆదేశించారు. అనంతరం మూడు అంశాలపై చర్చించి కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.





**సమావేశంలో ఆమోదించిన అంశాలు:**
రాబోయే సద్దుల బతుకమ్మ, చిన్న బతుకమ్మ పెద్ద బతుకమ్మ వేడుకల నిర్వహణకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాట్లు చేపట్టేందుకు రూ. 25 లక్షల పరిపాలనా, ఆర్థిక అనుమతి గాంధీ జయంతి సందర్భంగా రంగులు వేయడం, పూల అలంకరణ తదితర కార్యక్రమాల కోసం సుమారు రూ. 10,000 వ్యయానికి ఆమోదం తెలిపారు. సానిటేషన్ విభాగం అవసరాల కోసం బ్లీచింగ్ పౌడర్, మలాథియన్ ఆయిల్, గడ్డి మందు కొనుగోలుకు సుమారు రూ. 2,85,000 వ్యయానికి ఆమోదం పాలకవర్గం తెలిపారు. ఈ మూడు అంశాలను కౌన్సిల్ సభ్యులందరూ ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ మహ్మద్ ముంతాజ్ అలీ (జావిద్), మున్సిపల్ కౌన్సిలర్లు, మేనేజర్ జి. రాజిరెడ్డి, ఏఈ వికాస్, టీపీఎస్ వి. రమేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఐ. రమేష్, ఆర్ఐ ఎ. భాస్కర్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**వివాదాలకు తాత్కాలిక బ్రేక్**
గత రెండు రోజులుగా జమ్మికుంట మున్సిపాలిటీ లో జరుగుతున్న వార్ కు తాత్కాలిక విరామం ప్రకటించినట్లు తెలిసింది. ? శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో సానిటరీ ఇన్స్పెక్టర్ రమేష్ పైన తమ వ్యతిరేక గళాన్ని వినిపించిన కౌన్సిలర్ ఒగ్గు రమేష్ మరో నేత శ్రీపతి నరేష్ ల మధ్య జరిగిన వివాదానికి తాత్కాలిక విరామం ప్రకటించినట్లు సమాచారం. ఈ విషయంలో పాలకవర్గం ఇరువర్గాలను సమదాయించి సమస్యలను పరిష్కరించుకోవాలంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని లేదంటే పాలకవర్గం దృష్టికి తీసుకురావాలని ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించి మున్సిపాలిటీ పరువును మీడియా ద్వారా బయటికి తీసుకువెళ్లడం సమంజసం కాదని వారికి సూచించినట్లు తెలిసింది. మున్సిపల్ పాలకవర్గం లేదా అధికారుల దృష్టికి మీ సమస్యను తీసుకువచ్చి పరిష్కారం కాకపోతే జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేయాలని అప్పుడు కూడా సమస్య పరిష్కారం కాకపోతే మీడియాను ఆశ్రయించాలని సూచించినట్లు సమాచారం. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఇకపై కలిసిమెలిసి పనిచేసి మున్సిపాలిటీ ని అభివృద్ధి పథంలో నడిపించాలని పాలకవర్గం నిర్ణయించినట్లు సమాచారం.

## కలెక్టరేట్‌లో గణనాథుడికి ఘన పూజలు



- సిబ్బందికి స్వయంగా భోజనం వడ్డించిన కలెక్టర్ చిత్రామిశ్రా

**కరీంనగర్, సెప్టెంబర్ 19(సింగిడి):** జిల్లా ప్రజలకు సుఖసంతోషాలు, శ్రేయస్సు కలగాలని ఆకాంక్షిస్తూ కరీంనగర్ కలెక్టరేట్‌లో కొలువుదీరిన గణనాథుడికి జిల్లా కలెక్టర్ చిత్రామిశ్రా శనివారం ఘనంగా పూజలు నిర్వహించారు. గణేశుడికి ప్రత్యేక పూజలు చేసి మంగళహారతి ఇచ్చారు. అనంతరం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందికి స్వయంగా భోజనం వడ్డించి వారితో ఆత్మీయంగా మెలిగారు. విధి నిర్వహణలో సిబ్బందితో కలిసి పనిచేస్తున్న కలెక్టర్, గణేష్ ఉత్సవాల సందర్భంగా వారితో కలిసి అన్నదానంలో పాల్గొని తన ఆత్మీయతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, డి. శ్రీనివాస్ రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా రెవెన్యూ అధికారి స్వామి, జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## వినాయక మండపాల్లో డిప్యూటీ మేయర్ సునీల్‌రావు ప్రత్యేకపూజలు



- భక్తిశ్రద్ధలతో గణేశ్ ఉత్సవాలు జరుపుకోవాలి
- యాదగిరి సునీల్‌రావు

**కరీంనగర్, సెప్టెంబర్19(సింగిడి):** శ్రీ విఘ్నేశ్వర నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని భగత్‌నగర్, కాశ్మీర్‌గడ్డ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పలు వినాయక మండపాలను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు సందర్శించారు. ఆయా మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు. కాశ్మీర్‌గడ్డలో ఫండస్ పాఠశాల వద్ద, శ్రీ కపిలేశ్వర స్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను, భగత్‌నగర్‌లో అయ్యప్ప స్వామి ఆలయం సమీపంలో ఆదర్శ్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్ రావు మాట్లాడుతూ, విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. గణేశ్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శ్రీదేవి–చంద్రమౌళి, ఫండస్ పాఠశాల నిర్వాహకులు పద్మజ, ప్రభాకర్ రెడ్డి, కపిలేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులు కస్తూరి నాగరాజు, కేశవరెడ్డి, శంకరయ్య, కనకయ్య, ఆదర్శ్ యువజన సంఘం సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా మహా అన్నదానం.. కుంకుమపూజలు

భక్తులతో కిటకిటలాడిన వినాయక మండపాలు

ప్రత్యేక పూజలు నిర్వహించిన పలువురు ప్రముఖులు

**జమ్మికుంట, సెప్టెంబర్ 19 (సింగిడి) :** గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా జమ్మికుంట పట్టణంలో ఏర్పాటు చేసిన పలు చోట్ల నిర్వాహకులు మహా అన్నదాన కార్యక్రమం తో పాటు కుంకుమ పూజలు నిర్వహించారు. జమ్మికుంట లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణపతి మండపం వద్ద నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అసోసియేషన్ గౌరవాధ్యక్షులు పొన్నగంటి మల్లయ్య ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంక్ వైస్ చైర్మన్ పింగళి రమేష్ జమ్మికుంట మాజీ మున్సిపల్ చైర్మన్ తక్కల్లపల్లి రాజేశ్వరరావు హాజరయ్యారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథులను లారీ అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో లారీ ఓనర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షులు మారేపల్లి రామస్వామి ఉపాధ్యక్షులు వజ్జపల్లి శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి మారేపల్లి దేవేందర్ అన్నదాన నిర్వాహకులు మడికొండ రవీందర్రావు కార్యవర్గ సభ్యులు హుజురాబాద్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కంచి వేణు కే డి సి సి బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్ జమ్మికుంట మున్సిపల్ చైర్పర్సన్ ములుగు ప్రశాంత్ కుమార్ మాజీ మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి రాజమౌళి తో పాటు హుజురాబాద్ చింతలపల్లి లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రజాప్రతినిధులు సభ్యులు ప్రత్యేకంగా హాజరై కార్యక్రమంలో పాల్గొన్నారు.





**గణేష్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు**
జమ్మికుంట పట్టణంలోని క్లాక్ టవర్ సర్కిల్ వద్ద గల బాల ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో గణేష్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణపతి మండపంలో శనివారం ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించి మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. జమ్మికుంట పట్టణంలోని 19 అడుగుల గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేసి యూత్ సభ్యులు ప్రతిరోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. శనివారం నిర్వహించిన మహా అన్నదాన దాత నీల కావ్య కుమార్ దంపతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులతోపాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్ మాజీ మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావు మాజీ కౌన్సిలర్లు దయ్యాల శ్రీనివాస్ పాతకాల రమేష్ మార్కెట్ డైరెక్టర్ గడ్డం దీక్షిత్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సాయిని రవి వేదపండితులు వరప్రసాదాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాభవన్‌లో 'కీసర' ఆధ్వర్యంలో గణపతి పూజలు



**మానకొండూర్, సెప్టెంబర్19(సింగిడి):** వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో శనివారం గణనాథునికి తాడికల్ ప్యాక్స్ చైర్మన్ కీసర సంపత్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీసీసీ సభ్యుడు, మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్ గౌడ్ ప్రత్యేకంగా పాల్గొని గణపతికి పూజ లు చేశారు. అభిషేక కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తాడికల్ సింగిల్ విండో చైర్మన్ కీసర సంపత్ , పాలకవర్గ సభ్యులు జనగాం రాజయ్య,తుమ్మేటి కొండల్ రెడ్డి, గీట్ల గోపాల్ రెడ్డి,సంభు తిరుపతి,గాజుల లస్మవ్వ,సుద్దాల రాజేందర్ ,కల్లెపెల్లి రాజయ్య, తిరుపతి సమ్మయ్య, పింగిళి జయలక్ష్మి, తాళ్ళపెల్లి కొమురయ్య, ఓదెల రాజయ్య,కలకుంట్ల సత్యనారాయణ రావు,శంకరపట్నం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బండారి తిరుపతి , ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు గొట్టే మధు, పింగిలి శ్రీధర్ రెడ్డి, కాంగ్రెస్ గ్రామ శాఖ తాడికల్ అధ్యక్షులు కీసర వెంకటేష్, వార్డు సభ్యులు బి. శ్రీనివాస్, బత్తిని అనిల్, దుబ్బాక మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## గణేశ్ నిమజ్జనానికి కాలువల్లో నీళ్లు వదలాలి

నిమజ్జనోత్సవాలపై ముఖ్యమంత్రి తక్షణమే సమీక్ష నిర్వహించాలి

కేంద్ర మంత్రి బండి సంజయ్

**కరీంనగర్, సెప్టెంబర్19(సింగిడి):** రాష్ట్రవ్యాప్తంగా గణేశ్ విగ్రహాల నిమజ్జనోత్సవాలకు ఇబ్బందులు లేకుండా కాలువల్లో తక్షణమే నీటిని విడుదల చేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కాలువలు, చెరువులు ఎండిపోవడంతోపాటు ఎస్సారెస్పీ పరిధిలోని కాలువల్లోనూ నీరు లేకపోవడం ఆందోళనకరమన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. పరిస్థితి చేయి దాటకముందే ముఖ్యమంత్రి స్థాయిలో నిమజ్జనోత్సవాలపై సమీక్ష నిర్వహించి, అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. నీటిని విడుదల చేయకపోతే విగ్రహాలను రోడ్లపై ఉంచాల్సిన పరిస్థితి ఏర్పడి శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉందన్నారు. భక్తులు తప్పుడు ప్రచారాలను నమ్మకుండా అధికారులకు సహకరిస్తూ నిమజ్జనోత్సవాలను ప్రశాంతంగా నిర్వహించు కోవాలని కోరారు. సిరిసిల్లలో భూకబ్జాలపై ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలకు ఆధారాలను ప్రజల ముందు ఉంచాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నేతలు వేలాది ఎకరాల భూములను కబ్జా చేశారన్న ఆరోపణలకు ఆధారాలు ఉంటే బయటపెట్టి, ఆ భూములను రక్షించి పేదలకు పంపిణీ చేయాలని అన్నారు. ప్రజా సమస్యలు, ఆరు హామీలు, తెలంగాణ అభివృద్ధిపై చర్చించకుండా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రాజకీయ విమర్శలకు పరిమితమవుతున్నాయని ఆరోపించారు. గణేశ్ నిమజ్జనోత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేయాలని బండి సంజయ్ కోరారు.



## గణేశ్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలి

నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్, సెప్టెంబర్ 19(సింగిడి):** ఈ నెల 23న నిర్వహించనున్న గణేశ్ నిమజ్జనోత్సవాలను ఘనంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో శనివారం డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి వివిధ విభాగాల అధికారులతో నిమజ్జన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నిమజ్జన మార్గాలు, ఘాట్లు, నిమజ్జన కేంద్రాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. మానకొండూర్, కొత్తపల్లి, చింతకుంటతో పాటు గోపాల్‌పూర్, దుర్శెడ్, బొమ్మకల్ నిమజ్జన కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. తాగునీరు, వైద్య శిబిరాలు, విద్యుత్, వెలుతురు, జనరేటర్లు, గజ ఈతగాళ్లు, నిఘా కెమెరాలు, క్రేన్లు, పారిశుధ్య సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. నిమజ్జన మార్గాల్లో మరమ్మతు పనులను రెండు రోజుల్లో పూర్తి చేయాలని, రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీసు, విద్యుత్, నీటిపారుదల, రహదారులు–భవనాల శాఖలతో సమన్వయం చేసుకుంటూ అధికారులు, సిబ్బంది విధులను షిఫ్టుల వారీగా సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. నిమజ్జనం అనంతరం మరుసటి రోజే విగ్రహాలను తొలగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, నిమజ్జన కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిమజ్జన కేంద్రాల్లో ఏర్పాటు చేసే నిఘా కెమెరాలను నగరపాలక సంస్థ నియంత్రణ కేంద్రానికి అనుసంధానం చేయాలని కమిషనర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ ఆయాజ్, ఉప కమిషనర్లు ఖాదర్ మొహియుద్దీన్, వేణుమాధవ్, సహాయ కమిషనర్ రాజమనోహర్, ఇంజినీరింగ్ అధికారులు, డీసీపీ బషీరొద్దీన్, సహాయ ఇంజినీర్లు, పర్యవేక్షకులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## తెలంగాణ భవన్‌లో ఘనంగా జన్మదిన సంబరాలు

- కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**గోదావరిఖని, సెప్టెంబర్ 19 (సింగిడి):** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం కుందనపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఆలేటి గణేష్ జన్మదిన వేడుకలు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సందడిగా జరిగాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆలేటి గణేష్ మర్యాదపూర్వకంగా కలిశారు.
కేటీఆర్ సమక్షంలో ఆలేటి గణేష్ కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, భవిష్యత్తులో మరింత ఉత్సాహంతో ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

**పార్టీ శ్రేణుల మధ్య ఉత్సాహంగా వేడుకలు**
ఆలేటి గణేష్ జన్మదిన వేడుకలకు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ భవన్‌లో పార్టీ శ్రేణుల సమక్షంలో వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి.

**కేటీఆర్‌తో ప్రత్యేకంగా ముచ్చటించిన గణేష్**
జన్మదిన వేడుకల సందర్భంగా కేటీఆర్‌ను కలుసుకోవడం, ఆయన సమక్షంలో కేక్ కట్ చేయడం ఆనందంగా ఉందని ఆలేటి గణేష్ తెలిపారు. అనంతరం కేటీఆర్‌తో కలిసి జ్ఞాపక చిత్రాలు దిగారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు గణేష్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.




## విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

సెకండ్ అడిషనల్ జడ్జి ప్రణతి



**జమ్మికుంట, సెప్టెంబర్ 19(సింగిడి):** విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని హుజురాబాద్ కోర్టు సెకండ్ అడిషనల్ వీణ ప్రణతి అన్నారు. మండలంలోని గంద్రపల్లి గ్రామ శివారులో గల సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలను శనివారం జడ్జి సందర్శించి విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కష్టంతో ఇష్టపడుతూ చదివి తల్లి, దండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని, ఉన్నత చదువులు చదివి సమాజంలో మంచి స్థానం సంపాదించుకోవాలని పేర్కొన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. జడ్జి వెంట గ్రామ సర్పంచ్ తోట కవిత–లక్ష్మణ్, ఎస్ఐ సంజీవ్, పాఠశాల ప్రిన్సిపాల్ ఇందిర, ఉప సర్పంచ్ బీరేందర్, విద్యార్థులు పాల్గొన్నారు. అంతకుముందు జడ్జికి ఘన స్వాగతం పలికారు.

## ట్రాఫిక్ ఔట్‌పోస్ట్ బూత్‌లు ప్రారంభం

రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ, ప్రయాణికుల భద్రతకు ప్రత్యేకచర్యలు

పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం



**కరీంనగర్, సెప్టెంబర్ 19(సింగిడి):** నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రయాణికుల భద్రత లక్ష్యంగా తెలంగాణ చౌక్, మంచిర్యాల చౌరస్తాలో ఏర్పాటు చేసిన నూతన ట్రాఫిక్ ఔట్‌పోస్ట్ బూత్‌లను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం శనివారం ప్రారంభించారు. ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలను నియంత్రించడంతో పాటు నిరంతర పర్యవేక్షణకు ఔట్‌పోస్ట్ బూత్‌లు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రయాణికులు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు సంజీవ్, అంజయ్య, సబ్‌ఇన్‌స్పెక్టర్లు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## అమన్ జిత్ సింగ్‌కు జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బాధ్యతలు

సిక్కు మైనార్టీకి ప్రాధాన్యం కల్పించిన కాంగ్రెస్ పార్టీ నియామక ఉత్తర్వులు అందజేసిన డీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**కరీంనగర్, సెప్టెంబర్ 19(సింగిడి):** కరీంనగర్ పట్టణంలోని సిక్కు వాడకు చెందిన కాంగ్రెస్ నాయకుడు అమన్ జిత్ సింగ్ను జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. నగరంలోని రేకుర్తి శిబిర కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం ఆయనకు నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబడి అన్ని మతాలు, వర్గాలకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తుందని తెలిపారు. సిక్కు మైనార్టీకి చెందిన అమన్ జిత్ సింగ్‌కు బాధ్యతలు అప్పగించడం అందులో భాగమేనన్నారు. జిల్లాలో పార్టీ బలోపేతంతో పాటు సిక్కు మైనార్టీల సమస్యల పరిష్కారానికి ఆయన కృషి చేయాలని ఆకాంక్షించారు. నియామకంపై అమన్ జిత్ సింగ్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, జిల్లా మంత్రులు, కాంగ్రెస్ ముఖ్య నేతలు, సీనియర్ నాయకులు, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి పురుమల్ల శ్రీనివాస్కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆదేశాల మేరకు జిల్లాలో కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తూ మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. అమన్ జిత్ సింగ్ నియామకంపై కరీంనగర్ సిక్కు సమాజం, మైనార్టీ నాయకులు అభినందనలు తెలిపారు.

# వినాయక నిమజ్జనానికి పటిష్ట భద్రతా వలయం

- ఊరేగింపు మార్గాలపై ప్రత్యేక నిఘా..
- ముందస్తు చర్యలకు డీసీపీ ఆదేశం
- శాఖల మధ్య సమన్వయంతో ఎలాంటి అవరోధాలు లేకుండా ఏర్పాట్లు
- నిమజ్జన ప్రాంతాల్లో భక్తులకు పూర్తి భద్రత కల్పించాలి
- డీసీపీ బి.రామ్‌రెడ్డి





**గోదావరిఖని, సెప్టెంబర్ 19 (సింగిడి):** వినాయక నిమజ్జన వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ శాఖ పటిష్ట భద్రతా ప్రణాళికను సిద్ధం చేసింది. భారీ సంఖ్యలో భక్తులు, ఉత్సవ కమిటీలు పాల్గొనే అవకాశం ఉన్న నేపథ్యంలో ఊరేగింపు మార్గాలు, నిమజ్జన ప్రాంతాల్లో ముందస్తు భద్రతా చర్యలను పూర్తి చేయాలని పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అంతర్గాం పోలీస్ స్టేషన్ పరిధిలోని గోలివాడ గోదావరి నది వద్ద ఏర్పాటు చేస్తున్న నిమజ్జన ఏర్పాట్లను శనివారం డీసీపీ పరిశీలించారు. గోదావరిఖని ఏసీపీ రమేష్, సీఐ కృష్ణకుమార్‌లతో కలిసి నిమజ్జన ప్రదేశాన్ని సందర్శించిన ఆయన.. అక్కడ చేపడుతున్న భద్రతా ఏర్పాట్లు, ప్రజల రాకపోకలు, వాహనాల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.

**ఊరేగింపు మార్గాల్లో ముందస్తు తనిఖీలు**
వినాయక విగ్రహాల ఊరేగింపు సజావుగా సాగేందుకు మార్గాలను ముందుగానే క్షుణ్ణంగా పరిశీలించాలని డీసీపీ సూచించారు. రహదారులపై గుంతలు, నిర్మాణ సామగ్రి, ఇతర అడ్డంకులు ఉంటే వెంటనే తొలగించాలని ఆదేశించారు. విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న విద్యుత్ తీగలు, ఇతర ప్రమాదకర పరిస్థితులను గుర్తించి సంబంధిత శాఖల ద్వారా తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

**శాఖల సమన్వయంతోనే పకడ్బందీ ఏర్పాట్లు**
నిమజ్జన వేడుకల సందర్భంగా పోలీస్, మున్సిపల్, విద్యుత్ తదితర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని డీసీపీ సూచించారు. ఊరేగింపు మార్గాల్లో ఎలాంటి అవరోధాలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అవసరమైన నియంత్రణ చర్యలను అమలు చేయాలని ఆదేశించారు.

**నిమజ్జన ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు**
గోలివాడ గోదావరి నది వద్ద నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, విద్యుత్ వెలుతురు, వాహనాల పార్కింగ్, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. నది పరిసరాల్లో భద్రతా చర్యలను మరింత పటిష్టం చేసి, ప్రమాదాలకు తావులేకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**పోలీసుల సూచనలు పాటించాలి**
వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు, విగ్రహ నిర్వాహకులు, ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని అధికారులు కోరారు. ఊరేగింపు సమయంలో పోలీసుల సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా సమన్వయంతో పనిచేస్తూ నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు.

## గణపతికి 108 ప్రసాదాలతో నివేదన



**జమ్మికుంట సెప్టెంబర్ 19 (సింగిడి):** జమ్మికుంట పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బొమ్మల గుడి ప్రాంగణంలో ప్రతిష్టించిన గణనాథుడి కి శనివారం 108 ప్రసాదాల తో భక్తులు నివేదన చేశారు. ఆర్యవైశ్య పట్టణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజు వివిధ రకాల నైవేద్యాలతో స్వామివారిని కొలుస్తూ తమ భక్తిని చాటుకుంటున్నారు. అందులో భాగంగా శనివారం 108 ప్రసాదాలతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి లంబోదరుడి కృపాకటాక్షాలు పట్టణ ప్రజలందరిపై ఉండాలని భగవంతుడిని ప్రార్థించినట్టు కమిటీ సభ్యులు వెల్లడించారు. ఆర్యవైశ్య మహిళలు భక్తిశ్రద్ధలతో భగవంతుడికి నైవేద్యంగా 108 ప్రసాదాలు తయారుచేయగా, పురోహితుడు భగవంతుడికి నివేదించారు. అనంతరం భక్తులందరూ భగవంతుని దర్శించుకున్నారు. ఈ ప్రసాదాలను ప్రజలకు భగవంతుడి ప్రసాదంగా ఆర్యవైశ్య పట్టణ సంఘం కమిటీ సభ్యులు వితరణ చేశారు. బొమ్మల గుడి ప్రాంగణంలో గణనాథుడి సన్నిధిలో భక్తజనులందరూ ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ దైవిక కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వినాయక సేవలో ఉషోదయ మిత్రమండలి..!!

భక్తులకు అన్నప్రసాదం
అభినందించిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కౌశిక హరి
వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేకపూజలు
ప్రజల సుఖసంతోషాల కోసం ప్రార్థనలు



**గోదావరిఖని, సెప్టెంబర్ 19 (సింగిడి):** వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న వేళ గోదావరిఖని 43వ డివిజన్‌లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. 5 ఇంక్లైన్ ప్రాంతంలోని ఉషోదయ మిత్రమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమం భక్తి, సేవా స్ఫూర్తికి ప్రతీకగా నిలిచింది. వినాయక మండపాల సందర్శనలో భాగంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కౌశిక్ హరి అన్నదాన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, స్థానికులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం భక్తులకు అందిస్తున్న అన్నప్రసాదాన్ని పరిశీలించి, భక్తులకు సేవ చేయడాన్ని అభినందించారు. అనంతరం మండపంలో కొలువుదీరిన శ్రీ వినాయక స్వామిని దర్శించుకున్న కౌశిక్ హరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ వినాయకుడికి కొబ్బరికాయ సమర్పించి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా కౌశిక్ హరి మాట్లాడుతూ.. పండుగ వేళ భక్తులకు అన్నప్రసాదం అందించడం ద్వారా ఉషోదయ మిత్రమండలి సభ్యులు భక్తితో పాటు సామాజిక సేవా స్ఫూర్తిని చాటుతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, మానవతా విలువలను పెంపొందిస్తాయని అన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉషోదయ మిత్రమండలి సభ్యులు, భక్తులు, స్థానిక యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## బెజ్జంకి మండలం నర్సింహులపల్లిలో వింత ఘటన

పశువుకు రెండు తలల దూడ జననం



**మానకొండూర్,సెప్టెంబర్ 19(సింగిడి):** బెజ్జంకి మండలం నర్సింహులపల్లి గ్రామంలో ఒక అరుదైన వింత ఘటన చోటుచేసుకుంది. శనివారం గ్రామానికి చెందిన రైతు కు చెందిన గేదె ఒక రెండు తలల దూడకు జన్మనిచ్చింది. ఈ విషయం గ్రామంలో తెలియడంతో స్థానికంగా తీవ్ర ఆసక్తి నెలకొంది. వింతగా జన్మించిన ఈ దూడను చూసేందుకు నర్సింహులపల్లితో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, రైతులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఈ ఘటనపై వెటర్నరీ వైద్య నిపుణులు స్పందిస్తూ. గర్భస్థ దశలో పిండం సరిగ్గా విభజన చెందకపోవడం లేదా కొన్ని రకాల జన్యుపరమైన లోపాల కారణంగానే ఇలాంటి వింత దూడలు జన్మిస్తాయని స్పష్టం చేశారు.

## చిన్నారుల కలలకు.. 'కెవిఎస్' నృత్య వేదిక..!!

సెకండ్ బ్రాంచ్ ప్రారంభోత్సవం సందర్భంగా ఉచిత డాన్స్ కాంపిటీషన్
ఎంట్రీ ఫీజు లేదు.. ప్రతిభకు అవార్డులు..
బెస్ట్ 5కు రెండు నెలల ఉచిత శిక్షణ




**గోదావరిఖని, సెప్టెంబర్ 19 (సింగిడి):** చిన్నారుల్లో దాగి ఉన్న నృత్య ప్రతిభను వెలికితీసి.. వారికి సరైన వేదికతో పాటు నాణ్యమైన శిక్షణ అందించాలనే లక్ష్యంతో కెవిఎస్ డాన్స్ స్టూడియో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. గోదావరిఖనిలోని కవిత థియేటర్ సమీపంలో ఏర్పాటు చేసిన తొలి బ్రాంచ్ విజయవంతంగా ఆరు నెలలు పూర్తి చేసుకున్న సందర్భంగా దుర్గా నగర్‌లో రెండో బ్రాంచ్‌ను ప్రారంభించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా చిన్నారుల ప్రతిభను ప్రోత్సహించేలా ఉచిత డాన్స్ కాంపిటీషన్ నిర్వహించనున్నారు. నృత్యంపై ఆసక్తి ఉన్న చిన్నారులు ఎలాంటి ప్రవేశ రుసుము చెల్లించకుండా ఈ పోటీలో పాల్గొనే అవకాశం కల్పించారు. తమలోని నృత్య నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు ఇది చక్కటి అవకాశంగా నిలవనుంది.

**ప్రతిభకు అవార్డులు.. బెస్ట్ 5కు ప్రత్యేక శిక్షణ**
పోటీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన చిన్నారులకు బెస్ట్ డాన్స్ అవార్డులు అందజేయనున్నారు. అంతేకాకుండా ప్రతి కేటగిరీలో ప్రతిభ ఆధారంగా బెస్ట్ 5 మందిని ఎంపిక చేసి రెండు నెలల పాటు ఉచిత డాన్స్ శిక్షణ అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చిన్నారుల్లో నృత్యంపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు, వారి ప్రతిభను గుర్తించి మరింత మెరుగైన స్థాయికి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు.

**ప్రతిభను గుర్తించి.. భవిష్యత్తుకు బాటలు**
కెవిఎస్ డాన్స్ స్టూడియో డాన్స్ మాస్టర్ కె. విద్యాసాగర్ మాట్లాడుతూ.. చిన్నారుల్లో ఉన్న ప్రతిభను చిన్న వయసులోనే గుర్తించి, వారికి సరైన ప్రోత్సాహం, శిక్షణ అందించాలనే ఉద్దేశంతో ఉచిత డాన్స్ కాంపిటీషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నృత్యంపై ఆసక్తి ఉన్న ప్రతి చిన్నారి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మొదటి బ్రాంచ్‌కు ఆరు నెలల్లో లభించిన ఆదరణ, తల్లిదండ్రులు మరియు చిన్నారుల నుంచి వచ్చిన స్పందనతో దుర్గా నగర్‌లో రెండో బ్రాంచ్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇకపై మరింత మంది చిన్నారులకు నాణ్యమైన డాన్స్ శిక్షణ అందిస్తూ.. వారి ప్రతిభకు తగిన వేదికలు కల్పించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు.

**నృత్య ప్రతిభ ఉన్న చిన్నారులకు సువర్ణావకాశం**
గోదావరిఖని పరిసర ప్రాంతాల్లోని నృత్యంపై ఆసక్తి ఉన్న చిన్నారులు ఈ ఉచిత పోటీలో పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని కెవిఎస్ డాన్స్ స్టూడియో నిర్వాహకులు పిలుపునిచ్చారు. ప్రతిభకు గుర్తింపు.. ఆసక్తికి శిక్షణ.. భవిష్యత్తుకు ప్రోత్సాహం అనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## ఘనంగా పోషణ మాసం కార్యక్రమం



**చింతపల్లి, సెప్టెంబర్ 19 (సింగిడి):** మండల కేంద్రంలోని సాయిబాబా నగర్ లో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో సీడీపీఓ సక్కుబాయి ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ సక్కుబాయి మాట్లాడుతూ పోషకాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. తల్లి గర్భం దాల్చినప్పటి నుంచి శిశువు జన్మించిన రెండేళ్ల వం-కు ఉండే వెయ్యి రోజుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని సూచించారు. పోషకాహార లోపం వల్ల తల్లులు, పిల్లలకు కలిగే నష్టాలను వివరించి, సమతుల ఆహారం తీసుకోవాల్సిన అవసరాన్ని తెలియజేశారు. అదేవిధంగా మండలంలోని పోలేపల్లి రాంనగర్ లో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలేపల్లి రాంనగర్ సర్పంచ్ యాదమ్మ,సూపర్‌వైజర్‌లు అంజమ్మ, సుగుణ, అంగన్వాడీ ఉపాధ్యాయులు సుంకోజు పద్మావతి, అంజలి, వనం పద్మావతి, సల్మా, వసీమా, లలిత , శారద ,పద్మ, ఆయాలు పుల్లమ్మ , పార్వతమ్మ, లతో పాటు తల్లులు, పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

## జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

విద్యావేత్త, త్రివేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సిరికొండ శ్రీనివాస్



**కోదాడ, సెప్టెంబర్ 19 (సింగిడి):** మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ఆధ్వర్యంలో కోదాడ పట్టణంలోని సీసీ రెడ్డి కాన్వెంట్‌లో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని విద్యావేత్త, త్రివేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సిరికొండ శ్రీనివాస్ కోరారు. త్రివేణి డిగ్రీ కళాశాలలో విలేకరులతో మాట్లాడుతూ... ఈ జాబ్‌మేళాలో 300కు పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొని వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న యువతకు ఒకే వేదికపై పలు కంపెనీల్లో అవకాశాలను తెలుసుకునే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. యువత తమ విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. అవసరమైన విద్యార్హత ధ్రువపత్రాలు, బయోడేటాతో జాబ్‌మేళాకు హాజరై అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు. యువత భవిష్యత్తుకు ఈ జాబ్‌మేళా ఉపయోగపడుతుందని సిరికొండ శ్రీనివాస్ పేర్కొన్నారు.

## శ్రీ సాయి గణేష్‌కు 108 నైవేద్యాలు

భక్తిశ్రద్ధలతో మహిళల ప్రత్యేక పూజలు



**చింతపల్లి, సెప్టెంబర్ 19 (సింగిడి):** మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్ వద్ద వర్తక సంఘం, శ్రీ సాయి గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ సాయి గణేష్ విగ్రహ మండపం వద్ద శుక్రవారం మహిళలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి 108 రకాల నైవేద్యాలను సమర్పించి ఘనంగా నివేదించారు. అనంతరం భక్తులకు స్వామివారి ప్రసాదాలను పంపిణీ చేశారు. అదేవిధంగా శ్రీ లక్ష్మీదేవి అమ్మవారికి కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారికి కుంకుమార్చన చేశారు. కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లను ఉత్సవ కమిటీ సభ్యులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మహిళలు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# నీటి పొదుపే రైతు లాభానికి తొలి మెట్టు..!

- శాస్త్రీయ సాగు విధానాలతో ఎకరాకు అధిక దిగుబడి సాధించాలి
- సంప్రదాయ పద్ధతులకు స్వస్తి..
- ఆధునిక సాంకేతికతకు రైతులు స్వాగతం పలకాలి
- విజయవంతమైన రైతుల అనుభవాలను గ్రామగ్రామానికీ తీసుకెళ్లాలి
- కలెక్టర్ కోయ శ్రీహర్ష





**పెద్దపల్లి, సెప్టెంబర్ 19 (సింగిడి):** వ్యవసాయ రంగంలో వేగంగా చోటుచేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా రైతులు కూడా తమ సాగు విధానాలను మార్చుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. ముఖ్యంగా వరి సాగులో శాస్త్రీయ పద్ధతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించడంతో పాటు పెట్టుబడి వ్యయాన్ని నియంత్రించి అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. పెద్దపల్లి రంగంపల్లిలోని వెంకట పద్మ ఫంక్షన్ హాల్‌లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'వరి వరహాలు' కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా Sow and Reap NGO ఆధ్వర్యంలో నీటి సమర్థ వినియోగ పద్ధతులతో వరి సాగు చేసిన రైతులకు ఎకరాకు రూ.500 చొప్పున ప్రోత్సాహక నగదు చెక్కులను అందజేశారు.

**పాత పద్ధతుల నుంచి శాస్త్రీయ సాగు వైపు..**
కాలానుగుణంగా వ్యవసాయ విధానాల్లో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. విత్తన ఎంపిక నుంచి భూమి తయారీ, నాట్లు, ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం, చీడపీడల నియంత్రణ, కోత వరకు ప్రతి దశలో శాస్త్రీయ విధానాలను పాటిస్తే పంట నాణ్యతతో పాటు దిగుబడులు కూడా పెరుగుతాయని అన్నారు.

**అవసరమైనంత నీరే.. అధిక ప్రయోజనం**
వరి సాగులో నీటి నిర్వహణ అత్యంత కీలకమని కలెక్టర్ స్పష్టం చేశారు. పంటకు అవసరమైన సమయంలో, అవసరమైన మోతాదులో మాత్రమే నీటిని అందించడం ద్వారా నీటి వృథాను అరికట్టవచ్చని తెలిపారు. ప్రతి చుక్క నీటిని సమర్థంగా వినియోగించడం వల్ల సాగు ఖర్చు తగ్గడంతో పాటు భవిష్యత్ తరాలకు నీటి వనరులను పరిరక్షించవచ్చన్నారు.

**రైతు అనుభవమే.. మరో రైతుకు మార్గదర్శకం**
ఆధునిక పద్ధతులను అనుసరించి మంచి ఫలితాలు సాధిస్తున్న రైతులు తమ అనుభవాలను తోటి రైతులతో పంచుకోవాలని కలెక్టర్ కోరారు. ఒక రైతు సాధించిన విజయం మరెందరో రైతులకు స్ఫూర్తిగా నిలిచేలా క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని అధికారులను సూచించారు.

**60 వేల ఎకరాల్లో ఆధునిక సాగుకు ప్రోత్సాహం**
కరీంనగర్ ప్రాంతంలో సుమారు 60 వేల ఎకరాల్లో రైతులను సంప్రదాయ వరి సాగు విధానాల నుంచి ఆధునిక పద్ధతుల వైపు మళ్లించేందుకు ూశీష ఖఅఅ =ముజూ చీ+ూ చేస్తున్న కృషిని కలెక్టర్ అభినందించారు. ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్న పాత సాగు విధానాల్లో మార్పు తీసుకురావడం సవాలుతో కూడుకున్నదని, రైతుల్లో అవగాహన పెంచేందుకు సంస్థ చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయమని పేర్కొన్నారు.

**దిగుబడితో పాటు నాణ్యతకూ ప్రాధాన్యం**
వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ రావాలంటే అధిక దిగుబడితో పాటు నాణ్యతను కూడా పెంచాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. ఆధునిక సాంకేతికత, సమర్థవంతమైన నీటి వినియోగం, సమతుల్య ఎరువుల వినియోగం, చీడపీడల నియంత్రణపై రైతులకు నిరంతర అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, రైతులు సమన్వయంతో పనిచేస్తే ఆధునిక సాగు విధానాలను మరింత విస్తృతంగా అమలు చేయవచ్చన్నారు. తక్కువ నీరు.. తక్కువ పెట్టుబడి.. అధిక దిగుబడి.. నాణ్యమైన పంట అనే లక్ష్యంతో రైతులు ముందుకు సాగాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, ఎన్జీవో ప్రతినిధులు, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అక్షితకు న్యాయం జరిగే వరకు ఉద్యమం ఆగదు..!!

- మాదిగలపై దాడులు, వేధింపులకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్త పోరాటానికి పిలుపు
- అక్షిత కుటుంబానికి రూ.కోటి పరిహారం ప్రకటించాలి:
- మాదిగ మహాశక్తి నేత ఆసంపల్లి శ్రీనివాస్



**గోదావరిఖని, సెప్టెంబర్ 19 (సింగిడి):** మాదిగ సామాజిక వర్గానికి చెందిన ప్రజలపై జరుగుతున్న దాడులు, వేధింపులు, అఘాయిత్యాలకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని చేపట్టనున్నట్లు మాదిగ మహాశక్తి తెలంగాణ కోర్ కమిటీ సభ్యుడు ఆసంపల్లి శ్రీనివాస్ తెలిపారు. గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థిని తాండ్ర అక్షిత రాణి మృతి ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆసంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. అక్షిత రాణి మృతికి వేధింపులే కారణమని పేర్కొంటూ సూసైడ్ నోట్ ఉన్నప్పటికీ, ఘటనకు బాధ్యులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై చర్యలు తీసుకోవడంలో జాప్యం జరుగుతోందని ఆరోపించారు. ఘటనకు సంబంధించి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు.

**న్యాయం జరిగే వరకు నిరంతర పోరాటం**
అక్షిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే అండగా నిలవాలని ఆసంపల్లి శ్రీనివాస్ కోరారు. బాధిత కుటుంబానికి రూ.కోటి పరిహారం ప్రకటించడంతో పాటు, కుటుంబ సభ్యులకు అవసరమైన సహాయాన్ని అందించాలని డిమాండ్ చేశారు. అక్షిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు మాదిగ మహాశక్తి ఆధ్వర్యంలో పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

**ప్రజాప్రతినిధులు స్పందించాలి**
అక్షిత మృతి ఘటనపై పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు, రామగుండం ఎమ్మెల్యే స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆసంపల్లి శ్రీనివాస్ కోరారు. ప్రజాప్రతినిధులు ఘటనను తీవ్రంగా పరిగణించి బాధిత కుటుంబానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

**మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి అవసరం**
రామగుండం ప్రాంతంలోని సింగరేణి బొగ్గు గనుల్లో పనిచేస్తున్న మహిళలు వేధింపులకు గురవుతున్నారనే ఆరోపణలు తమ దృష్టికి వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. మహిళలు సురక్షిత వాతావరణంలో పనిచేసేలా సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కోరారు. మహిళలపై వేధింపుల విషయంలో ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే స్పందించాలని సూచించారు.

**సీఎం దృష్టికి అక్షిత ఘటన**
అక్షిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ఘటనను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని ఆసంపల్లి శ్రీనివాస్ తెలిపారు. అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను చేపట్టి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా పోరాటాన్ని ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాదిగ మహాశక్తి ప్రతినిధులు స్వప్న, కుక్క కనకరాజు, ఆసంపల్లి రవీందర్, నాతరి ఆదిత్య, పోయిల సాగర్, కుక్క అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# నిమజ్జన వేడుకలకు పోలీసు 'భద్రతా వలయం.!

- శోభాయాత్రలపై ప్రత్యేక నిఘా..
- కీలక ప్రాంతాల్లో భారీ బందోబస్తు
- మినీ ట్యాంక్‌బండ్ వద్ద ఏర్పాట్లపై అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన
- నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరంగా కఠినచర్యలు
- డీసీపీ బి. రామ్ రెడ్డి, ఏసీపీ గజ్జి కృష్ణ



**పెద్దపల్లి, సెప్టెంబర్ 19 (సింగిడి):** వినాయక నిమజ్జన వేడుకలను ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు పెద్దపల్లి పోలీసులు సమగ్ర భద్రతా చర్యలు చేపట్టారు. శోభాయాత్రలు సజావుగా సాగేందుకు ప్రత్యేక భద్రతా ప్రణాళికను రూపొందించి, కీలక ప్రాంతాల్లో అదనపు పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. నిమజ్జన ఏర్పాట్లపై మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో పోలీసులు సమన్వయ సమావేశం నిర్వహించారు. పట్టణంలోని డీసెంట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ సమావేశంలో డీసీపీ బి. రామ్ రెడ్డి, ఏసీపీ గజ్జి కృష్ణతో పాటు పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, ఇరిగేషన్, మత్స్య, వైద్య ఆరోగ్య, ఆర్అండ్‌బీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**పోలీసుల సూచనలు పాటించాలి**
నిమజ్జన శోభాయాత్రల సమయంలో ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని డీసీపీ బి. రామ్ రెడ్డి సూచించారు. నిర్ణయించిన మార్గాల్లోనే ఊరేగింపులు నిర్వహించాలని, పోలీసుల సూచనలను పాటిస్తూ క్రమశిక్షణతో వేడుకలను కొనసాగించాలని కోరారు. శోభాయాత్రల వల్ల సాధారణ ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భద్రతా నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**మినీ ట్యాంక్‌బండ్‌పై ప్రత్యేక దృష్టి**
సమన్వయ సమావేశం అనంతరం డీసీపీ బి. రామ్ రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు మినీ ట్యాంక్‌బండ్‌లోని నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలించారు. భక్తుల రాకపోకలు, నీటి ప్రమాదాల నివారణ, బారికేడింగ్, విద్యుత్ వెలుగులు, పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలను క్షేత్రస్థాయిలో సమీక్షించారు. నిమజ్జన సమయంలో భక్తుల భద్రతకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన రక్షణ చర్యలను ముందుగానే పూర్తిచేయాలని సూచించారు.

**అత్యవసర పరిస్థితులకు ప్రత్యేక బృందాలు**
నిమజ్జన సమయంలో అనుకోని ప్రమాదాలు చోటు చేసుకున్నా వెంటనే స్పందించేలా రక్షణ బృందాలను సిద్ధంగా ఉంచాలని అధికారులు ఆదేశించారు. అవసరమైన సిబ్బంది, రక్షణ పరికరాలు, అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

**ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు**
వినాయక నిమజ్జనానికి భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ నియంత్రణపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. శోభాయాత్ర మార్గాలు, పార్కింగ్ ప్రాంతాలు, ప్రత్యామ్నాయ రహదారులు, వాహనాల రాకపోకల నియంత్రణపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలు, ఇతర అత్య వసర వాహనాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా మార్గాలను అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు.

**ప్రశాంత నిమజ్జనమే పోలీసుల లక్ష్యం**
భక్తిశ్రద్ధలతో జరిగే వినాయక నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా, సురక్షితంగా ముగిసేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని డీసీపీ తెలిపారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. భక్తులు, మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసులకు సహకరించి నిమజ్జన వేడుకలను విజయవంతంగా నిర్వహించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

### భోజనం చేసిన కాసేపటికే

# మళ్లీ ఆకలిగా అనిపిస్తుందా?

### జాగ్రత్త.. డేంజర్ బెల్స్ మోగినట్లే!

చాలా మందికి భోజనం చేసిన కాసేపటికే ఆకలిగా అనిపిస్తుంటుంది. దీంతో స్వీట్లు వంటి ఇంట్లో ఉన్న డిజర్ట్స్ లాగించేస్తుంటారు. అసలు ఇలా ఎందుకు అనిపిస్తుందో మీరెప్పుడైనా ఆలోచించారా? నిజానికి.. మీ ఒంట్లో ఇన్సులిన్ సరిగ్గా పనిచేయడం లేదని చెప్పే సూచిక ఇది. ఇది డయాబెటిస్‌కు సంకేతమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అమెరికన్ డయాబెటిస్ అసోసియేషన్ ప్రకారం తరచుగా ఆకలిగా ఉండటం అనేది శరీరంలోని చక్కెర స్థాయిలలో తేడాల కారణంగా ఇన్సులిన్ పనితీరు బలహీనపడుతుందని సూచిస్తుంది. దీని అర్థం శరీరంలోని ఇన్సులిన్ హార్మోన్ రక్తం నుంచి కణాలకు గ్లూకోజ్‌ను సరిగ్గా అందించలేకపోతుంది. దీని కారణంగా, శరీరానికి సరైన శక్తి లభించదు. దీని వల్ల మెదడు పదే పదే ఆకలిని సూచిస్తుంది. వైద్య పరిభాషలో దీనిని పాలీఫాగియా అంటారు. కాబట్టి డయాబెటిస్ హెచ్చరిక సంకేతాలు ఏమిటి, ఈ రకమైన సమస్యను నివారించడానికి ఏమి చేయాలో నిపుణుల మాటల్లో ఇక్కడ తెలుసుకుందాం..



శరీరంలో డయాబెటిస్ మొదలయ్యే ముందు కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. చాలా మంది వీటిని సాధారణమైనదిగా విస్మరిస్తారు. కానీ ఇలా చేయడం మంచిది కాదు. ప్రారంభ దశలోనే ఆహారంలో మార్పులు చేసుకోవడం ద్వారా ఇటువంటి వ్యాధులను నివారించవచ్చు. లేకపోతే డయాబెటిస్ మీ జీవితాన్ని నాశనం చేస్తుంది. దీనికి చికిత్స లేనందున దానిని నియంత్రణలో ఉంచడం చాలా అవసరం.

**మధుమేహాన్ని వచ్చే ముందు కనిపించే లక్షణాలు**

ఆకలి పెరగడంతో పాటు దాహం కూడా పెరుగుతుంది.
తరచుగా మూత్ర విసర్జన.
బలహీనత.
మసక దృష్టి.

**ఎవరికి ఎక్కువ ప్రమాదం ఉంది?**

కుటుంబంలో ఎవరికైనా డయాబెటిస్ ఉంటే
స్వీట్లు తినడం... అధిక బరువు ఉండటం
వ్యాయామం లేకపోవడం
ఒకే చోట ఎక్కువసేపు కూర్చుని పనిచేయడం



**ఎలా నివారించాలి?**

కొవ్వు తక్కువగా, ప్రోటీన్ ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి.
ప్రతిరోజూ కనీసం 15 నిమిషాలు వ్యాయామం చేయాలి.
తక్కువ చక్కెర తీసుకోవాలి.
మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలి.



### పెట్టుబడి అవసరం లేదు..
## రోజుకు 2గంటలు పనిచేస్తే చాలు..
### నెలకు రూ. 1 లక్ష పక్కా.!

వ్యాపారం చేయాలనే ఆసక్తి ఉన్నప్పటికీ, పెట్టుబడి లేదనే ఆలోచన చాలామందిని వెనక్కి లాగుతుంది. అయితే, ఈ ఆధునిక యుగంలో పెట్టుబడి లేకుండానే వ్యాపారాన్ని ప్రారంభించడానికి అనేక ఉచిత ఆన్‌లైన్ సాధనాలు అందుబాటులో ఉన్నాయి.



మొదట, మీ వ్యాపారానికి ఒక బ్రాండ్ పేరును ఎంపిక చేసుకోవడం అవసరం. చీఖఎవటశ్రీఅఇ లాంటి వెబ్‌సైట్‌లు ఈ ప్రక్రియను సులభతరం చేస్తాయి, ఉచితంగా విభిన్నమైన పేర్లను సూచిస్తాయి. తరువాత, సోషల్ మీడియా మార్కెటింగ్ చాలా కీలకం. ఝఅఝ.ఎశీఎ లాంటి ప్లాట్‌ఫామ్‌లు గ్రాఫిక్ డిజైనింగ్ నైపుణ్యాలు లేని వారికి కూడా ఆకర్షణీయమైన సోషల్ మీడియా పోస్టులు, వీడియోలు రూపొందించడానికి సహాయపడతాయి. ఇది మీ ఉత్పత్తులు లేదా సేవలను ప్రభావవంతంగా ప్రచారం చేయడానికి ఉపయోగపడుతుంది. వెబ్‌సైట్ అవసరం ఉన్న వారికి ుఎజూవసతీఝఎ వంటి సైట్‌లు ఉచితంగా డ్రాగ్ అండ్ డ్రాప్ పద్ధతిలో వెబ్‌సైట్‌ను డిజైన్ చేసుకునే అవకాశాన్ని కల్పిస్తాయి.

చివరగా, కస్టమర్ల నుండి చెల్లింపులను స్వీకరించ ూడానికి Razorpay, Cashfree లేదా Stripవ వంటి పేమెంట్ గేట్‌వేలు ఉన్నాయి. ఇవి మీ బ్యాంక్ అకౌంట్‌కు లింక్ చేసి, కస్టమర్లు వివిధ పద్ధతులలో (క్రెడిట్ కార్డ్, డెబిట్ కార్డ్, యూపీఐ) చెల్లింపులు చేయడానికి వీలు కల్పిస్తాయి. ఈ ఉచిత టూల్స్ సహాయంతో, మీరు మొదట్లో ఎలాంటి పెద్ద పెట్టుబడి పెట్టకుండానే మీ వ్యాపార ఆలోచనను మార్కెట్‌లో పరీక్షించుకోవచ్చు. విజయవంతమైతే, అప్పుడు అవసరమైన రిజిస్ట్రేషన్లు, ఇతర లాంఛనాలకు వెళ్లవచ్చు.

**స్టాక్ మార్కెట్**
Stock Market

# ఉద్రిక్తతలున్నా రాణించిన సూచీలు..

### సెన్సెక్స్ 900 పాయింట్లు పైకి



***ముంబయి: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు రాణించాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలకు తోడు, న్యూక్లియర్ ప్రోగ్రామ్‌ను నిలిపివేయడానికి సిద్ధమంటూ ఇరాన్ డిప్యూటీ విదేశాంగ మంత్రి పేర్కొన్నారంటూ వచ్చిన వార్తలు మార్కెట్ సెంటిమెంట్‌ను బలోపేతం చేసింది. దీంతో ఉద్రిక్తతల వేళ వరుస నష్టాలు చవిచూసిన సూచీలు.. లాభాల్లోకి వచ్చాయి. దీంతో ఓ దశలో సెన్సెక్స్ 1100 పాయింట్ల మేర లాభపడింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.6 లక్షల కోట్లు పెరిగి రూ.453 లక్షల కోట్లకు చేరింది.***

సెన్సెక్స్ ఉదయం 79,530.48 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 79,116.19) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడిన సూచీలు ఇంట్రాడేలో 80,303.83 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 899.71 పాయింట్ల లాభంతో 80,015.90 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 285.40 పాయింట్ల లాభంతో 24,765.90 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, ఎల్అండ్‌టీ, ఎన్టీపీసీ, రిలయన్స్, బీఈఎల్ స్టాక్స్ లాభపడ్డాయి. టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, హిందుస్థాన్ యూనిలీవర్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 82.89 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు 5150 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**లాభాలకు కారణాలు ఇవీ..**

న్యూక్లియర్ ప్రోగ్రామ్‌ను ఆపేందుకు ఇరాన్ అంగీకారం తెలిపినట్లు వార్తలు వచ్చాయి. అమెరికా సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీతో ఇరాన్ చర్చలకు సిద్ధమైందన్న వార్తలూ యుద్ధం త్వరలోనే ముగియబోతుందన్నసంకేతాలిచ్చాయి. అయితే, ఆ వార్తలను ఇరాన్ ఖండించడం గమనార్హం.

మూడు రోజుల వరుస నష్టాల నేపథ్యంలో కనిష్ఠాల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించడంతో మన మార్కెట్ సూచీలు లాభపడ్డాయి.

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు త్వరలోనే చల్లారొచ్చన్న అంచనాలతో ప్రపంచ మార్కెట్లు నేడు రాణించాయి. నిన్న భారీగా పతనమైన దక్షిణ కొరియా కోస్పీ నేడు 9 శాతం మేర లాభపడింది. జపాన్, హాంకాంగ్, చైనా మార్కెట్లు కూడా రాణించడం పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. నిన్నటి అమెరికా మార్కెట్లు కూడా రాణించాయి.

హర్మూజ్ గుండా వెళ్లే నౌకలకు తక్కువ ధరకే బీమా కల్పిస్తామంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొనడమూ మరో కారణం. అవసరమైతే చమురు నౌకలకు అమెరికా నౌకాదళం ఎస్కార్ట్‌గా పంపిస్తామన్నారు.

డాలరుతో రూపాయి విలువ బలోపేతమైంది. నిన్నటి ట్రేడింగ్ సెషన్‌లో 92 ఎగువకు చేరిన రూపాయి విలువ మళ్లీ 91.60 స్థాయికి చేరింది. దీనికితోడు రిలయన్స్ వంటి అత్యధిక వెయిటేజీ కలిగిన స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు సూచీలకు దన్నుగా నిలిచింది. క్రూడాయిల్ ధరల పెరుగుదల వల్ల (విండ్‌ఫాల్ ట్యాక్స్ విధించకపోతే) రిలయన్స్ కంపెనీ లాభపడుతుందన్న జెఫ్రీచ్ నివేదిక కొనుగోళ్ల మద్దతుకు కారణమైంది.



## సకల సృష్టికి మూలకర్త విశ్వకర్మ భగవానుడు

### బ్రహ్మశ్రీ కాకోజు పాండురంగ స్వామి



**బిజినేపల్లి, (సింగిడి):** సకల సృష్టికి మూలకర్త విశ్వకర్మ భగవానుడని, ఆయనను భక్తిశ్రద్ధలతో ఆరాధించడం ద్వారా ఆధ్యాత్మిక చింతన పెంపొందుతుందని బ్రహ్మశ్రీ కాకోజు పరమాత్మ అతీత అంచల పాండురంగ స్వామి అన్నారు. మండలంలోని లట్టుపల్లి గ్రామంలో గల శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో విశ్వకర్మ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద మంత్రోచ్చారణల మధ్య హోమాన్ని భక్తిపూర్వకంగా చేపట్టారు. ఈ సందర్భంగా పాండురంగ స్వామి మాట్లాడుతూ.. విశ్వకర్మ భగవానుడి అనుగ్రహంతో ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ భక్తి, ధర్మం, సత్ప్రవర్తనను జీవితంలో అలవర్చుకుని ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలని సూచించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. సాయంత్రం శ్రీ ఆంజనేయ స్వామి కోలాటం, మహిళలు వచ్చే చెక్కభజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు శ్యాంసుందర్ శ్యాంసుందర్ రెడ్డి, మారేపల్లి అచ్యుతారెడ్డి, వెంకటేశ్వరాచారి, డాక్టర్ బాలు, సురేష్, శ్రావణి, గంగ, శివ, తిరుపతి, భావన శ్రీ, రేణుకశ్రీ, బ్రహ్మతేజ, షణ్ముఖ శ్రీ, అవంతిక, కృష్ణాజీ, శోభతో పాటు మహిళలు, భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### 11వ వార్డులో రూ.52 లక్షలతో

## సీసీ రోడ్ల పనులకు శ్రీకారం

### పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే కాలే యాదయ్య



**చేవెళ్ల (సింగిడి):**
చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో రూ.52 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కాలే యాదయ్య శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు.మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డి, 11వ వార్డు కౌన్సిలర్ పైండ్ల మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు,చేవెళ్ల ఎమ్మెల్యే శ్రీ కాలే యాదయ్య ప్రత్యేక చొరవతో, నగర అభివృద్ధి నిధుల నుంచి రూ.52 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు వార్డుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. సీసీ రోడ్ల నిర్మాణంతో స్థానిక ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు తొలగనున్నాయని పేర్కొన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను సూచించారు.రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్,మాజీ సర్పంచ్ ప్రస్తుత కౌన్సిలర్,అధికారులు, కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్,సర్పంచులు,ఉప సర్పంచులు,మండల పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు,నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

### -మళ్లీ ఆయన్నే సీఎంను చేస్తాం
### -దమ్మపేటలో గిరిజన నేతలు, బీఆర్ఎస్ శ్రేణుల ప్రకటన



**దమ్మపేట,(సింగిడి):**
తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు చిత్రపటానికి మండల కేంద్రంలోని బిఆర్ఎస్ కార్యాలయం వద్ద శుక్రవారం గిరిజన, ఆదివాసీ నాయకులు, బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా పాలాభిషేకం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగ కాంతారావు పిలుపు, నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా గిరిజన నాయకులు మాట్లాడుతూ.. గత కేసీఆర్ ప్రభుత్వంలో గిరిజన, ఆదివాసీలకు ఎంతో మేలు జరిగిందని, ఆ సంక్షేమ పథకాలను తాము ఎప్పటికీ గుర్తుంచుకుంటామని కొనియాడారు. తెలంగాణలో మళ్లీ కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయడానికి గిరిజనులంతా ఏకతాటిపైకి వచ్చి సిద్ధంగా ఉన్నారని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు రావుల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ రూప్ సింగ్, మాజీ ఎంపీటీసీ కాసిని శ్రీను, ఉప సర్పంచ్ ముత్తిన రామకృష్ణ, గిరిజన యూత్ నాయకులు జారే రామకృష్ణ, పాయం ప్రవీణ్ పాల్గొన్నారు. అలాగే మండల సీనియర్ నాయకులు దారా యుగుందర్, మండల ఉపాధ్యక్షులు గాజుబోయిన యేసుబాబు, నియోజకవర్గ యూత్ మాజీ కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాసరావు, మండల మాజీ యూత్ అధ్యక్షులు మండవ సత్యనారాయణ, అబ్దుల్ జిన్న, వెలుగోటి మహేష్, మండల ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు రావూరి వీరయ్య, వార్డు సభ్యులు దారా రాము, రూప రాంబాబు, ఉయ్యాల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛతను సామాజిక బాధ్యతగా స్వీకరించాలి

**-పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్**
**-శిథిల భవనం తొలగింపునకు చర్యలు చేపట్టాలని ఆదేశం**
**-పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచన**
**-వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**





**రేవల్లి,ఏదుల, (సింగిడి):**
స్వచ్ఛతను కేవలం కార్యక్రమాలకే పరిమితం చేయకుండా ప్రతి ఒక్కరూ తమ నిత్యజీవితంలో భాగంగా చేసుకోవాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. శుక్రవారం ఏదుల మండలం చెన్నారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పాఠశాల పరిసరాలతో పాటు ఇళ్లు, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు. స్వచ్ఛమైన పరిసరాలతోనే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించగలమన్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందించిన యూనిఫాంలను సద్వినియోగం చేసుకొని బాగా చదువుకోవాలని సూచించారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్క నాటారు.

**శిథిల భవనం తొలగింపునకు చర్యలు**
పాఠశాల ఆవరణలోని శిథిలావస్థకు చేరిన పాత భవనాన్ని కలెక్టర్ పరిశీలించి, ప్రమాదకరంగా ఉన్న భవనాన్ని తొలగించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం వినియోగంలో ఉన్న పాఠశాల భవనంలో అవసరమైన మరమ్మతులు చేపట్టాలని సూచించారు. పాఠశాల క్రీడా మైదానంతో పాటు మొత్తం పాఠశాల భూమిని రెవెన్యూ అధికారులు సర్వే చేసి హద్దులను స్పష్టంగా నిర్ణయించాలని ఆదేశించారు.

**పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి**
చెన్నారం గ్రామంలోని గ్రంథాలయం, ఆరోగ్య ఉపకేంద్రానికి సంబంధించిన పెండింగ్ పనులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్న కలెక్టర్, పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని గ్రామస్థులు కలెక్టర్‌ను కోరగా, సమస్యను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య, పంచాయతీరాజ్, రెవెన్యూ అధికారులు, గోపాల్పేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్య శీలా రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల క్షేమం కోసమే స్మార్ట్ రేషన్ కార్డులు

### -సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి



**చేవెళ్ల (సింగిడి):**
ప్రజల సంక్షేమం కోసమే స్మార్ట్ రేషన్ కార్డులు, ప్రభుత్వం పంపిణీ చేస్తుందని చన్ వెల్లి గ్రామ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. బుధవారం చేవెళ్ల మండల పరిధిలోని చన్ వెల్లి గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత సులభంగా, పారదర్శకంగా అందే అవకాశం ఉంటుందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రేషన్ కార్డుల ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ కార్యక్రమాల్లో లబ్ధి పొందేందుకు అవకాశం కలుగుతుందని అన్నారు. ప్రజలు స్మార్ట్ రేషన్ కార్డులను భద్రంగా ఉంచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ వార్డ్ మెంబర్లు , గ్రామ ప్రజలు పంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు..

## జనకళ్యాణ్ దివాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

### -బీఎస్పీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు పుల్లూరు ఉమేష్



**దుబ్బాక,(సింగిడి):** బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జనకళ్యాణ్ దివాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఎస్పీ సిద్ధిపేట జిల్లా అధ్యక్షుడు పుల్లూరు ఉమేష్ పిలుపునిచ్చారు.శుక్రవా రం దుబ్బాక పట్టణ కేంద్రంలో బీఎస్పీ దుబ్బాక అసెంబ్లీ అధ్యక్షుడు సుద్దాల రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పుల్లూరు ఉమేష్ మాట్లాడుతూ బహుజనుల హక్కుల కోసం పోరాడే పార్టీ బీఎస్పీ అని పేర్కొన్నారు. మహనీ యుల ఆశయాలు, సిద్ధాంతాలను గ్రామ గ్రామాన ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అనంతరం జనకళ్యాణ్ దివాస్‌కు సంబంధిం చిన పుస్తకాలను పార్టీ నాయకులకు పంపిణీ చేశారు. పార్టీని బూత్ స్థాయి వరకు బలోపేతం చేసి, ప్రజల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో బీఎస్పీ అసెంబ్లీ కార్యదర్శి మచ్చ శ్రీనివాస్, బైండ్ల రాజనర్సు, చింతల నరసింహులు, సంఘం నరసింహులు, బత్తుల రాజు, ఎస్కే నర్సింలు తదితర స్థానిక బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి జన్మదిన వేడుకలు



**చేవెళ్ల(సింగిడి):**
మాజీ పార్లమెంట్ సభ్యుడు గడ్డం రంజిత్ రెడ్డి జన్మదిన వేడుకలను అభిమానులు, నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు నాయకులు, కార్యకర్తలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పామేల బీమ్ భరత్ గడ్డం రంజిత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. రంజిత్ రెడ్డి ప్రజా జీవితంలో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరుకున్నారు.వేడుకల సందర్భంగా అభిమాను లు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా సేవే పరమావధిగా, నిత్యం ప్రజల మధ్య ఉంటూ, చేవెళ్ల పార్లమెంట్ అభివృద్ధికి ఎంతో కృషి చేసిన మీరు, మాకు నిత్యం స్ఫూర్తిదాయకం. మీ మార్గదర్శకత్వంలో మేము ముందుకు సాగుతున్నాము మీరు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండి, రాజకీయంగా మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. మొయినాబాద్ మున్సిపల్ పట్టణ కేంద్రంలో చేవెళ్ల మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని మొయినాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సత్య నారాయణ మున్సిపల్ అధ్యక్షులు విక్రమ్ రెడ్డి శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో ఎన్కేపల్లి గ్రామంలోని ప్రైమరీ స్కూల్ లో చిన్నారులకు నోట్ బుక్స్ మరియు ఎగ్జామ్ ప్యాడ్ లు అందజేశారు మరియు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినిలకు పుస్తకాలు పంపిణీ చేసి కేక్ కట్ చేసి విద్యార్థినులకు స్వీట్స్ పంచి పెట్టారు..ఈ కార్యక్రమంలో పాల్గొన్న మొయినాబాద్ మండలం మాజీ అధ్యక్షులు మానయ్య టీ పి సి సి సభ్యులు దర్శన్ ,వైస్ ప్రెసిడెంట్ రవీందర్ రెడ్డి గారు, కరణ్ మాజీ ఎంపీటీసీ గణేష్ గౌడ్, బిక్షపతి , అశోక్ యాదవ్ పెద్ద మంగళారం కుమార్ , కౌన్సిలర్ వెంకట్ రెడ్డి , కౌన్సిలర్ రమేష్ నాయక్ , శ్రీశైలం , ఎన్కేపల్లి గ్రామ అధ్యక్షులు రాజేష్ , సత్య నారాయణ గౌడ్ , మాధవ రెడ్డి , అమరేందర్ రెడ్డి , మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమేష్ ముదిరాజ్ , శ్రీపాల్ రెడ్డి , పెద్ద మంగళారం అనంత రెడ్డి , అమ్డాపూర్ జగన్ రెడ్డి , సుధాకర్ గౌడ్ , మల్లేష్ యాదవ్ కౌన్సిలర్ మహేష్ , యాదగిరి చారి విక్రమ్ రెడ్డి, మల్లేష్, రాజేష్ తదితరులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు..

## మోదీ జన్మదిన వేడుకల్లో బీజేపీలో యువకుల చేరిక

**రేవల్లి,ఏదుల, (సింగిడి):**
భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని వనపర్తి జిల్లా ఏదుల మండలం చీర్కపల్లి గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ, కేక్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. బీజేపీ చీర్కపల్లి బూత్ కమిటీ అధ్యక్షుడు శివ పార్టీ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుడు అయ్యంగారి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా నాయకులు లోకనాథ్‌రెడ్డి, సబిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొని కేక్ కట్ చేసి మోదీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం అయ్యంగారి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలకు మేలు చేయడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై చీర్కపల్లి గ్రామానికి చెందిన గడ్డి గోపుల వెంకటేష్, నక్క శేషి, కుందేళ్ల మల్లేష్, శివ బీజేపీలో చేరారు.

## విశేష పుష్పాలంకరణతో గణనాథులు



**ఆమనగల్లు,(సింగిడి):**
విశేష పుష్పాలంకరణతో గణనాథుడు. భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతిరోజు ఉదయం,సాయంత్రం వేళలో భక్తులతో వినాయక మండపాలు కిటకిటలాడుతున్నాయి..భక్తులు పూజల కోసం ఆయా మండపాల వద్ద బారులు తీరుతున్నారు. పూజల అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.వినాయక నవరాత్రులను పురస్కరించుకొని ఆమనగల్లు మున్సిపాలిటీ లోని తొమ్మిదివ వార్డు వెంకటగిరి కాలనీ, విఘ్న వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన గణనాథుడికి భక్తి శ్రద్దలతో పూజలు నిర్వహించారు.

## ప్రశాంతంగా నిమర్జనం జరుపుకోవాలి

### -సిఐ కట్ట నరేందర్ రెడ్డి.



**చేవెళ్ల(సింగిడి):**
నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వినాయక నిమజ్జన కార్యక్రమానికి వచ్చే భక్తులు జాగ్రత్తగా ఉండాలని చేవెళ్ల సీఐ కట్టా నరేందర్ రెడ్డి సూచించారు. శుక్రవారం చేవెళ్లలోని గుండం వద్ద 5వ రోజు నిమజ్జన ఏర్పాట్లను 11వ వార్డు కౌన్సిలర్ పైండ్ల మధుసూదన్ రెడ్డితో కలిసి సీఐ పరిశీలించారు. నిమజ్జనం ఊరేగింపు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, చిన్నారులను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. భక్తులు పోలీసులకు, నిర్వాహకులకు సహకరించి ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించుకోవాలని కోరారు.

## వైభవంగా వినాయకుని నిమర్జనం



**చేవెళ్ల(సింగిడి):**
చేవెళ్ల మున్సిపల్ పరిలోని వినాయక నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా స్థానిక యువకుడు బాలు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథునికి 5వ రోజు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ పుష్కరిణిలోని నిమజ్జన కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు.

## ఆదర్శ పాఠశాల ఉద్యోగాలు అవకాశాలు



**నంగునూరు (సింగిడి):**
నర్మెట్ట కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం కేజీబీవిలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కుక్, అక్కెన పల్లి ఆదర్శ పాఠశాల బాలకల వసతి గృహం లో హెడ్ కుక్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో తగిరెడ్డి దేశిరెడ్డి శుక్రవారం పత్రిక ప్రకటన లో తెలిపారు, హెడ్ కుక్ కు పదోతరగతి, అసిస్టెంట్ కుక్ ఏడో తరగతి పాస్ అయి ఉండాలి, వయస్సు 25 నుండి 55 ఏళ్ల మధ్యలో ఉండాలి, ఆసక్తి గల మహిళలు తమ ఆధార్, విద్యా అర్హత ధ్రువ పత్రాలు, ఫోటోతో ఈ నెల 22 లోపు ఆయా వసతి గృహాలలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## పాము కాటుతో మహిళ మృతి



**నంగునూరు,(సింగిడి):**
నాగుపాము కాటుకు గురై మహిళ మృతి చెందిన విషాద ఘటన నంగు నూరు మండలం బద్దిపడ గలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పసు పుల సుశీల (52) శుక్రవారం ఉదయం సుమారు ఏడు గంటల సమయంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు బాత్‌రూంలోకి వెళ్లింది. అప్పటికే అక్కడ ఉన్న నాగుపాము సుశీలను కాటువేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పాము కాటుకు గురైన సుశీల తీవ్ర అస్వస్థతకు గురయ్యింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించినప్పటికీ పరిస్థితి విషమించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనతో బద్దిపడగ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతి చెందిన పసుపుల సుశీలకు భర్త యాదయ్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న సుశీల మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు

## 'మగాళ్లు జిందాబాద్' ఫస్ట్ లుక్ విడుదల..

### కడుపుబ్బా నవ్వించడానికి సిద్ధమైన నందు

టాలీవుడ్ యంగ్ హీరో శ్రీనందు వరుస సినిమాలతో దూసుకుపోతున్నారు. ఫలితాలతో సంబంధం లేకుండా విభిన్నమైన కథలు, ప్రత్యేకమైన కాన్సెప్ట్‌లను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తున్న ఆయన,ఇటీవల 'అగ్లీ స్టోరీ' చిత్రంతో పలకరించారు. తాజాగా, తన కొత్త సినిమాను అనౌన్స్ చేసి అందరి దృష్టిని ఆకర్షించారు. శ్రీనందు , లక్ష్మి, టాలీవుడ్ స్టార్ కమెడియన్లు వెన్నెల కిషోర్, వైవా హర్ష ప్రధాన పాత్రలలో నటిస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కి 'మగాళ్లు జిందాబాద్' అనే ఫన్నీ టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ సోషల్ మీడియాలో నవ్వులు పూయిస్తోంది. ఇందులో శ్రీనందు, వెన్నెల కిషోర్, వైవా హర్ష ముగ్గురూ పూల దండలతో విభిన్నంగా కనిపించి ఆకట్టుకుంటున్నారు. ఇక విడుదలైన వీడియోలో ముందుగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను చూపించగా, ఆ తర్వాత హీరోయిన్ లక్ష్మి ఎంట్రీ హైలైట్‌గా నిలిచింది.

ఈ సినిమాలో హీరో శ్రీనందు 'గన్నెల్' అనే పాత్రలో కనిపించబోతున్నారని, ఆయన శారదాంబ హోటల్‌ను నిర్వహిస్తూ ఈ రోల్‌లో అలరిస్తారని మేకర్స్ తెలిపారు. మరోవైపు వైవా హర్ష 'ఈగల్'గా, వెన్నెల కిషోర్ 'ముక్కోడు' అనే ఒక కటింగ్ షాప్ ఓనర్‌గా తమదైన శైలిలో ద
కడుపుబ్బా నవ్వించడానికి సిద్ధమయ్యారు.

## నిమ్మజన సమయంలో జాగ్రత్తలు పాటించాలి



ఆమనగల్లు, (సింగిడి):
మాడ్గుల మండల కేంద్రంలోని గిరికొత్తపల్లి గ్రామంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. వినాయకుని సన్నిధిలో సిఐ వేణుగోపాల్ సర్పంచ్ భాగ్యమ్మ, ఉపసర్పంచ్ ఖదీర్ తో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన మండపాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ.. గణనాథుని ఆశీస్సులతో మండల ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సౌండ్ బాక్సుల సమీపంలో చిన్న పిల్లలను తీసుకురావద్దని, తల్లిదండ్రులు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వినాయక మండపాల నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

## గ్రామాన్ని కాపాడుకునేందుకు పోరుబాట పట్టిన ఆకుతోటపల్లి ప్రజానీకం

**ఆమనగల్లు, (సింగిడి):**
ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లిలో క్రషర్ ఏర్పాటును నిరసిస్తూ గ్రామస్తులు పోరు బాటకు సిద్ధమయ్యారు. శనివారం ఆమనగల్లు భవాని గార్డెన్ నుంచి తహసిల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం తహసిల్దార్ కార్యాలయం ఎదుట మహా ధర్నా చేపడుతున్నట్లు ఆకుతోటపల్లి గ్రామ సర్పంచ్ న్యాలపట్ల నరేందర్ రెడ్డి, గ్రామ పాలకవర్గం సభ్యులు వెల్లడించారు. ఈ నిరసన కార్యక్రమంలో గ్రామానికి చెందిన యువత, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.




### నియోజకవర్గ సమస్యలపై అసెంబ్లీ గళమెత్తిన ఎమ్మెల్యే కసిరెడ్డి

**ఆమనగల్లు, (సింగిడి):**
కల్వకుర్తి నియోజక వర్గం లో నెలకొన్న విద్యుత్ స్తం భాలు, కరెంట్ వైర్ల మా ర్పు సమస్యను స్థానిక శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి తక్షణమే స్పందించాలని కోరారు. ప్రజల ఇబ్బందులను నివారించేందుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



### అమరచింత రూరల్

## బీజేవైఎం అధ్యక్షుడిగా ప్రశాంత్ ఎన్నిక

**అమరచింత, (సింగిడి):**
బీజేవైఎం అమరచింత రూరల్ అధ్యక్షులుగా చంద్రఘడ్ గ్రామానికి చెందిన వార్డు సభ్యులు ప్రశాంతును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నారాయణపేట జిల్లా బీజేవైఎం అధ్యక్షులు భరత్ కుమార్ శుక్రవారం తెలిపారు. బీజేవైఎం రూరల్ అధ్యక్షులుగా ప్రశాంత్ యువజన సంఘాన్ని అభివృద్ధి చేయాలని ఆయన కోరారు. తనకు ఇచ్చిన పదవికి న్యాయం చేసి బీజేవైఎం ఎదుగుదల కృషి చేస్తానని ప్రశాంత్ అన్నారు. బీజేవైఎం రూరల్ అధ్యక్షులుగా ప్రశాంత్ ఎన్నిక కావడం పట్ల అమరచింత, అమరచింత మండలంలోని ఆయా గ్రామాల బీజేపీ, బీజేవైఎం నాయకులు హర్షం ప్రకటించారు.




## రాష్ట్ర మంత్రి వాకిటి కృషితో భూత్పూర్ లెఫ్ట్ కెనాల్ పూడికతీత పనులు



**అమరచింత,(సింగిడి):**
భూత్పూర్ కెనాల్ నిండగా చెత్తాచెదారం పేరుకుపోవడంతో సాగు నీరు నిలిచిపోయింది. అమరచింత చంద్రప్ప తాండ, పిన్నం చర్ల గ్రామాల రైతుల ఇబ్బందులు తెలుసుకొని వెంటనే హిటాచి వాహనంతో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించిన రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి రాష్ట్ర గీతా కార్మిక కార్పొరేషన్ వైస్ చైర్మన్ కేశం. నాగరాజు గౌడ్ లకు ఆయా గ్రామాల రైతులు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం చంద్రప్ప తాండ మీదుగా పూడికతీత పనులు నడుస్తుండగా తండా ఉపసర్పంచ్ మహేష్ సుజాత పనులను పరిశీలించారు రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మంత్రి వెంటనే సాగునీరు అందించేందుకు ఉన్న ఇక్కట్లను తొలగించే పని చేసినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు.

## అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

**నాగర్‌కర్నూల్, (సింగిడి):**
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న పంది హమరా ప్రసాద్‌పై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు, మాజీ జెడ్పీటీసీ సి. పరశురాములు డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన వివిధ సమస్యలు, కేసుల పరిష్కారంపై గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశానికి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా పరశురాములు ఆధ్వర్యంలో బడుగు, బలహీన వర్గాల ప్రతినిధులు చైర్మన్‌ను కలిసి అంబేద్కర్‌పై చేసినట్లు ఆరోపిస్తున్న అనుచిత వ్యాఖ్యలపై ఫిర్యాదు చేశారు. అంబేద్కర్‌ను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడమే కాకుండా, ఆయనపై వివాదాస్పద పుస్తకం ప్రచురించేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొంటూ జిల్లా ఎస్పీ, కలెక్టర్‌తో పాటు రాష్ట్ర చైర్మన్‌కు వినతిపత్రాలు అందజేసినట్లు పరశురాములు తెలిపారు. ఈ వ్యవహారంపై రాష్ట్రవ్యాప్తంగా పలువురు ఫిర్యాదులు, కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. సంబంధిత వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు, పుస్తకాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం రావడం పట్ల పరశురాములు హర్షం వ్యక్తం చేశారు.



# బాలికల ఆరోగ్యానికి భరోసా

- పాఠశాలల్లో రుతుస్రావ పారిశుధ్య వసతులపై తనిఖీలు చేయాలి
- శానిటరీ ప్యాడ్స్ నుంచి పరిశుభ్రమైన మరుగుదొడ్ల వరకు అన్ని సౌకర్యాలు కల్పించాలి
- వసతుల లేమితో విద్యార్థినుల చదువుకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలి



**హుజూర్నగర్, (సింగిడి):**
రాష్ట్రంలోని పాఠశాలల్లో విద్యార్థినులకు రుతుస్రావ సమయంలో అవసరమైన మౌలిక పారిశుధ్య వసతులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయా లేదా క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని విన్నపం ఒక పోరాటం స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. బాలికల ఆరోగ్యం, ఆత్మగౌరవం, విద్యకు ఎలాంటి ఆటంకం కలగకుండా పాఠశాలల్లో అవసరమైన సౌకర్యాలను కల్పించాలని విజ్ఞప్తి చేసింది. రుతుస్రావ సమయంలో విద్యార్థినులకు నాణ్యమైన శానిటరీ ప్యాడ్స్, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, నిరంతర నీటి సౌకర్యం, ప్యాడ్స్‌ను సురక్షితంగా పారవేసే ఏర్పాట్లు, గోప్యతకు అనువైన వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంస్థ కోరింది. సుప్రీంకోర్టు ఆదేశాల అమలును రాష్ట్ర ప్రభుత్వం, వి ద్యా శా ఖ అ ధి కా ర ు ల ు న మ ర్థ వ ం త ం గా పర్యవేక్షించాలని, పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వసతుల లోపాలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేసింది. కేవలం సౌకర్యాలు ఏర్పాటు చేయడం మాత్రమే కాకుండా వాటి నిర్వహణ, పరిశుభ్రత, నిరంతర అందుబాటుపై పర్యవేక్షణ కొనసాగించాలని సూచించింది. సంస్థ వ్యవస్థాపకురాలు, రాష్ట్ర అధ్యక్షురాలు చీకూరి లీలావతి మాట్లాడుతూ రుతుస్రావం కారణంగా విద్యార్థినులు పాఠశాలకు గైర్హాజరు కాకుండా, చదువులో వెనుకబడకుండా అవసరమైన పారిశుధ్య వసతులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. బాలికలు రుతుస్రావాన్ని ఎలాంటి ఇబ్బంది, సంకోచం లేకుండా ఎదుర్కొనేలా పాఠశాలల్లో అనుకూల వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో రుతుస్రావ పారిశుధ్య వసతులపై సమగ్ర తనిఖీలు నిర్వహించి, లోపాలను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. బాలికల ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు వారి విద్యాభ్యాసం నిరంతరాయంగా కొనసాగేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని లీలావతి విజ్ఞప్తి చేశారు.



## నిమజ్జనంలో మండపాల నిర్వాహకులు అధికారులకు సహకరించాలి

**ఆమనగల్లు, (సింగిడి):**
వినాయక నిమజ్జనంలో మండపాల నిర్వాహకులు అధికారులకు సహకరించాలని మహేశ్వరం జోన్ డీసీపీ నారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆమనగల్లు పట్టణంలోని సురసముద్రం చెరువు వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లను మహేశ్వరం జోన్ డీసీపీ నారాయణ రెడ్డి, ఏసీపీ జానకి రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా చెరువు పరిసరాల్లో భక్తులు,ప్రజల భద్రతకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించిన ఆయన అవసరమైన చోట హెచ్చరికలు, భద్రతా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు, వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా పోలీసు సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. బారికేడ్లు, లైటింగ్, క్రేన్ల ఏర్పాట్లపై ఆరా తీశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నియంత్రణ, భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించి, అన్ని ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. వినాయక నిమజ్జనంలో ప్రతిఒక్కరు ప్రభుత్వ అధికారులకు సహకారించాలని సూచించారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, మున్సిపల్ ఛైర్మన్ పత్య నాయక్, ఎస్ఐ సంతోష్, కౌన్సిలర్లు వెంకటయ్య, రమేష్, మున్సిపల్ సిబ్బంది షర్ఫుద్దీన్ తదితర నాయకులు ఉన్నారు.



## విఘ్నాలు తొలగించు.. శుభాలు కలిగించు స్వామి

**ఆమనగల్లు, (సింగిడి):**
వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కడ్తాల పట్టణంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్ స్థాపించిన స్వామి వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్టించిన బొజ్జ గణపయ్యకు ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, సర్పంచ్ బిక్షపతి లతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమాల అనంతరం గంప రాఘవ కుమారుడు చిరంజీవి సరవిక్ పుట్టినరోజు సందర్భంగా వినాయకుని ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం అన్న ప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం గంప వెంకటేష్ గుప్త మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయకులను పూజించాలని అన్నారు. స్వామి వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో గణేష్ మండపంలో ప్రతిష్టించిన వినాయకుడు మనందరికీ విఘ్నాలు తొలగించి.. శుభాలు కలిగించాలని ఆ పార్వతి సుతుడి ఆగమానం.. ఇంటింటా ఆనందం వెల్లి విరియాలని ఆయన మనసారా కోరుతున్నానని తెలిపారు. అనంతర భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు. వినాయక నిమజ్జనం రోజు ప్రతి ఒక్కరూ భక్తి భావంతో ఎలాంటి ఇబ్బందులకు తావివ్వకుండా నిర్వహించాలని కోరారు. పోలీసులు సూచించిన మార్గంలో నిమజ్జన వేడుకలను నిర్వహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కడ్తాల సర్పంచ్ రాయకంటి బిక్షపతి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, ఉప సర్పంచ్ యాదగిరి రెడ్డి, మాజీ ఎంపిటిసి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ, మాజీ జడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్, మాజీ వార్డు సభ్యులు రామచంద్రయ్య, హెచ్ఆర్ మహేష్, వివేకనంద యువజన సంఘం అధ్యక్షుడు క్యామ మహేష్, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, వార్డు సభ్యులు పెరుమాళ్ళ లక్ష్మమ్మ మల్లయ్య, జహంగీర్ బాబా, కృష్ణవేణి రమేష్, మమత మహేష్, భాను కిరణ్, కొప్పు వసంత, కొప్పుకృష్ణ, దొడ్డు పుల్లమ్మ, నాగరాజు, మాదారం గణేష్ గౌడ్, మంకీ మహేష్, ముత్తికృష్ణ, విజయ్ కుమార్, రవి నాయక్, ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి బి రామకృష్ణ గుప్తా, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు బి వీరేందర్ గుప్తా, వీరేష్, గంప రాజేష్, చంద్రయ్య గుప్తా, నవీన్ గుప్తా, కంబాలపల్లి అంజి, బీజేపీ నాయకులు రవి, యాదగిరి, పద్మశాలి సంఘం అధ్యక్షుడు అమృతం పాండు, గంప కుటుంబ సభ్యులు జగదీష్, సంతోష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## సామా జగన్ వాడలో ఘనంగా గణపతి హోమం, వరుణయాగం

**అమరచింత, (సింగిడి):**
సకాలంలో వర్షాలు కురవాలని వరుణ దేవునికి ప్రత్యేక యజ్ఞ యాగాలు నిర్వహించారు. అమరచింత మున్సపాలిటీ కేంద్రంలోనిసామ జగన్ వాడలోని వినాయక మండపంలో శుక్రవారం ఘనంగా గణపతి హోమం, వరుణ యాగం కార్యక్రమాలను నిర్వహించారు. పట్టణ ప్రజలు సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని, రైతులకు సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ వరుణ దేవునికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కురుమూర్తి దేవస్థానానికి చెందిన వేద పండితులు పాల్గొని వేద మంత్రోచ్చారణల మధ్య గణపతి హోమం, వరుణ యాగాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సుమారు 25 మంది దంపతులు ఈ యజ్ఞ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామా జగన్ యూత్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని కాలనీలోని దాతలు, స్థానికుల సహకారంతో విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం కోసం గత మూడు రోజులుగా 8వ వార్డు కౌన్సిలర్ మేర్వ రాజు గారు, సామా జగన్ యూత్ సభ్యులతో కలిసి అవసరమైన ఏర్పాట్లను ముందుండి పర్యవేక్షించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన భక్తులకు అన్న ప్రసాదం, తీర్థ ప్రసాదం అందించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ మంగమ్మ-నాగభూషణ్ గౌడ్ దంపతులతో పాటు, నరాల నారాయణ, సిద్ధు రాములు, విజయ్ యాదవ్, పి. శ్రీకాంత్, కృష్ణారెడ్డి, సిల్వరీ శ్రీనివాసులు, తిరుమల రఘు, ఎంకంపల్లి శ్రీను, కొంగరీ కృష్ణమూర్తి, బి. రమేష్, శాక శ్రీనివాసులు, చాకలి రవి, భరత్ తదితర కుటుంబాల దంపతులతో పాటు సామా జగన్ యూత్ సభ్యులు మహంకాళి శేఖర్, అఖిల్, సునీల్, వెంకటేష్ గౌడ్, సిల్వరీ నాగరాజు, అభిరామ్, తిరుమల నరసింహ పాల్గొన్నారు.



### విజయ విహార్ కాలనీలో ఘనంగా "జై శ్రీరామ్ భజన్ జామింగ్"

**ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**



**అల్వాల్, (సింగిడి):** తుర్కపల్లి డివిజన్‌లోని విజయ విహార్ కాలనీలో శ్రీ గణేష్ చవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన "జై శ్రీరామ్ భజన్ జామింగ్" కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై భక్తులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు కరుణశ్రీ, ఉదయ్ ప్రకాష్‌ను ఎమ్మెల్యే అభినందించారు. భక్తి, ఆధ్యాత్మికతతో పాటు ప్రజలందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చే ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో సోదరభావాన్ని, ఐక్యతను మరింత పెంపొందిస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శ్రీమతి శాంతి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తోట నరేందర్ రెడ్డి, డోలి రమేష్, డిల్లీ పరమేష్, భాస్కర్ రెడ్డి, నార్ల సురేష్, పవన్, ప్రశాంత్ రెడ్డి, సురేష్, శ్రీధర్ గౌడ్, సాయి, గణేష్, అజయ్, జావీద్, రెహ్మత్ ఖాన్, ఆరిఫ్, దేవేందర్, నాగరాజు, మహేష్, తిరుమల్, పెంటారెడ్డి, భాస్కర్ గౌడ్, యాదగిరి గౌడ్, నర్సింగ్ రావు, సాజిద్, సందీప్, రామకృష్ణ, మణికంఠ, అరుణ్, అభి, ప్రశాంత్, సాయిరాజ్, బిజెపి నాయకులు మోయి సుజాత, తదితరులు పాల్గొన్నారు. పలు కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.


### కొనసాగుతున్న ఉద్యమకారుల జేఏసీ రిలే నిరాహార దీక్షలు



**అల్వాల్, (సింగిడి):**
తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ అల్వాల్ రిలే నిరవధిక దీక్ష లు లో భాగంగా రెండవ రోజు అమరవీరుల శిబిరంలో కొనసాగాయి. కాంగ్రెస్ ఎన్నికలలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తూచాతప్పకుండా ప్రభుత్వం పాటించాలని కోరడం జరిగిందని జేఏసీ సురేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్లోళ్ల సురేందర్ రెడ్డి, రషీష్, భాస్కర్, సత్తయ్య దీక్షలో కూర్చున్నారు. దయాకర్, సంతోష్ ,సుధీర్ ,రమేష్, సంగమేశ్వర్ ,నరసింహ, సంఘీభావం తెలిపారు

### భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడి పూజ

**ఎల్బీ నగర్, (సింగిడి):**
శ్రీ శక్తి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేష్ పండల్ వద్ద ఏర్పాటు చేసిన అయ్యప్ప పడి పూజ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గురు స్వాములు వక్కలంక శ్రీనివాస్ రావు, సత్యప్రియ, శర్మ తదితర స్వాములతో కలిసి యువజన కాంగ్రెస్ నాయకులు స్వరూప్ రాజ్ పూజాలో పాల్గొని అయ్యప్ప స్వామి వారి ఆశీస్సులు పొందారు.



# ఓట్ల తొలగింపు కుట్రలను తిప్పికొడుతూ కాపాడాల్సిన ప్రజాస్వామ్య బాధ్యత

- అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు కాపాడే బాధ్యత మనదే
- బిఎల్ఎలు ప్రతి బూతులో అప్రమతంగా ఉండాలి
- టిపిసిసి సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్

ఆమనగల్లు, (సింగిడి):
దేశంలో ఓట్ల తొలగింపు ప్రక్రియ దుర్మార్గంగా సాగుతోందని, అర్హులైన కాంగ్రెస్ అనుకూల ఓట్లను తీసివేస్తున్నారని టీపీసీసీ సభ్యులు అయిళ్ళ శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. శుక్రవారం కడ్తాల్ మండలంలోని మైసిగండి ఎంఆర్జీ ఫంక్షన్ హాల్లో బీఎల్ఏలు, సూపర్వైజర్లు, ఇన్చార్జులు కాంగ్రెస్ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఓట్లను తొలగించకుండా కాపాడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు 65 వేల మందికి నోటీసులు రాగా, చాలా మంది పత్రాలు అందించి ఓట్లు కాపాడుకున్నారని, మిగతా వారు కూడా వెంటనే స్పందించేలా బీఎల్ఏలు సహకరించాలని పిలుపునిచ్చారు. ఇంకా నిర్లక్ష్యం చేస్తే పెద్ద సంఖ్య లో ఓట్లు పోతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో పకడ్బందీ గా ఓటు లు తొలగిస్తున్నారని కాంగ్రెస్ సానుకుల ఓట్లు తొలగించే ప్రయత్నం జరుగుతుందని గ్రామాలలో బిఎల్ఎ లు సూపర్వైజర్లు కాంగ్రెస్ నాయకులు అప్రమత్తంగా ఉండి ప్రతి ఒక్క అర్రుడైన ఓటును కాపాడాలని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం డీసీసీ ఉపాధ్యక్షులు గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ, డీసీసీ ప్రధాన కార్యదర్శి చేగురి వెంకటేష్, కడ్తాల్ మండల పార్టీ అధ్యక్షులు పోతుగంటి శంకర్, కడ్తాల్ మాజీ మండల పార్టీ అధ్యక్షులు సభావత్ విద్యా నాయక్, సురేందర్ రెడ్డి, జోహార్ లాల్ నాయక్, హీరా సింగ్ నాయక్, సత్యం గౌడ్, సుమన్, జగన్ నాయక్, సత్యనారాయణ, మహేష్, తులసి రామ్, రమేష్ గౌడ్, డాక్టర్ శ్రీను, సంతోష్, విక్రమ్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు



## వినాయకుడి లడ్డూ వేలంలో బోయిని శంకర్ యాదవ్

### -హుడా కాంప్లెక్స్‌లో భక్తిశ్రద్ధలతో లడ్డూ వేలం



**ఎల్బీ నగర్, (సింగిడి):**
రామ్మోహన్ టవర్స్ హుడా కాంప్లెక్స్ బిల్డింగ్ నంబర్ 37లో ఏర్పాటు చేసిన వినాయకుని లడ్డూ వేలం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేలంలో కాంగ్రెస్ పార్టీ సరూర్ నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోయిని శంకర్ యాదవ్ ఆప్షన్ ద్వారా లడ్డూను దక్కించుకున్నారు. రామ్మోహన్ టవర్స్ అధ్యక్షులు చంద్రశేఖర్, వైస్ ప్రెసిడెంట్ మహేష్, సెక్రటరీ భగవాన్, శ్యాంసుందర్ రెడ్డి, ట్రెజరర్ వెంకట్ గౌడ్, ఎన్. సతీష్, సురేష్, సాయిబాబు, మల్లారెడ్డి తదితరుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నిర్వాహకులు, భక్తులు శంకర్ యాదవ్‌కు అభినందనలు తెలిపారు.

## విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి

### -బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పండాల శివకుమార్ గౌడ్



**కాప్రా, (సింగిడి):**
విగ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలందరూ సంతోషాలతో ఉండాలని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పండాల శివ కుమార్ గౌడ్ అన్నారు. కుషాయిగూడ డివిజన్ శ్రీ లక్ష్మి నరసింహా స్వామి కాలనీ లోని గణపతి మండపం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో శివ కుమార్ గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ డు జ్ఞానం, విజ్ఞానం, వివేకం, విజయానికి ప్రతీక అని, ప్రతి ఒక్కరి జీవితంలో విజయాలు చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో కాలనీ ప్రెసిడెంట్ జె సుధాకర్, సెక్రటరీ అఖిల్, కమిటీ సభ్యులు రాజేష్, మాదేశ్, శివ కృష్ణ, దామోదర్, బిఆర్ఎస్ నాయకులు ప్రసాద్ రెడ్డి, శ్రీకాంత్ గిరిరాజు, తదితరులు పాల్గొన్నారు.

## చర్లపల్లి చెరువు నిమజ్జన ఏర్పాట్లపై సమీక్ష



**కాప్రా, (సింగిడి):**
కాప్రా చెరువులో నిమజ్జనానికి అనుమతి లేనందున, ఆరు అడుగుల లోపు వినాయక విగ్రహాల నిమజ్జనాన్ని చర్లపల్లి చెరువుకు తరలించాలని అధికారులు నిర్ణయించిన సందర్భంగా శుక్రవారం చర్లపల్లి చెరువులోని నిమజ్జన ఏర్పాట్లపై చర్లపల్లి మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ చర్లపల్లి పోలీస్ స్టేషన్ సీఐ సుధాకర్ తో సమీక్షా సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలు, ట్రాఫిక్, శాంతి భద్రతలు, క్రేన్లు, లైటింగ్, బారికేడ్ల ఏర్పాటుపై చర్చించి, నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

## పలు గణేష్ మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ కార్పొరేటర్ శ్రీదేవి యాదవ్



**కాప్రా, (సింగిడి):**
కుషాయిగూడ డివిజన్ పరిధిలోని హోల్ సేల్ కూరగాయల మార్కెట్ (కంట) వద్ద ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద, కుషాయిగూడ ఇండస్ట్రియల్ ఏరియాలోని కృష్ణ కాంప్లెక్స్, పలు ఏరియాలలో ఏర్పాటు చేసిన గణేష్ ని మండపాలను శుక్రవారం చర్లపల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండపాల వద్ద నిర్వాహకులు ఏర్పాటుచేసిన అన్న ప్రసాద వితరణలో పాల్గొన్నారు.

## ప్రజా ఉద్యమాలే అమరులకు నివాళులు


### -సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు




**అమరచింత, (సింగిడి):**
ప్రజా ఉద్యమాలే అమరులకు ఘన నివాళులు అని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కలపల్లి శ్రీనివాసరావు ఈ.టి.నరసింహులు అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సిపిఐ వనపర్తి జిల్లా కార్యదర్శి సతీమణి కామ్రేడ్ జ్యోతి చిత్రపటానికి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు, ఈ.టి.నరసింహ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు వర్గ సభ్యులు కలవేన శంకర్,ఎం.బాల నరసింహ, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె. నరసింహలు శుక్రవారం అమరచింత మండల కేంద్రంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు అనంతరం విజయరాములు కుటుంబాన్ని ప్రగాఢ సానుభూతిని తెలిపి ఓదార్చారు. అనంతరం ఈనెల 20వ న అమరచింతలో జరగనున్న జ్యోతి సంస్మరణ సభ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తక్కలపల్లి శ్రీనివాసరావు, ఈ.టి నరసింహులు మాట్లాడుతూ:-లి సొంత లాభం కొంతమానుకొని పొరుగువారికి తోడ్పడమనే సూక్తిని అనుసరించి కామ్రేడ్ కే.విజయరాములు చిన్నతనం నుండే ప్రజల పట్ల అమితమైన ప్రేమతో ప్రజా సమస్యలపై ఎర్రజెండా ఎత్తుకొని వీరోచిత పోరాటాలు నడిపారని అన్నారు.

# విశ్వకర్మ రుణాలకు మోక్షమెప్పుడు?

**-శిక్షణ పూర్తి.. యూనిట్లు మంజూరు..**
**-రుణాల కోసం ఎదురుచూపులు!**
**-లబ్ధిదారులతో కలిసి ఎస్‌బీఐ మేనేజర్‌కు బీజేపీ నాయకుడు గుండా ఉపేందర్ రెడ్డి వినతి**



**కూసుమంచి, (సింగిడి):**
పీఎం విశ్వకర్మ యోజన పథకం కింద అర్హత పొందిన లబ్ధిదారులకు రుణాల మంజూరులో జాప్యం జరుగుతోందని, సమస్యను పరిష్కరించి త్వరితగతిన రుణాలు అందించాలని బీజేపీ జిల్లా నాయకులు గుండా ఉపేందర్ రెడ్డి కోరారు. శనివారం కూసుమంచి మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ మేనేజర్‌ను లబ్ధిదారులతో కలిసి కలసి వినతిపత్రం అందజేశారు.

**యూనిట్లు వచ్చాయి.. రుణాలు మాత్రం పెండింగ్!**
పీఎం విశ్వకర్మ యోజన కింద లబ్ధిదారులు ఉచిత శిక్షణ పూర్తి చేసుకున్నారని, యూనిట్లు మంజూరైనప్పటికీ బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు కావడం లేదని గుండా ఉపేందర్ రెడ్డి తెలిపారు. రుణాల కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని బ్యాంకు అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

**చేతివృత్తిదారులకు ఆర్థిక చేయూత**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీఎం విశ్వకర్మ యోజన ద్వారా చేతివృత్తిదారులు, సాంప్రదాయ కళాకారులకు ఉచిత శిక్షణతో పాటు రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. పథకం కింద ఎలాంటి పూచీకత్తు లేకుండా మొత్తం రూ.3 లక్షల వరకు రుణం పొందే అవకాశం ఉందన్నారు. మొదటి విడతగా రూ.1 లక్ష, వ్యాపార విస్తరణ కోసం రెండో విడతగా రూ.2 లక్షల వరకు రుణం అందిస్తారని, రుణంపై 5 శాతం వడ్డీ ఉంటుందని వివరించారు.పథకం లక్ష్యం మేరకు లబ్ధిదారులకు రుణాలు సకాలంలో అందితే వారు తమ సంప్రదాయ వృత్తులను అభివృద్ధి చేసుకుని స్వయం ఉపాధి పొందేందుకు మరింత అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.వినతిపత్రం అందజేసిన వారిలో ఆళ్లగడప నాగభూషణం, ఆళ్లగడప సాగర్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఏకదంతుని ఆశీస్సులు అందరిపై ఉండాలి

### బ్రహ్మశ్రీ పసర్లపాటి శ్రీనివాస బంగారయ్య



**ఎల్బీ నగర్, (సింగిడి):**
ఆర్ కెపురం డివిజన్ పరిధిలోని వాసవి కాలనీ నివాసుల సంక్షేమ సంఘము వారి ఆధ్వర్యంలో మహా గణపతి 39వ నవరాత్రి మహోత్సవాలలో భాగంగా నాలుగు వ రోజు నిర్వహించిన పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా విచ్చేసిన శ్రీ భారతీ తీర్థ పురస్కార గ్రహీత, ఆధ్యాత్మిక శాస్త్రవేత్త, శంకర తత్వార్థ రత్నాకర, ధర్మారక్ష దురీణ, సనాతన ధర్మోద్ధారక, ఆర్ష విద్యా తపస్వి, అర్థ విజ్ఞాన భాస్కర, తత్వ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బ్రహ్మశ్రీ పసర్లపాటి శ్రీనివాస బంగారయ్య శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి వారికి బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గౌరీశెట్టి చంద్రశేఖర్ గుప్త, కాలనీ ప్రధాన కార్యదర్శి అయిత అంజయ్య, ట్రీసురర్ కృష్ణయ్య , ఉత్సవ కమిటీ కన్వీనర్ వెంపటి కృష్ణమోహన్, చిలుక ఉపేందర్ రెడ్డి, గౌరిశెట్టి అరుణ్ కుమార్, వనమా సుదర్శన్, గ్రంథి రమేష్, మాలే అనిల్, తమన్నా శ్రీధర్, గ్రాంది. శ్రీకాంత్, దండు రాజు, గౌరీ శంకర్, రాంకిషన్, సత్యనారాయణ, మాలే శ్రీనివాస్, కృష్ణ మూర్తి, రామ స్వామి, మేఘమాల, భ్రమరాంబ, రాధా పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో సాగిన బార్ల అసోసియేషన్ గణేశుని నిమజ్జనం






**ఆమనగల్లు, (సింగిడి):**
ఆమనగల్లు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు పూజలందుకున్న వినాయక విగ్రహాన్ని శుక్రవారం సాయంత్రం ఘనంగా సురసముద్రం చెరువులో నిమజ్జనం చేశారు. ఈ వేడుకల్లో ఆమనగల్లు సీనియర్ సివిల్ జడ్జ్ నారం అరుణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లడ్డు వేలం పాట నిర్వహించగా, బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండేకార్ యాదిలాల్ రూ.16,316లకు పెద్ద లడ్డును దక్కించుకోగా, మరో చిన్న లడ్డును న్యాయవాది ప్రభు నాయక్ రూ.4,116లకు దక్కించుకున్నారు..విజయవంతంగా ముగిసిన ఈ వేడుకల్లో న్యాయవాదులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిభావాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండేకర్ యాదిలాల్ సీనియర్ న్యాయవాదులు లక్ష్మణ శర్మ, మల్లేపల్లి జగన్, మల్లేష్ గౌడ్, సుధాకర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, దుద్దు ఆంజనేయులు,ఆమనగల్లు జూనియర్ కోర్టు సూపరింటెండెంట్ మురళీకృష్ణ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్తీక్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు శేఖర్, సంయుక్త కార్యదర్శి మధు గౌడ్, ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ గౌడ్, కోశాధికారి మల్లేష్. గ్రంథాలయ సెక్రటరీ గణేష్ గౌడ్. క్రీడా కార్యదర్శి సంతోష్ కుమార్ , కార్యవర్గ సభ్యులు దేవేందర్ గౌడ్, సర్దార్ నాయక్, సీనియర్ న్యాయవాదులు జగన్ గౌడ్, రామకృష్ణ, కొప్పు కృష్ణ, మల్లేష్, ఆంజనేయులు,బీక్య నాయక్, శిరీష్, రమేష్, శివ,శ్రీనివాస్, ప్రభు నాయక్, శ్రీశైలం, రామ చంద్రయ్య, లక్ష్మణ్, శివశంకర్, మహేశ్వర్, అజయ్ కుమార్, నరేందర్, శిరీష, శైలజ, తదితరులు ఉన్నారు.

## బీరం లక్ష్మారెడ్డి మృతదేహానికి మాజీ మంత్రుల నివాళి

### -అంతిమయాత్రలో పాల్గొన్న మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, నిరంజన్ రెడ్డి



**జడ్చర్ల, (సింగిడి):**
కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి తండ్రి బీరం లక్ష్మారెడ్డి మృతదేహానికి మాజీ మంత్రులు డా. సి. లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, నిరంజన్ రెడ్డి తదితరులు నివాళులర్పించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు కూడా సింగోటంలో నిర్వహించిన అంతిమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డా. సి. లక్ష్మారెడ్డి బీరం లక్ష్మారెడ్డి మృతదేహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం బీరం హర్షవర్ధన్ రెడ్డిని పరామర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తీవ్ర విషాదంలో ఉన్న కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని భగవంతుడిని ప్రార్థించారు. బీరం లక్ష్మారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధువులను పలువురు పరామర్శించి తమ సానుభూతిని వ్యక్తం చేశారు.

## బొజ్జ గణపయ్యను దర్శించుకున్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి. మాధవ్



**అల్వాల్, (సింగిడి):**
వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని టెంపుల్ అల్వాల్ హరిదాసు మండపంలో శ్రీ బాలాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొలవదీరిన బొజ్జ గణపయ్యను బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరంకుశ మాధవ్ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు దర్శించుకున్నారు. ఉత్సవాల నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో భక్తిశ్రద్ధలతో పాల్గొని గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి. స్వామి వారదివ్య దర్శనం చేసుకున్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ ప్రముఖ వ్యాపారవేత పెద్ది రమేష్, పెద్దిరాణి వారి కుటుంబ సభ్యులు అన్న ప్రసాద వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పి కృష్ణమాచార్యులు, పురుషోత్తం, రమేష్, నీలం శ్రీనివాస్, కర్ణంరవి, రామ్ సింగ్, వజ్రం నాగరాజ్, చంద్రమోహన్, తలారి లావణ్య, సంతోష్, మేజర్, లు పాల్గొన్నారు

## సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్‌పై వినాయక నిమజ్జన సందడి



**ఎల్బీ నగర్, (సింగిడి):**
సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్‌పై వినాయక నిమజ్జన కార్యక్రమం సందడిగా కొనసాగింది. భక్తులు భక్తిశ్రద్ధలతో గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాహుల్ కిషోర్ యాదవ్, ప్రమోద్ ముదిరాజ్, పెద్ది యాదవ్, పునీత్ కిషోర్ యాదవ్ తదితర యువకులు వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. జైజై గణేశా నినాదాలతో మినీ ట్యాంక్‌బండ్ పరిసరాలు మార్మోగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి వీడ్కోలు పలికారు.

## మాజీ కార్పొరేటర్ శ్రీదేవి యాదవ్‌కి వేములవాడ రాజన్న ప్రసాదాన్ని అందజేసిన ఓదెల నరేష్



**కాప్రా, (సింగిడి):**
కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్షకుర్తి గ్రామానికి చెందిన ఒక నిరుపేద మధ్య తరగతి కుటుంబానికి చెందిన వికలాంగుడు ఓదెల నరేష్ శుక్రవారం చర్లపల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్‌ని హైదరాబాద్ బంజారాహిల్స్ లోని తమ నివాసంలో మర్యాదపూర్వ కంగా కలిసి వేములవాడ రాజన్న వస్త్రంతో సన్మానించి, లడ్డు ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులే మిన్న అనే బొంతు శ్రీదేవి మంచి మనసని, ఆమె కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండా లని వేములవాడ రాజన్న ఆశీర్వాదంతో రానున్న కాలంలో మంచి పదవులు అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.

## గణనాథుని ఆశీస్సులతో సుఖసంతోషాలు వెల్లివిరియాలి

### - అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సై నరేష్



**హుజూర్‌నగర్, (సింగిడి):**
హుజూర్‌నగర్ పట్టణంలోని 19వ వార్డు శ్రీనగర్ కాలనీలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వినాయక మండపంలో ప్రత్యేక పూజా కార్యక్రమంతో పాటు భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదాన కార్యక్రమానికి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. 23వ వార్డు కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అట్లూరి హరిబాబు--మంజుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్, హుజూర్‌నగర్ పట్టణ ఎస్సై నరేష్ హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణనాథుని అనుగ్రహంతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి సంవత్సరం కులమతాలకు అతీతంగా గణేష్ ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఏ శుభకార్యం ప్రారంభించినా, ఏ నూతన పనికి శ్రీకారం చుట్టినా తొలిపూజ అందుకునే ఆదిదేవుడు విఘ్నేశ్వరుడని పేర్కొన్నారు. జీవితంలో ఎదురయ్యే అడ్డంకులను తొలగించి విజయతీరాలకు చేర్చే శక్తి గణనాథునికి ఉందని, బుద్ధి, సిద్ధికి అధిపతిగా కొలిచే లంబోదరుని అనుగ్రహం ఉంటే ఎంతటి కష్టమైనా తొలగిపోతుందనే నమ్మకం భక్తుల్లో బలంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అట్లూరి హరిబాబు, 19వ వార్డు ఇన్‌చార్జి ఎం.డి. అజీజ్ పాషా, వార్డు కౌన్సిలర్లు దొంతి రెడ్డి పద్మ, కోల ఉదయభాను, జక్కుల మల్లయ్య, సులువ నాగలక్ష్మి చంద్రశేఖర్, అమరబోయిన ఊహ సతీష్, ఎస్.కె. మన్సూర్ అలీ, చిట్యాల అమర్నాథ్ రెడ్డి, ఎం.ఏ. మజీద్, ఎస్.కె. బిక్కన్ సాబ్, ములకలపల్లి సీతయ్య, చిట్టిపోలు రమేష్, దగ్గుపాటి బాబురావు, లింగయ్య, మోహన్రావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే విగ్రహ కమిటీ నిర్వాహకులు భానోత్ రంగా, సాయి, నాగ ప్రవీణ్, పొన్నాల రాము, ఎస్.కె. నాగుల్ మీరా, శిరీష, నాగమణి, లక్ష్మీబాయి, యూసుఫ్, రఫీ, ఉదారి శ్రీనివాస్, వల్లపు దాస్ నారాయణ, కోటయ్య, గౌడుగు సాయి పాల్గొని జయప్రదం చేశారు.

ప్రభాతవ సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
ఆదివారం
20-9-2026

## ఎల్‌నినో ప్రభావంపై మండల పరిషత్ సమీక్షలో చర్చ

**-ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలి**



**శ్రీరంగాపూర్, (సింగిడి):**
మండల పరిషత్ సమీక్ష సమావేశం స్పెషల్ ఆఫీసర్ సుధారాణి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో మండలంలోని వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు పాల్గొని మండల అభివృద్ధి పనులపై సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా తాగునీరు, విద్యుత్ సరఫరా, రోడ్లు, ఇందిరమ్మ ఇళ్లు, విద్య, వైద్యం, పశుసంపద తదితర అంశాలతో పాటు వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంపై కూడా చర్చించారు. స్పెషల్ ఆఫీసర్ సుధారాణి మాట్లాడుతూ మండలంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వర్షాలు, వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వాతావరణ మార్పులు, వాటి ప్రభావాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండలంలో 13 అంగన్‌వాడీ కేంద్రాలు మంజూరైనట్లు తెలిపారు. ఇందులో నాగరాల గ్రామానికి రెండు, శ్రీరంగాపూర్‌కు రెండు కేంద్రాలు ఉన్నట్లు వివరించారు. ఎంపీడీవో చెన్నయ్య మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, పెండింగ్ పనుల వివరాలను సమీక్షించారు. శాఖల వారీగా పనులను వేగవంతం చేసి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. ఎస్సై హిమబిందు మాట్లాడుతూ గణేష్ నిమజ్జనం సందర్భంగా పోలీసుల అనుమతి లేకుండా డీజేలు నిర్వహించవద్దని స్పష్టం చేశారు. నిబంధనలు పాటిస్తూ గణేష్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించాలని సూచించారు. ఏపీఎం చంద్రకళ మహిళా సంఘాల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై వివరాలు వెల్లడించారు. మహిళా సంఘాలకు రూ. 52 లక్షల వరకు రుణం అందినట్లు తెలిపారు. గొర్రెల పెంపకానికి సంబంధించి షేరుపల్లి గ్రామానికి రూ. 2 లక్షలు, కంబాలాపూర్ గ్రామానికి రూ. 2 లక్షల వరకు రుణ సదుపాయం ఉన్నట్లు వివరించారు. కోళ్ల పెంపకానికి ఎనిమిది గ్రామాల్లో అర్హులైన వారికి ఒక్కొక్కరికి రూ. 2 వేల చొప్పున అందించినట్లు తెలిపారు. అలాగే ఆర్టీసీకి రూ. 6 లక్షలు అప్పుగా ఇచ్చినట్లు వెల్లడించారు. జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి హనుమంతు మాట్లాడుతూ పాఠశాలలో వంటగది విస్తీర్ణం, మూత్రశాల తదితర సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. శ్రీరంగాపూర్ గ్రామ సర్పంచ్ మద్దిలేటి మాట్లాడుతూ శ్రీ-రంగాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో వాచ్‌మెన్, స్వీపర్ సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఆసుపత్రికి అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. కంబాలాపూర్ సర్పంచ్ విజయ్ మాట్లాడుతూ గ్రామంలో మిషన్ భగీరథ తాగునీటి సరఫరా పరిస్థితిని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అలాగే గ్రామంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరారు. జగన్నాథం నాయుడు మాట్లాడుతూ మండల అభివృద్ధికి సంబంధించిన పనులను అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలిసికట్టుగా చేపట్టి ముందుకు సాగాలని సూచించారు. సమావేశంలో పశుసంపద అభివృద్ధిపై కూడా సంబంధిత అధికారులతో చర్చించారు. పశువుల పెంపకం, రైతులకు అందుతున్న ప్రభుత్వ పథకాలు, అవసరమైన సహాయంపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు నేరుగా ఉపయోగపడే తాగునీరు, విద్యుత్, రోడ్లు, వైద్యం, విద్య తదితర మౌలిక సదుపాయాల విషయంలో శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో సూచించారు. ఈ సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ సుధారాణి, ఎస్సై హిమబిందు, ఎంపీడీవో చెన్నయ్య, ఎమ్మార్వో వరలక్ష్మి, పెబ్బేరు సింగిల్ విండో చైర్మన్ కోదండరామిరెడ్డి, శ్రీరంగాపూర్ సింగిల్ విండో చైర్మన్ జగన్నాథం నాయుడు, పెబ్బేరు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రమోదిని రెడ్డి, వైస్ చైర్మన్ విజయ్ వర్ధన్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**-తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్**



**గద్వాల ప్రతినిధి (సింగిడి):**
ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ జిల్లా కోఆర్డినేటర్ జి నర్సింలు పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషనర్ బక్కి వెంకటయ్యకు పలు డిమాండ్లతో కూడిన మెమోరాండాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో సమర్పించారు. ఎస్సీ, ఎస్టీ బాధితులకు అందాల్సిన ఆర్థిక సహాయాన్ని త్వరగా అందించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను సమర్థవంతంగా అమలు చేసి, నిధులను నిబంధనల ప్రకారం వినియోగించాలని, ఉద్యోగుల పదోన్నతుల్లో రోస్టర్ పాయింట్ విధానాన్ని అమలు చేయాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆయనతో తెలిపారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతతో పాటు రిజర్వేషన్ విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. రేపల్లె బాధ్యతలకు వెంటనే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి. రేవులపల్లి ఘటనలో బాధిత దళిత కుటుంబాలకు వెంటనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఎస్సీ ఎస్టీ కమిషన్కు విజ్ఞప్తి చేశారు. బాధిత కుటుంబాలను అధికారులు సందర్శించి వారికి భరోసా కల్పించాలని కోరారు.
కార్యక్రమంలో ఎం. వినోద, టి. పద్మతో పాటు బాధిత కుటుంబాలకు చెందిన 16 మంది పాల్గొన్నారు.

## గిరిజనుల అభివృద్ధికి బీఆర్‌ఎస్ హయాంలోనే ప్రాధాన్యం



**గద్వాల ప్రతినిధి(సింగిడి):**
గిరిజనుల అభివృద్ధికి మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చిందని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకులు, జోగులాంబ గద్వాల జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య అన్నారు. ఐజ మండల కేంద్రంలో శుక్రవారం పాత బస్టాండ్‌లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో గిరిజన రిజర్వేషన్లు 6 నుంచి 10 శాతానికి పెంచి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని పల్లయ్య పేర్కొన్నారు. గిరిజనులకు విద్య, రహదారులు, పంచాయతీ భవనాలు, సంక్షేమ పథకాల ద్వారా గత ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. గిరిజన విద్యార్థుల కోసం గురుకులాలను ఏర్పాటు చేసి విద్యకు ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు.

# ఎఫ్‌ఎల్‌ఎన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి విద్యార్థుల చదువును మెరుగుపరచాలి

## కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్




**గద్వాల బ్యూరో (సింగిడి):**
ప్రభుత్వ పాఠశాలల్లో ఎఫ్‌ఎల్‌ఎన్‌ను పటిష్టంగా అమలు చేసి, విద్యార్థుల అభ్యసన స్థాయిని మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. శుక్రవారం ఎర్రవల్లి మండల కేంద్రంలోని 10వ బెటాలియన్‌లోని విద్యా బోధన, ప్రాథమిక అక్షరాస్యత మరియు సంఖ్యా నైపుణ్యాలు సాధికార పాఠశాలపై విద్యాశాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక అక్షరాస్యత మరియు సంఖ్యా నైపుణ్యాలు (ఎఫ్‌ఎల్‌ఎన్)ను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థి చదవడం, రాయడం, సంఖ్యా నైపుణ్యాల్లో ఆశించిన అభ్యసన సామర్థ్యాలను సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. జిల్లాలో ఎఫ్‌ఎల్‌ఎన్‌కు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి, విద్యార్థుల అభ్యసన శాతాన్ని పెంచాలన్నారు. విద్యార్థుల 100 శాతం హాజరును ఉండేలా చూడాలన్నారు. ఎఫ్‌ఎల్‌ఎన్ ట్రాకింగ్ రిజిస్టర్‌ను సబ్జెక్టు వారీగా తప్పనిసరిగా నిర్వహిస్తూ, ప్రతి విద్యార్థి అభ్యసన స్థాయిని నమోదు చేయాలన్నారు. ఎఫ్‌ఎల్‌ఎన్ బేస్‌లైన్ రిపోర్ట్ ఆధారంగా విద్యార్థుల అభ్యసన లోపాలను గుర్తించి, తగిన బోధనా వ్యూహాలతో అదనపు బోధన అందిస్తూ వారి నైపుణ్యాలను మెరుగుపరచాలన్నారు. ప్రతి బుధవారం ప్రధానోపాధ్యాయులు సమావేశం నిర్వహించి, విద్యార్థుల అభ్యసన పురోగతిని సమీక్షించి, మెరుగుదలకు చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థుల అభ్యసనాన్ని మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు సృజనాత్మకమైన, వినూత్న బోధనా పద్ధతులను అనుసరించాలన్నారు. ప్యానెల్ తనిఖీ బృందాలు షెడ్యూల్ ప్రకారం పాఠశాలలను సందర్శించి, విద్యా ప్రమాణాలు, ఎఫ్‌ఎల్‌ఎన్ అమలు, మౌలిక వసతులను సమగ్రంగా పరిశీలించాలన్నారు. పాఠశాలలోని సానుకూల అంశాలు, లోపాలను స్పష్టంగా నమోదు చేసి నివేదిక సమర్పించాలన్నారు. ఈ నివేదికల ఆధారంగా లోపాలను పరిష్కరించి, పాఠశాలల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఎఫ్‌ఎల్‌ఎన్ సెల్ సభ్యులు ఉత్తమ బోధనా పద్ధతులను గుర్తించి డాక్యుమెంటేషన్ చేయాలన్నారు. ప్యానెల్ తనిఖీ బృందాల పనితీరు, పాఠశాలల పరిస్థితిపై నివేదికలు సేకరించి, వాటి ఆధారంగా ఎఫ్‌ఎల్ యెన్ ను మరింత మెరుగుపరచాలన్నారు. ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు విద్యార్థులు, ఉపాధ్యాయులందరికీ 100 శాతం ఉండాలన్నారు. ఉపాధ్యాయులు పాఠశాలకు హాజరు వేసి అనంతరం ఇతర పనుల నిమిత్తం బయటకు వెళుతున్నట్లు నివేదికలు అందుతున్నాయని తెలిపారు. దీనిపై సమీక్ష అనంతరం కొద్ది రోజుల్లోనే సంబంధిత ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
ఎంఈఓలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ప్రతి నెల 15వ తేదీలోపు పాఠశాలలను తప్పనిసరిగా సందర్శించి, పాఠశాలలో విద్యా బోధన, మౌలిక వసతులు, ఎఫ్‌ఎల్‌ఎన్ అమలును పరిశీలించాలన్నారు. టాయిలెట్ సౌకర్యం లేని పాఠశాలల వివరాలతో నివేదికను సిద్ధం చేసి సమర్పించాలని ఎంఈఓలను ఆదేశించారు. ఆధార్, అపార్, ఎస్‌హెచ్‌వీఆర్, ప్రశస్త నమోదులో పురోగతిని మరింత మెరుగుపరచాలన్నారు. ఏక్ పేడ్ మా కీ నామ్, జాతీయ విద్యార్థుల పర్యావరణ పోటీ నషా ముక్త్ విద్యాలయ, డ్రగ్ ఫ్రీ కార్యక్రమం పాఠశాలలో పక్కాగా అమలు చేయాలన్నారు. జిల్లాలో విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసి, విద్యార్థులకు నాణ్యమైన, మెరుగైన విద్య అందించేలా ఉపాధ్యాయులు బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైని డిప్యూటీ కలెక్టర్లు రాజ్ కుమార్, మనోజ్ కుమార్ రెడ్డి, డీఈఓ విజయ లక్ష్మి, మండల విద్యా శాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల అభివృద్ధికి బీఆర్‌ఎస్ హయాంలోనే ప్రాధాన్యం



**గద్వాల ప్రతినిది(సింగిడి):**
గిరిజనుల అభివృద్ధికి మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చిందని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకులు, జోగులాంబ గద్వాల జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య అన్నారు. ఐజ మండల కేంద్రంలో శుక్రవారం పాత బస్టాండ్‌లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో గిరిజన రిజర్వేషన్లు 6 నుంచి 10 శాతానికి పెంచి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని పల్లయ్య పేర్కొన్నారు. గిరిజనులకు విద్య, రహదారులు, పంచాయతీ భవనాలు, సంక్షేమ పథకాల ద్వారా గత ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. గిరిజన విద్యార్థుల కోసం గురుకులాలను ఏర్పాటు చేసి విద్యకు ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. అదేవిధంగా ఎస్టీ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్‌కు చట్టబద్ధత కల్పించిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన విద్యార్థులు, ఇళ్లు లేని పేదలు, గిరిజన కార్పొరేషన్లకు సంబంధించిన హామీలను నెరవేర్చాలని కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గిరిజన తండాలు గ్రామ పంచాయతీలుగా మారడంతో స్థానికంగా ప్రజాప్రతినిధులుగా ఎదిగే అవకాశం లభించిందన్నారు. గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం, సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ నిరంతరం పోరాడుతుందని పల్లయ్య తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, కౌన్సిలర్లు ఎరుకల శివ, తిరుమలేష్, కోఆప్షన్ సభ్యుడు మౌలా తదితరులు పాల్గొన్నారు. ఎరుకల, గిరిజన నాయకులు మాల నాగరాజు, నరసింహులు, పరుశరామ్, భీమన్న, జయన్న, అరుణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## భ్రమరాంబిక అమ్మవారికి మూడు తులాల బంగారు నెక్లెస్ సమర్పణ

**రెయిన్బో మెడోస్ బీరంగూడకు చెందిన**
**వి. శ్రీధర్ కుమార్ కుటుంబ సభ్యుల భక్తి కానుక**



**అమీన్ పూర్తి, (సింగిడి):**
పటాన్‌చెరు నియోజకవర్గం బీరంగూడ గుట్ట శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో కొలువైన శ్రీ భ్రమరాంబిక అమ్మవారికి భక్తులు మూడు తులాల బంగారు నెక్లెస్‌ను కానుకగా సమర్పించారు. రెయిన్బో మెడోస్, బీరంగూడకు చెందిన వి. శ్రీధర్ కుమార్ కుటుంబ సభ్యులు భక్తిశ్రద్ధలతో ఈ బంగారు నెక్లెస్‌ను అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్, ఆలయ అధికారుల సమక్షంలో శ్రీధర్ కుమార్ కుటుంబ సభ్యులు మూడు తులాల బంగారు నెక్లెస్‌ను ఆలయ ప్రధాన అర్చకులు ప్రహ్లాద్‌కు అందజేశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నెక్లెస్‌ను అమ్మవారి అలంకరణ కోసం ఆలయానికి అందించారు. భక్తుల విశ్వాసం, ఆధ్యాత్మిక భావనలకు ప్రతీకగా ఇలాంటి కానుకలు నిలుస్తాయని ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్ తెలిపారు. ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాల కోసం భక్తుల సహకారం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువపై తాగునీటి కోసం రైతుల మెరుపు ధర్నా

**-రెండు వైపులా ట్రాఫిక్ జామ్**
**యాణికులు ఇబ్బందులు**
**ఆందోళనకారులతో పలుమార్లు**
**-చర్చించిన ఎస్సై స్వాతి**



**అమరచింత,(సింగిడి):**
జూరాల ప్రధాన ఎడమ కాలువ నుండి సాగునీటి విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం అమరచింత మండలంలోని జూరాల ప్రాజెక్టుపై రేచింతల, ఆరేపల్లి, మొట్లంపల్లి గ్రామాల రైతులు జూరాల ప్రాజెక్టుపై రైతులు మెరుపు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రైతులు మాట్లాడుతూ, జూరాల ప్రాజెక్టులో నీటి నిల్వ ఉన్న అధికారులు కాలువలకు సాగునీరు వదలకపోవడంతో వేసుకున్న వరితోపాటు ఆరుతడి పంటలు పూర్తిగా వెండి పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వారబంధి పెట్టిన కాల్వలకు నీరు వదలడం లేదని రైతులు అన్నారు. జూరాల ప్రాజెక్టుకు పై నుండి వరదలు వచ్చినప్పుడు కాంగ్రెస్ పార్టీ, బి ఆర్ ఎస్ పార్టీల నాయకులు పోటాపోటీగా షట్టర్లు ఓపెన్ చేసి నీళ్లు వదిలారని ఇప్పుడు పంటలు ఎండిపోతున్న సాగునీరు విడుదల చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చేస్తానని చెప్పిన అధికారులు కాల్వలకు నీరు వదలడం లేదని వారు అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి పంటలు ఎండిపోకుండా రైతులకు సాగునీరు విడుదల చేసి ఆదుకోవాలని లేనిచో రైతులకు ఆత్మహత్యలే శరణ్యమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రైతులు ధర్నా దగ్గరకు పురుగుమందుల డబ్బాలతో వచ్చిన రైతుల దగ్గర అమరచింత ఎస్సై స్వాతి రైతులతో పలుమార్లు చర్చించి రైతులను శాంతింప చేశారు. అలాగే జూరాల ప్రాజెక్టు పై రైతులు మూడు గంటలు రాస్తారోకో చేయడంతో మక్తల్, ఆత్మకూర్, అమరచింత వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రైతులు రాస్తారోక వల్ల ప్రాజెక్టుపై భారీ ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు భారీగా పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో

### గణనాథునికి ప్రత్యేక పూజలు చేసిన భక్తులు



**కల్వకుర్తి (సింగిడి):**
కల్వకుర్తి మండలంలోని మార్చాల గ్రామంలో వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ప్రగతి యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథునికి కాలనీవాసులు అవ గణేష్ కుటుంబ సభ్యులు గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఉదయం నుంచే గణనాథుని మండపం వద్దకు చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం గణనాథునికి నైవేద్యం సమర్పించి, భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గణనాథుని ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు కోరుకున్నారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ప్రగతి యువజన సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ, కాలనీవాసులను పూజా కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, యువకులు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## గద్వాల గడ్డపై బీసీ సింహ గర్జన




**గద్వాల ప్రతినిధి (సింగిడి):**
బీసీల హక్కులు, ఆత్మగౌరవం, సముచిత రాజకీయ ప్రాతినిధ్యం కోసం గద్వాల గడ్డపై నిర్వహించిన బీసీ సింహ గర్జన కార్యక్రమం విజయవంతమైంది. టీపీసీసీ పిలుపు మేరకు గద్వాల డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి. హన్మంతరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీసీల హక్కుల సాధన కోసం ప్రజాస్వామ్య, రాజ్యాంగబద్ధ మార్గంలో ఉద్యమాన్ని మరింత విస్తృతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 100 రోజుల పాటు సభలు, సమావేశాలు నిర్వహించి బీసీలను చైతన్యపరిచే కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. అనంతరం ఢిల్లీలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించేలా కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. బీసీలకు జనాభా నిష్పత్తికి అనుగుణంగా అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం, విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని నాయకులు కోరారు. 42 శాతం రిజర్వేషన్ల డిమాండ్‌తో పాటు బీసీల హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి మాట్లాడుతూ బీసీ యువతకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు మహిళలకు ఆర్థిక సాధికారత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ వృత్తులకు ప్రోత్సాహం, జనాభా నిష్పత్తికి అనుగుణంగా రాజకీయ ప్రాతినిధ్యం కోసం ఐక్యత అవసరమని పేర్కొన్నారు. అనంతరం పాత బస్టాండ్ నుంచి కృష్ణవేణి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి పూలే, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్‌కు ఓబీసీ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

# ఉత్తమ్ సార్ శివగంగా లిఫ్ట్ ఎప్పుడు నడుస్తుంది?

**-రైతుల పొలాలకు నీరెప్పుడు వస్తుంది?**
**-వారం రోజుల్లో పరిష్కరించకపోతే 2 వేల మంది రైతులతో మహా ధర్నా**
**-శివగంగా లిఫ్ట్ వద్ద రైతులతో కలిసి బీఆర్‌ఎస్ నాయకుడు పిల్లుట్ల రఘు ధర్నా**



**హుజుర్నగర్ (సింగిడి):** సాగునీటి కోసం రైతులు అల్లాడుతుంటే ప్రభుత్వం ఏం చేస్తోంది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నియోజకవర్గంలోనే శివగంగా లిఫ్ట్ ఎందుకు నిర్లక్ష్యానికి గురవుతోంది. రైతుల కన్నీళ్లు ప్రభుత్వానికి కనిపించడం లేదా అంటూ బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు పిల్లుట్ల రఘు ప్రభుత్వాన్ని నిలదీశారు. చింతల పాలెం మండలం వెల్లటూరు కాలనీలోని శివగంగా లిఫ్ట్ వద్ద రైతులతో కలిసి పిల్లుట్ల రఘు లిఫ్ట్ పరిస్థితిని పరిశీలించారు. లిఫ్ట్ పనిచేయక రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులతో కలిసి అక్కడే ధర్నా నిర్వహించి, శివగంగా లిఫ్ట్ సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పిల్లుట్ల రఘు మాట్లాడుతూ.. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సొంత నియోజకవర్గంలోనే రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతుంటే శివగంగా లిఫ్ట్ సమస్యను ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. రైతుల పొలాలకు సాగునీరు అందించా ల్సిన లిఫ్ట్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారినా అధికారులు, ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. మూడు ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ.. రైతులకు మరో కష్టం శివగంగా లిఫ్ట్ వద్ద ఇటీవల మూడు ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురైన విషయాన్ని రైతులు పిల్లుట్ల రఘు దృష్టికి తీసుకువచ్చారు. దీంతో రైతులు సాగునీటి కోసం మరింత ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి లిఫ్ట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని రఘు ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా లిఫ్ట్ వద్ద ఏర్పాటు చేసే ట్రాన్స్‌ఫార్మర్లకు భద్రత కల్పించేందుకు సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో పరికరాలు చోరీకి గురికాకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. వారం రోజులు గడువు.. లేకుంటే 2 వేల మంది రైతులతో మహా ధర్నా వారం రోజుల్లోగా శివగంగా లిఫ్ట్ సమస్యను పరిష్కరించి రైతులకు సాగునీరు అందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని పిల్లుట్ల రఘు హెచ్చరించారు. మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆధ్వర్యంలో అన్ని మండలాల నుంచి సుమారు 2,000 మంది రైతులను సమీకరించి భారీ ధర్నా నిర్వహించి ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు. రైతుల పొలాలకు నీరు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని, రైతుల సాగునీటి సమస్యల పరిష్కారం కోసం బీఆర్‌ఎస్ పార్టీ రైతుల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని పిల్లుట్ల రఘు తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతలపాలెం మండల సర్పంచులు, రైతులు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత తదితరులు పాల్గొన్నారు.

singidinews@gmail.com

సినిమా సింగిడి
Cinma Singidi

ఆదివారం
20-9-2026



# 'వెట్టువం' కోసం నా సర్వస్వాన్ని ధారపోశా..
## శోభిత ఆసక్తికర కామెంట్స్

అందాల భామ శోభిత ధూళిపాళ సెకండ్ ఇన్నింగ్స్‌లో ఫుల్ ఫామ్‌లో ఉన్నారు. వివాహం తర్వాత 'చీకటి'లో అనే క్రైమ్ థ్రిల్లర్‌తో ప్రశంసలు అందుకున్న ఆమె ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ పా. రంజిత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక పాన్ ఇండియా చిత్రం 'వెట్టువం'లో శోభిత హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రంలో ఆర్య, శోభిత ధూళిపాళతో పాటు దినేష్ ప్రధాన పాత్రలలో కనిపించనున్నారు. ఈ సినిమాకు జీవి ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు చాలా ఘనంగా జరిగాయి. షూటింగ్‌ను కూడా ప్రారంభించిన మేకర్స్, ఒక స్పెషల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇక ఈ ఈవెంట్‌లో పాల్గొన్న శోభిత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పా. రంజిత్ సినిమాల్లోని స్త్రీలు ఎప్పుడూ ఇతరుల రక్షణ కోసం ఎదురుచూడరని, తమ సొంత హృదయం చెప్పిన మార్గంలో స్వతం త్రంగా నడుస్తారని ప్రశంసించారు. 'వెట్టువం'లో తాను పోషిస్తున్న పాత్ర గురించి చెబుతూ.. ఈ సినిమాలో తన పాత్ర ఎన్నో పోరాటా లతో సాగుతుందని, పూర్తిగా తన సొంత నిర్ణయాల ద్వారానే ముందుకు వెళు _ందని తెలిపారు. తాను ఎంచుకునే పాత్రలకు భావోద్వేగాల పరంగా పూర్తిగా కనెక్ట్ అవుతాన ని, 'వెట్టువం'లో నటించేటప్పుడు తన సర్వస్వాన్ని ధార పోశానని శోభిత చెప్పారు. ఇలాంటి ప్రాజెక్ట్‌లో భాగం కావడమే ప్రతి నటి నిజమైన కల అని అన్నారు. సాధారణంగా సినిమాలలో ఫైటింగ్ సీన్లన్నీ హీరోలకే దక్కుతాయని, హీరోయిన్లకు మాత్రం కేవలం ఎమోషనల్ సీన్లు మాత్రమే వస్తుంటాయని తెలిపారు.

# కోలీవుడ్ ఇండస్ట్రీకి కేతిక శర్మ..



టాలీవుడ్‌లో వరుస చిత్రాలతో ప్రేక్షకులను పలకరించిన ప్పటికీ, ఆశించిన స్థాయిలో సక్సెస్ అందుకోలేక పోయిన అందాల భామ కేతిక శర్మ. 'రొమాంటిక్' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన ఈ అమ్మడు.. ఆ తర్వాత 'లక్ష్య', 'రంగరంగ వైభవంగా', 'బ్రో' వంటి పలు సినిమా ల్లో నటించి గ్లామర్‌తో మెప్పించారు. అయితే బాక్సాఫీస్ వద్ద మాత్రం ఆమెకు సరైన హిట్ దక్కలేదు. దీంతో టాలీవుడ్‌లో కొద్దిగా విరామం తీసు కున్న ఈ సుందరి, ఇప్పుడు తన అదృష్టాన్ని కోలీవుడ్‌లో పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. 'మీస య్య మురుక్కు-2' సినిమాతో ప్రేక్షకుల ను అలరించబోతు న్నారు. టాలెంటెడ్ ఆర్టిస్ట్ ఆది నటిస్తూ స్వయంగా డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రంలో కేతిక కీలక పాత్రలో కనిపించ బోతున్నారు. గతంలో వచ్చిన బ్లాక్ బస్టర్ హిట్ సినిమాకు ఇది సీక్వెల్‌గా వస్తుండ టంతో ఈ ప్రాజెక్ట్‌పై కోలీవుడ్‌లో మంచి అంచనాలు ఉన్నాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం సెప్టెంబర్ 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో.. సినిమా ప్రమోషన్స్ జోరుగా సాగుతుండగా, కేతిక తాజాగా మీడియాతో ముచ్చటించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తమిళంలో తనకు ఇదే మొదటి సినిమా అని చెబుతూ కేతిక తన ఆనందాన్ని పంచుకున్నారు. తనకు తమిళం కొంతవరకు అర్థమైనా, మాట్లాడటం మాత్రం పూర్తిగా రాదని తెలిపారు. అయితే ఆ భాషపై పట్టు సాధించేందుకు తాను ఏకంగా నెల రోజుల పాటు ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం తాను తమిళ తరగతులకు హాజరవుతున్నానని, ఈ లెర్నింగ్ ప్రాసెస్ తనకు అద్భుతమైన అనుభవాన్ని ఇస్తోందని చెప్పారు. తమిళనాడు ప్రజల ఆదరణ గురించి మాట్లాడుతూ ఆమె ఎమోషనల్ అయ్యారు. అక్కడి ప్రజలంటే తనకు చాలా ఇష్టమని, తాను చెన్నైకి వెళ్లిన ప్రతీసారి అక్కడి ప్రేక్షకులు, కోలీవుడ్ నటీనటులు తనకు ఇచ్చిన స్వాగతం మరువలేనిదని తెలిపారు.



# దేవిలా కొలవడం.. గ్లామర్ పేరుతో వాడుకోవడం..

## బాలీవుడ్ సినిమాలపై రాధికా సెన్సేషనల్ కామెంట్స్

బాలీవుడ్ స్టార్ బ్యూటీ రాధికా ఆప్టే, శకున్ బాత్రా ఓ ఇంటర్వ్యూలో భాగంగా చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. బాలీవుడ్ చిత్రాలలో రొమాన్స్‌ను ప్రదర్శించే తీరుపై రాధికా ఆప్టే తన అభిప్రాయాలను పంచుకుంటూ.. తాను షారుఖ్ ఖాన్ సినిమాలకు వీరాభిమానినని చెబుతూనే.. చిన్నతనంలో తాను ఎంతో ఆస్వాదించిన ఆయన పాత చిత్రాలను ఇప్పుడు తిరిగి చూసినప్పుడు కొన్ని దృశ్యాలు తనను తీవ్రంగా దిగ్భ్రాంతికి గురిచేశాయని తెలిపారు. ఒకప్పుడు తెరపై ఎంతో శృంగారభరితంగా, గొప్ప ప్రేమగా చూపించిన అనేక సీన్లు నిజానికి ఎంత అభ్యంతరకరంగా ఉన్నాయో ఆమె వివరించారు. ముఖ్యంగా ఒక మహిళ వద్దు అని స్పష్టంగా చెప్పినప్పటికీ, ఆమె అభ్యంతరాన్ని పట్టించుకోకుండా బలవంతంగా వెంటపడటాన్ని ప్రేమగా చూపించడాన్ని ఆమె విమర్శించారు. టీనేజ్ వయసులో ఇలాంటి వాటినే గొప్ప కలలుగా కనేవాళ్లమని, కానీ ఇప్పుడు ఆలోచిస్తే అది ఎంత భయానకంగా అనిపిస్తుందోనని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇదే విషయమై దర్శకుడు శకున్ బాత్రా స్పందిస్తూ.. పాతకాలపు హిందీ సినిమాలలో మానసిక కోరికలను తెరకెక్కించిన విధానం గురించి ప్రస్తావించారు. ఆ కథలన్నీ కేవలం పురుషుల కోణం నుంచే నడిచాయని చెప్పారు. శకున్ అభిప్రాయంతో పూర్తి ఏకీభవించిన రాధికా ఆప్టే.. అప్పట్లో తెరపై మహిళలను చిత్రించిన విధానంలోనే అసలైన లోపం ఉందని అన్నారు. ఒకవైపు మహిళలను కేవలం గ్లామర్ కోణంలో వాడుకుంటూనే.. మరోవైపు వారిని మంచి చెడుల పరిధిలో బంధించడం సరికాదన్నారు. ఒకవైపు వారిపై జోకులు వేస్తూ, మరోవైపు వారిని 'దేవి'లా కొలుస్తూ పీఠంపై కూర్చోబెట్టడం తనకు అస్సలు నచ్చలేదని రాధిక ఆప్టే స్పష్టం చేశారు.

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala Mohan, PRGI.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737